జులై
2026

243

సంపుటి : 22 సంచిక : 2

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

పునరుత్తేజం పొందిన వామపక్షం నేటి అవసరం
పడిపోయారే తప్ప ఓడిపోలేదు
భారతీయ విద్యావ్యవస్థ కుంభకోణాల మయం
ఉత్తర భారత పట్టణాల్లో 13,14 శతాబ్దాల నాటి సామాజిక తరగతులు
క్యూబాపై అమెరికా కుట్రలను తిప్పికొట్టాలి
ఆంటోనియో గ్రాంసీ: ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం
"కాక్రోచ్"లు సంక్షోభ మూలాల్లోకి వెళ్లాలి
మోడీ ప్రభుత్వ విధానాలతో దిగజారుతున్న ఆర్థిక వృద్ధి
ఒక స్వతంత్ర మహిళ సాహసోపేత ప్రయాణం

# ఒక స్వతంత్ర మహిళ సాహసోపేత ప్రయాణం

## రొమిలా థాపర్ రచన - 'జస్ట్ బీయింగ్'

**ఇష్షితా మిత్ర**

ఆమె కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం'పై ఉపన్యసించడానికి మా కాలేజీకి వచ్చారు. అప్పుడు నేను అదే కాలేజీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బ్యాచిలర్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన రొమిలా థాపర్ నలుపు రంగు దుస్తులు ధరించి ఉన్నారు. తెల్లటి అలల్లాంటి ఆమె జుట్టు ముడి చుట్టుకుని ఉంది. చేతి వేళ్ళకు సంక్లిష్టమైన డిజైన్లతో కూడిన పెద్ద వెండి ఉంగరాలు తొడుక్కుని ఉన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలోని మిరాండా హౌస్ సెమినార్ హాల్ కిక్కిరిసి పోయింది. కొందరు విద్యార్థులు దూరం నుండైనా రొమిలాను చూడాలని ఆ హాల్ వెలుపల కూడా గుమికూడారు.

నాకు గుర్తున్నంత వరకు ఆ రోజున ఆమె ఉపన్యాసంలో ఇతిహాసంలోని శకుంతల చిత్రణకు, కాళిదాసు పాత్యగ్రంథంలోని శకుంతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మనం విమర్శనాత్మకంగా ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా విశ్లేషించాలో వివరించారు.

ఇతిహాసంలో శకుంతల సొంత నిర్ణయాధికారం (agency) ఉండి, అధికారానికి ఎదురునిలిచి నిజం మాట్లాడిన మహిళ. కాళిదాసు కథలో మాత్రం ఎలాగోలా పితృస్వామ్య సిద్ధాంతాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మారిపోయింది. మహాభారతంలో ఆమె దేనికైతే ప్రతీకగా నిలిచిందో దానికి పూర్తిగా భిన్నంగా, కాళిదాసు పాఠంలో శకుంతల దుష్యంతుడి అధికారానికి లొంగిపోతుంది. సాంప్రదాయ యుగపు నిబంధనలు, పితృస్వామ్య ఆధిపత్యం కాళిదాసు శకుంతల పాత్ర చిత్రణ ద్వారా వెల్లడవుతాయి. ఆమె ఒక తిరుగుబాటు మహిళగా కాకుండా, సంఘనీతికి, కట్టుబాట్లకు లోబడి ఉండే మహిళగా గుర్తింపును కోరుకుంటుంది. ఇదంతా వింటున్నప్పుడు, దుష్యంతుడి మరుపుకు మందు అయిన ఆ "గుర్తింపు ఉంగరం" ఆ రోజు థాపర్ ధరించిన ఉంగరమేనేమో అని నేను ఊహించుకున్నాను. బహుశా ఆమె ఆధునిక కాలపు శకుంతలయి, అన్యాయాన్ని ప్రశ్నించడానికి, తిరుగుబాటు చేయడానికి మనల్ని ప్రోత్సహిస్తుందేమో; భావోద్వేగాలు మనల్ని ముక్కలు చేస్తున్నప్పుడు కూడా నిజాన్ని అన్వేషించడానికి, మన ముందున్న అన్ని అవకాశాలను తూకం వేయడానికి, హేతుబద్ధంగా ఉండటానికి పిలుపునిస్తుందేమో. బహుశా ఆమెకు ఆ రహస్యం తెలిసి ఉండవచ్చు. శకుంతలకు ఏమైందో బహుశా ఆమెకు తెలిసి ఉండవచ్చు. నిజంగా మంత్రముగ్ధులను చేసే అనుభవం అది. ఇది దాదాపు రెండు దశాబ్దాల క్రితం ముచ్చట.

ఈ సంవత్సరం, థాపర్‌కు 95 ఏళ్లు నిండుతాయి. ఆమె రాసిన పుస్తకం 'జస్ట్ బీయింగ్' విడుదలైంది. సీగల్ బుక్స్ ప్రచురించిన ఈ జ్ఞాపకాలు, ఒక మనిషి ప్రతి రోజును నిండు మనసుతో జీవించారనడానికి నిదర్శనంగా నిలుస్తాయి. ఆమె జీవితాన్ని చదవడం అనేది ఆ పురాణ "గుర్తింపు ఉంగరం" కోసం చేసే అన్వేషణలా ఉంటుంది. మీ చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకుంటూనే, మీ స్వంత వ్యక్తిత్వాన్ని, మీ అంతర్గత ఉనికిని గుర్తించడం.

**రొమిలా తోట**

ప్రారంభ పేజీలు థాపర్‌కి అత్యంత ఆత్మీయమైన, బహుశా ఆమెకు ఇష్టమైన ప్రదేశాన్ని మనకు విరివిగా చూపిస్తాయి: అదే ఆమె తోట, ఆడమ్ లేని ఆమె ఈడెన్ గార్డెన్. ఆమె తన తోటను ఎంతో శ్రద్ధగా చూసుకుంటుంది; దశాబ్దాల క్రితం ఆమె నాటిన మొక్కలు ఇప్పుడు పెరిగి పెద్ద వృక్షాలయ్యాయి; తోటలో ఎదురుబడే ఊసరవెల్లి అది తన దారిన తాను వెళ్లేవరకు ఆమె దానితో ఆడే చూపుల ఆట; ఆమె మొదటి పెంపుడు జంతువు అంబ మరణించిన తర్వాత, రంఝూ మరియు బుల్లే అనే ఆమె రెండు కుక్కలు ఆమెకు తోడుగా ఉంటున్నాయి. ప్రతి ఉదయం ఆమె అల్పాహారం పంచుకునే మైనా పిట్టలు, బుల్ బుల్‌లు, ఇంకా తెల్లవారుజామున వినిపించే మాటల సంగీతం ఒక అందమైన చిత్రాన్ని గీస్తాయి.

నెమ్మదిగా, ఆ ప్రశాంతమైన దృశ్యం నుండి కదులుతూ, చరిత్రకారిణి చివరకు ఒక భిన్నమైన ప్రపంచపు వాస్తవాలలోకి మేల్కొంటుంది. వైవిధ్యభరితమైన నేపథ్యాలు, సంస్కృతులు, మతాలకు చెందిన ప్రజలు, తమ మధ్య



వైరుధ్యాలు, అంతర్లీన అసమానతలు ఉన్నప్పటికీ కలిసి జీవించగలిగిన నాటి రోజులతో పోలిస్తే, నేటి ప్రపంచం అలా కనిపించడం లేదు. ఈ జ్ఞాపకాల పేజీల ద్వారా, థాపర్ నిర్మొహమాటంగా, అదే అంశాన్ని మన గమనింపులోకి తెస్తుంది. అదే సమయంలో ఎంతో సంయమనంతో వివరిస్తుంది. భావోద్వే గాల కంటే వాస్తవాలకే ప్రాధాన్యత ఇస్తుంది.

థాపర్ తనకు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించింది. ప్రపంచ యుద్ధాల సమయంలో మిలిటరీ ఆసుపత్రులలో పనిచేయడం కోసం డాక్టర్ అయిన తన తండ్రి ఎప్పుడూ ప్రయాణాల్లోనే ఉండేవారని గుర్తుచేసుకుంటుంది. ప్రారంభంలోనే మనసుపై ముద్ర వేసే అద్భుతమైన విషయాలలో ఒకటి... మహిళల విద్యను ప్రోత్సహించని ఆ కాలంలో, విప్లవాత్మక మహిళగా ఉన్న తన అమ్మమ్మ పట్ల చిన్ననాటి థాపర్‌కు గల విపరీతమైన ఆశ్చర్యం, ఎడతెగని ఆరాధనా భావం మనకు తెలియ వస్తుంది. ఆమె కుమార్తె (థాపర్ తల్లి) ఒక షరతు మీద తన భాగస్వామిని వివాహం చేసుకుంది. నేను ఎప్పటికీ మేలి ముసుగు వేసుకోను, వంట చెయ్యను - ఇవీ థాపర్ తల్లి విధించిన షరతులు. లింగ సమానత్వం గురించి ఓనమాలు తెలియని 1930ల నాటి భారతదేశంలో ఈ షరతులకు ఒప్పుకోవడం విచిత్రమే కదా.

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఒక స్వతంత్ర మహిళ సాహసోపేత ప్రయాణం

ఇష్షితా మిత్ర..........2

2. పునరుత్తేజం పొందిన వామపక్షం నేటి అవసరం

ఎంఎ బేబీ.......4

3. పడిపోయారే తప్ప ఓడిపోలేదు

టికె రాజా లక్ష్మి.......8

4. భారతీయ విద్యావ్యవస్థ కుంభకోణాలమయం

సుచేతా దలాల్.....11

5. ఉత్తర భారత పట్టణాల్లో 13, 14 శతాబ్దాల నాటి సామాజిక తరగతులు

ఎంవి ఎస్ శర్మ.......14

6. క్యూబాపై అమెరికా కుట్రలను తిప్పికొట్టాలి

పీటర్ బొహ్మెర్..........17

7. ఆంటోనియో గ్రాంసీ: ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం

ఎస్ వెంకట్రావు......21

8. "కాక్రోచ్"లు సంక్షోభ మూలాల్లోకి వెళ్లాలి

సాహిల్ బధ్వర్.....29

9. మోడీ ప్రభుత్వ విధానాలతో దిగజారుతున్న ఆర్థిక వృద్ధి

ఎ కోటిరెడ్డి ......32



సంపాదకుడు :

**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# మహా ప్రమాదం

**ల**క్ష్యం మంచిదైనప్పుడు దాన్ని సాధించడానికి ఏ మార్గాన్నయినా ఎంచుకోవచ్చు అనేది ఆంగ్ల సామెత. అనుకున్న లక్ష్యమే కాదు దాన్ని సాధించడానికి ఎన్నుకున్న మార్గం కూడా నైతికంగా సమర్థనీయంగా ఉండాలి అనేది మహాత్మా గాంధీ ఎంచుకున్న మార్గం. అందుకే ఆయన స్వాతంత్ర్య సముపార్జన కోసం సత్యాగ్రహమార్గాన్ని ఎన్నుకున్నారు. అయితే, ప్రస్తుతం కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న ఆర్ఎస్ఎస్-బిజెపి ఈ రెంటికీ భిన్నమైన మార్గాన్ని ఎంచుకుంది. అది ఎంచుకున్న లక్ష్యం నీచమైనది, దాన్ని సాధించడానికి ఎన్నుకున్న మార్గం అంతకన్నా నీచమైనది. మన పూర్వీకులు మహత్తర పోరాటాలతో, లక్షలాది ప్రాణత్యాగాలతో సాగించిన స్వాతంత్ర్య పోరాట ఫలం మన రాజ్యాంగం. ఆ రాజ్యాంగాన్ని వమ్ము చేసి దాని స్థానంలో ప్రమాదకరమైన మనువాద రాజ్యాంగాన్ని ప్రతిష్టించడం, హిందూత్వ పాలనను శాశ్వతం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ దాని రాజకీయ విభాగమైన బిజెపి ఆ లక్ష్య సాధనకోసం అనుసరిస్తున్న మార్గం మరింత ప్రమాదకరంగా ఉంది.

వందేళ్ల ఆర్ఎస్ఎస్ తన లక్ష్య సాధనలో భాగంగా తొలుత రాజ్యాధికారం సంపాదించడానికి మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా విష ప్రచారం చేసింది, మతఘర్షణలు రెచ్చగొట్టింది, రామజన్మభూమి చుట్టూ రాజకీయాలు నడిపింది, దేశ విదేశీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడానికి సిద్ధమైంది. చివరికి సఫలమైంది. అధికారం చేపట్టింది మొదలు రాజ్యాంగ వ్యవస్థల స్వాతంత్ర్యాన్ని వమ్ము చేస్తూ వాటిని తన చెప్పుచేతుల్లో పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సైన్యం, న్యాయవ్యవస్థ, చివరికి ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసే పనిముట్లుగా మార్చుకుంది. ఇప్పుడిక చివరి ప్రయత్నంగా పార్లమెంటులో నాలుగింట మూడొంతుల మెజారిటీని దొడ్డిదోవలో సాధించడం ద్వారా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి ప్రాతిపదిక ఏర్పరుచుకుంటోంది. ఇటీవలి కాలంలో ప్రతిపక్షాలను తనతో కలుపుకోవడం, కలవని పార్టీలను చీల్చడం ఇందులో భాగమే.

నిజానికి ఆర్ఎస్ఎస్-బిజెపి గత సార్వత్రిక ఎన్నికల్లోనే రాజ్యాంగ సవరణకవసరమైన మెజారిటీ సాధించాలనుకుంది. అందుకే ఎన్నికల్లో అది "అబ్ కీ బార్ చార్ సౌ పార్" (ఈసారి 400 కన్నా ఎక్కువ(సీట్లు) అన్న నినాదం ఇచ్చింది. అయితే దేశ ప్రజలు విజ్ఞతతో వ్యవహరించారు. దానికి 400 స్థానాలు ఇవ్వలేదు సరికదా అంతకు ముందున్న మెజారిటీని కూడా తగ్గించేశారు. దాంతో ఇతర ప్రాంతీయ పార్టీల సహకారంతో అధికారంలో కొనసాగాల్సిన దుస్థితి దానికి పట్టింది. అయితే అది తన దుష్ట లక్ష్యం సాధించడానికి దుర్మార్గాలను అనుసరించడం మానలేదన్న విషయం నేడు ప్రతిపక్ష పార్టీలను ఇష్టారీతిన చీలుస్తున్న తీరు గమనిస్తే అర్థమవుతుంది. అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు ముగిసిన వెంటనే బిజెపి ప్రతిపక్షాలను నిలువునా చీల్చి తన మెజారిటీ పెంచుకునే కుట్రల్లో బిజీ అయింది. మహారాష్ట్రలోని శివసేన, ఎన్సిపి పవార్ వర్గంలో చీలికలు తెచ్చింది. ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్‌ను చీల్చింది. పంజాబ్‌లోనైతే ఆప్‌కు ఉన్న ఏడుగురు రాజ్యసభ సభ్యులను బిజెపిలో కలిపేసుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో మమతా బెనర్జీ ఓడిపోయిన వెనువెంటనే తృణమూల్ పార్టీ పార్లమెంటరీ విభాగంలో పెద్ద చీలిక తెచ్చి వారిని పరోక్షంగా తనలో కలిపేసుకుంది. తరువాత శివసే (యుబిటి) లో మరో చీలిక తెచ్చింది. ఇక ఉత్తర ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ పని పడతామని బిజెపి నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు.

గత ఎన్నికల్లో తనకు రాని మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడమే లక్ష్యంగా బిజెపి ఈ కుట్రలకు పాల్పడుతున్న దన్న విషయం గమనించాలి. ప్రతిపక్షాలను ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలను చీల్చడానికి అది అధికారం, డబ్బు, పదవులు, బెదిరింపులు, కక్షసాధింపులు ఒకటేమిటి అన్ని రకాల అనైతిక పద్ధతులకు పాల్పడుతోంది. ఈ మెజారిటీ సాధించిన వెంటనే పార్లమెంటులో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లును నెగ్గించుకోవడం దాని తక్షణ లక్ష్యం. దాంతోపాటు హిందుత్వ ఎజెండా అమలుకు సంబంధించిన అనేక బిల్లులు ఆమోదించుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని వమ్ముచేయదలుకుంది. ఒక సారి నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లు ఆమోదం పొందితే తనకు ప్రాబల్యం ఉన్న ఉత్తరాదిలో పార్లమెంటు సీట్లు గణనీయంగా పెరుగుతాయి. తద్వారా అన అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్-బిజెపి భావిస్తున్నాయి.

అందువల్ల అత్యంత ప్రమాదకరమైన ఈ ఆర్ఎస్ఎస్-బిజెపి కుట్రలను తిప్పికొట్టడం నేడు దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం. వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఈ కర్తవ్య నిర్వహణకోసం ప్రజలను పెద్ద ఎత్తున కదిలించాల్సిన అవసరం ఉంది.

**ఇంటర్వ్యూ**

# పునరుత్తేజం పొందిన వామపక్షం నేటి అవసరం



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీతో ఫ్రంట్‌లైన్ పక్ష పత్రిక సీనియర్ డిప్యూటీ ఎడిటర్, రాజకీయ, సామాజిక సమస్యల విశ్లేషకురాలైన టి.కె. రాజలక్ష్మి చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం...సంపాదకుడు**

**- ఎంఎ బేబీ**

దేశంలో వామపక్షాలు మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రాల్లో అధికారాలను కోల్పోవడం, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో, ముఖ్యంగా వామపక్ష పార్టీల ఎన్నికల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గడం దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలకూ ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఫ్రంట్‌లైన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిపిఐ(యం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ క్రింది విధంగా స్పందించారు.

వామపక్షాల ఎన్నికల బలం ఇంతగా తగ్గిపోవడం గతంలో ఎన్నడూ జరగలేదని ఆయన అంగీకరించారు. అయితే పార్టీ మౌలిక రాజకీయ వైఖరిని మార్చకుండా, పరిస్థితులకు అనుగుణంగా కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అత్యవసర అవసరం ఉందని చెప్పారు. ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయి పోరాటాలు, ఉద్యమాల్లో యువత భాగస్వామ్యం ద్వారా మరలా వామపక్ష పార్టీలకు ప్రజల్లో ఆదరణ పెరగడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని వివరించారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల మతోన్మాద, విభజన రాజకీయాలను భావజాలపరంగానూ, రాజకీయంగానూ ఎదుర్కోవడం వామపక్షాల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్న ఆయన, అదే సమయంలో పెట్టుబడిదారీ, నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటం కూడా ఆ పోరాటంలో అంతర్భాగ మేనని స్పష్టం చేశారు.

**ప్రశ్న:** పశ్చిమ బెంగాల్, కేరళ ఎన్నికల ఫలితాలు వామపక్షానికి ఎలాంటి సందేశం ఇస్తున్నాయి?

**ఎం.ఎ. బేబీ :** 1977 తర్వాత సిపిఐ(యం) నేతృత్వంలోని ప్రభుత్వం ఒక్క రాష్ట్రంలో కూడా లేకపోవడం ఇదే తొలిసారి. ఇది ఒక ప్రత్యేకమైన పరిస్థితి. పార్లమెంటరీ రంగానికి వెలుపల కూడా ప్రజల్లో మా పార్టీ ప్రభావం క్షీణించింది. అయితే దాని వెనుక ఉన్న కారణాలను గుర్తించి, లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా మళ్లీ బలంగా ముందుకు వస్తామనే విశ్వాసం మాకు ఉంది. అందుకోసం మా మౌలిక రాజకీయ సిద్ధాంతాలను మార్చకుండా, ప్రస్తుత పరిస్థితులకు తగ్గ కొత్త వ్యూహాలను రూపొందించాలి.

ఈ రాజకీయాలను యువతకు, ముఖ్యంగా జెన్-జెడ్ తరానికి చేరవేయడం సవాలుతో కూడుకున్న పని. అయినప్పటికీ అది అసాధ్యమేమీ కాదు. వారితో మరింత దగ్గరయ్యేలా సరి కొత్త పద్ధతులను అభివృద్ధి చేయాలి.


భారత్‌లో పెరుగుతున్న మత విశ్వాసాలను మత విద్వేషాలకు ఆయుధంగా ఉపయోగించుకోవడం, కమ్యూనిస్టులు ప్రజల మత విశ్వాసాలకు వ్యతిరేకమంటూ సృష్టించిన తప్పుడు ప్రచారం కూడా ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. వీటిని మేము సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంది.

**ప్రశ్న:** నయా-ఉదారవాద విధానాలు, పెరుగుతున్న మతపరమైన విద్వేషాలు, సంక్షేమ, అస్తిత్వ రాజకీయాల సవాళ్లను వామపక్షం తమ సైద్ధాంతిక చట్రంలోనే సమర్ధవంతంగా ఎదుర్కోగలదా?

**ఎం.ఎ. బేబీ:** నయా-ఉదారవాదం, అలాగే ప్రజల ప్రధాన సమస్యలకు ఎలాంటి శాశ్వత పరిష్కారాన్ని చూపని సంక్షేమ, అస్తిత్వ ఆధారిత రాజకీయాలను ఎదుర్కోవాలంటే మా రాజకీయ, భావజాల దృక్పథాన్ని కాలానుగుణంగా నిరంతరం నవీకరించుకోవాలి. వర్గపోరాట దృక్పథాన్ని కొనసాగిస్తూనే, దానిని సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంతో అనుసంధానించడం ద్వారానే మేము దీనిని సాధించగలం. ఈ ప్రక్రియ ద్వారా లౌకికవాద భావాలు కలిగిన అన్ని వర్గాల ప్రజలను ఏకం చేయడం ద్వారా మత ధ్రువీకరణ, మతోన్మాద రాజకీయాలను సమర్థంగా ఎదుర్కోవచ్చు.. అలాగే సాధారణ మత విశ్వాసులకూ మతాన్ని రాజకీయ స్వార్థం కోసం, మతతత్వ ప్రచారం కోసం దుర్వినియోగం చేసేవారికీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం కూడా చాలా ముఖ్యం. మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే వారికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సాధారణ మత విశ్వాసాలు గల ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలి.

**ప్రశ్న:** పార్లమెంట్‌లో బలం తగ్గిన పరిస్థితిలో ప్రజావ్యతిరేక విధానాలను వామపక్షం ఎలా సమర్థంగా ఎదుర్కోగలదు?

**ఎం.ఎ. బేబీ:** పార్లమెంటరీ రాజకీయాలకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ప్రజల జీవన సమస్యలపై పార్లమెంట్ వెలుపల కూడా ఉద్యమాలు నిర్వహించడం మా రాజకీయాల్లో అంతర్భాగం. ఉత్తర భారతదేశంలోని 13 రాష్ట్రాల్లో గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిపిఐ(యం) 33 "జన ఆక్రోష్ యాత్రలు" నిర్వహించింది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి మూడో వారం వరకు జరిగిన ఈ యాత్రలు, మార్చి 24న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ ర్యాలీతో ముగిశాయి.




**ప్రశ్న:** ఎన్నికల పరాజయాలు ప్రజల సమస్యలపై మరింతగా పని చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయా?

**ఎం.ఎ. బేబీ:** అవును. ప్రజల జీవనోపాధి సమస్యలపై మరింత శక్తివంతంగా పోరాడాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అన్ని స్థాయిల్లో ప్రజలతో నిరంతర, సన్నిహిత సంబంధాలను కొనసాగించడం కూడా అత్యంత ముఖ్యమైనది.

**ప్రశ్న:** ప్రస్తుతం భారత్‌లో వామపక్షం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు ఏమిటి?

**ఎం.ఎ. బేబీ :** భావజాలపరంగానూ, రాజకీయంగానూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ఎదుర్కోవడం మా తక్షణ ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాం. అదే సమయంలో సామాన్య ప్రజల జీవితాలను తీవ్రంగా దెబ్బతీస్తున్న పెట్టుబడిదారీ నయా-ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కూడా దీనిలో అంతర్భాగమే.

కుల అణచివేతను ఎదుర్కోవడం, మహిళలపై జరుగుతున్న దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడం, అలాగే మైనార్టీలు, అట్టడుగు వర్గాల హక్కులను కాపాడడం కూడా మా పోరాటంలో కీలకమైన అంశాలు.

**ప్రశ్న:** వామపక్ష పార్టీలు, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ వంటి 'ఇండియా' వేదికలోని ప్రధాన భాగస్వాములు ఇప్పుడు అధికారంలో లేకపోవడంతో 'ఇండియా' వేదిక ప్రాధాన్యత కోల్పోయిందా?

**ఎం.ఎ. బేబీ :** 'ఇండియా' వేదిక పని తీరులో కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమే. అయితే ఎన్నికలు వచ్చినప్పుడు, ప్రతి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను బట్టి బిజెపి, దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ శక్తులను ఏకం చేయగలుగుతాం. పార్లమెంట్‌లో కూడా ప్రతిపక్ష పార్టీల మధ్య ఫ్లోర్ సమన్వయాన్ని కొనసాగిస్తాం. కొన్ని రాష్ట్రాల్లో 'ఇండియా' వేదికలోని పార్టీలు కలిసి పనిచేయడానికి ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయి. అలాంటి పరిస్థితులను తప్పించలేం.

**ప్రశ్న:** తమిళనాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు మీ పార్టీ ఎందుకు మద్దతు ఇవ్వాల్సి వచ్చింది?

**ఎం.ఎ. బేబీ:** అన్నాడీఎంకేను ఉపయోగించుకుని తమిళనాడులో అధికారాన్ని చేజిక్కించుకోవాలని బిజెపి ప్రయత్నించింది. అది విఫలమైన తర్వాత, గవర్నర్‌ను దుర్వినియోగం చేసి వెనుక దారి నుండి అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కుట్ర చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియమించిన గవర్నర్ ద్వారా బిజెపి తన రాజకీయ లక్ష్యాలను అమలు చేయాలని ప్రయత్నించింది. ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే పూర్తి మెజారిటీకి 11 స్థానాలు తక్కువగా వచ్చాయి. రాజ్యాంగ స్ఫూర్తి, సుప్రీంకోర్టు తీర్పు రెండూ స్పష్టంగా ఉన్నాయి. అతిపెద్ద పార్టీనే ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ ఆహ్వానించాలి. కానీ ఆయన అలా చేయలేదు. అలాంటి పరిస్థితుల్లో సిపిఐ(యం), సిపిఐ, విడుతలై చిరుతైగల్ కచ్చి (వీసీకే) కలిసి టీవీకేకు మద్దతు ఇవ్వడం సరైన నిర్ణయంగా భావించాం.

ఈ నిర్ణయం ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడమే కాకుండా, రాష్ట్రపతి పాలన విధించే అవకాశాన్ని లేదా బిజెపి కనుసన్నల్లో నడిచే అవకాశవాద ప్రభుత్వాన్ని అడ్డుకుంది. ప్రస్తుతం మేము బయట నుండి అందిస్తున్న మద్దతును తమిళనాడు ప్రజలు, ముఖ్యంగా యువత, అలాగే ఇతర ప్రాంతాల ప్రజలు కూడా విస్తృతంగా స్వాగతిస్తున్నారు.

**ప్రశ్న:** ఎన్నికల రాజకీయాలకు అతీతంగా వామపక్షం తిరిగి బలోపేతమై, ఒకప్పుడు ప్రజలతో ఉన్న అనుబంధాన్ని పునరుద్ధరించుకోగలదా?

**ఎం.ఎ. బేబీ:** ఎన్నికల రాజకీయాల్లోనే కాదు, ఎన్నికలకు అతీతంగా కూడా వామపక్షం పునరుత్తేజం పొందకపోతే ప్రమాదంలో పడేది కేవలం వామపక్షం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తు కూడా. నోయిడాలో నిస్సహాయులైన కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేస్తున్న సమయంలో సిపిఐ(యం) నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, పార్టీ ఎంపీలు సంఘటన స్థలానికి వెళ్లి వారికి అండగా నిలిచారు. కార్మికుల ప్రయోజనాల పట్ల సిపిఐ(యం), వామపక్షాల నిబద్ధతకు ఇది నిదర్శనం. మేము స్పందించినట్లుగా మరే రాజకీయ పార్టీ గానీ, కార్మిక సంఘంగానీ జోక్యం చేసుకోలేదు. అణచివేతకు గురవుతున్న కార్మికుల విముక్తి ఆకాంక్షలను ప్రతిబింబించే రాజకీయాలే వామపక్ష రాజకీయాల ప్రత్యేకత. దేశంలోని అత్యధిక ప్రజలు ఇదే దోపిడీ, అణచివేతను

ఎదుర్కొంటున్నారు అనేది వాస్తవం. అందుకే వామపక్ష రాజకీయాలకు వారి జీవితాలతో సహజమైన, వాస్తవమైన అనుబంధం ఉంది.

**ప్రశ్న:** ఎన్నికల వ్యవస్థపై డబ్బు, కార్పొరేట్ మీడియా చూపుతున్న అసమాన ప్రభావాన్ని వామపక్షం ఎలా అధిగమించగలదు?

**ఎం.ఎ. బేబీ:** మన దేశంలో రాజకీయాలు అప్పుడప్పుడూ జరిగే ఎన్నికలకు మాత్రమే పరిమితమైపోయిందనేది నిజం. ఎన్నికలపై బూర్జువా రాజకీయ పార్టీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అవి అపారమైన ధనబలం, కార్పొరేట్ మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా) అలాగే కండబలాన్ని కూడా వినియోగిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంచుకునే ప్రత్యామ్నాయ సమాచార వ్యవస్థలను అభివృద్ధి చేయడం తమ బాధ్యతగా భావించాలి. కాలనీలు, గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా అనుసంధానం పెంచుకోవాలి. కేరళలోని కైరళి టీవీ, లెఫ్ట్ వ్యూస్ వార్తా పోర్టల్ ఈ దిశలో చేసిన ప్రత్యామ్నాయ ప్రయోగాలకు ఉదాహరణలు. అలాగే ఎన్నికల సంస్కరణల కోసం నిరంతర పోరాటం కూడా అత్యంత అవసరం. ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనలు కేవలం ఉల్లంఘించడానికే అన్నట్లుగా మారాయి. ఈ సమస్యలపై విస్తృత ప్రజాస్వామ్య వేదికను అత్యవసరంగా నిర్మించాల్సిన అవసరం ఉంది.

**ప్రశ్న:** వామపక్షం తిరిగి బలోపేతం కావాలంటే ఏమి చేయాలి?

**ఎం.ఎ. బేబీ:** ప్రస్తుతం వామపక్షాల ఎన్నికల బలం, ప్రజలను సమీకరించే శక్తి తగ్గిందని చెప్పి, భారతదేశంలో వామపక్షానికి భవిష్యత్తు లేదని నిరాశావాద నిర్ణయానికి రావడం సరైంది కాదు. నయా–ఉదారవాద విధానాల దివాలాకోరుతనం రోజురోజుకూ స్పష్టంగా బయటపడుతోంది. ప్రస్తుతం దేశంలోని దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు నయా–ఉదారవాద విధానాలనే అనుసరిస్తున్నాయి. వాటికి ప్రత్యామ్నాయాన్ని చూపగల ఏకైక రాజకీయ శక్తి వామపక్షమే. అదే భారతదేశంలో వామపక్ష భవిష్యత్తుకు బలమైన పునాది. కేరళలో గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం, భారత సమాఖ్య వ్యవస్థలో ఉన్న పరిమితుల మధ్య కూడా తీవ్రమైన పేదరికం లేని, మరింత సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమేనని నిరూపించింది. సాధారణ ప్రజల మౌలిక అవసరాలను తీర్చే పాలనను అందించింది. అదే సమయంలో మౌలిక వసతుల లోటును అధిగమించడం, నాలెడ్జ్ ఎకానమీ వైపు రాష్ట్రాన్ని మళ్ళించడం ద్వారా చదువుకున్న యువతలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపే దిశగా కూడా చర్యలు చేపట్టింది. ఇవన్నీ లౌకిక, ప్రగతిశీల విలువలను కాపాడుకుంటూనే సాధించేందుకు ప్రయత్నించింది. అయితే, నేను చెప్పిన ఈ విషయాలపై వెంటనే ఒక ప్రశ్న వస్తుందని నాకు తెలుసు. “అంత మంచి పాలన అందించినట్లయితే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షానికి ఇంత పెద్ద ఎన్నికల ఎదురుదెబ్బ ఎందుకు తగిలింది?” అనేది ఆ ప్రశ్న. దీనికి సమాధానం అంత సులభం కాదు. సమాజంలోని పేద వర్గాలు ఇప్పటికీ మా వెంటే నిలిచాయి. కానీ మధ్యతరగతిలో కొంత మార్పు కనిపించింది. కుల, మత, సామాజిక అస్థిత్వ రాజకీయాల సంక్లిష్ట ప్రభావమే దీనికి ప్రధాన కారణం. అదే విధంగా, కొన్ని నియోజకవర్గాల్లో నేషనల్ డెమాక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ), యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) మధ్య వ్యూహాత్మక ఓటింగ్ జరిగినట్లు కూడా మేము అనుమానిస్తున్నాం. ఎల్‌డీఎఫ్‌కు ఓట్ల శాతం తగ్గినప్పటికీ, ఎన్‌డీఏ ఓట్ల శాతం కూడా తగ్గింది. అయితే మా ముందున్న అసలు ప్రశ్న ఏమిటంటే... ఎల్‌డీఎఫ్ నుంచి ప్రజల ఓట్లు ఎందుకు దూరమయ్యాయన్నది తెలుసుకోవడం.

ఎక్కువకాలం అధికారంలో కొనసాగడం వల్ల పార్టీలో బలహీనతలు పెరిగే ప్రమాదం ఉంటుంది. రెండోసారి వరుసగా అధికారంలోకి వచ్చిన తర్వాత మేమే రూపొందించిన మా ‘దిద్దుబాటు పత్రంలో ఇలాంటి లక్షణాలను గుర్తించి, మా కార్యకర్తలను ముందుగానే అప్రమత్తం చేశాం. అయినప్పటికీ, మా బలహీనతలను పూర్తిగా అధిగమించడంలో ఆశించినంత విజయం సాధించలేకపోయినట్లు తెలుస్తోంది. ప్రజలు వామపక్షాలను ఇతర పార్టీల కంటే భిన్నమైన ప్రమాణాలతో అంచనా వేస్తారు. ఆ అంచనాలకు తగిన స్థాయిలో మేము నిలవలేకపోయామని భావిస్తున్నాం. అందుకే ఇప్పుడు పార్టీ దిగువ స్థాయి నుంచి పైస్థాయి వరకు స్వేచ్ఛాయుతమైన, నిజాయితీతో కూడిన ఆత్మవిమర్శ, పరస్పర విమర్శ ప్రక్రియను చేపట్టాం. ఎన్నికల పరాజయానికి దారితీసిన కారణాలను లోతుగా విశ్లేషించి, బలహీనతలను అధిగమించడమే దీని లక్ష్యం.

కేరళలో అధికార మార్పిడి జరగడం మాకు కొత్త విషయం కాదు. గతంలో ప్రభుత్వాలు మారుతూ వచ్చాయి. అయితే వరుసగా రెండోసారి అధికారంలో కొనసాగడం మాత్రం ఒక ప్రత్యేక పరిస్థితి. కేరళలో వామపక్షం బలంగా నిలబడటానికి చారిత్రక కారణాలున్నాయి. సామాజిక సంస్కరణ ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటం, కార్మిక, రైతు సంఘాల నిర్మాణంలో వామపక్షం కీలక పాత్ర పోషించింది. ఆ క్రమంలో భూ పంపిణీ, కార్మికుల వేతనాల పెంపు, అందరికీ విద్య, వైద్య సేవలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. ఈ బలమైన చారిత్రక పునాదే కేరళ రాజకీయాల్లో మళ్లీ వామపక్షం అగ్రస్థానానికి చేరుకుంటుందనే విశ్వాసాన్ని మాకు ఇస్తోంది.

పశ్చిమ బెంగాల్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లోని మా అనుభవాలను కూడా ఇదే విధంగా ఆత్మవిమర్శనాపూర్వకంగా సమీక్షించుకోవాలి. అదే సమయంలో కమ్యూనిస్టు పార్టీకి అత్యంత ముఖ్యమైన విషయం ప్రజల మధ్య ఉండటం. ముఖ్యంగా అట్టడుగు, అణగారిన, అణచివేతకు గురవుతున్న వర్గాల పక్షాన నిలబడాలి. ప్రజల జీవనోపాధి సమస్యలపై తీవ్రంగా పోరాడుతూనే, నరేంద్ర మోదీ––మోహన్ భగవత్––అమిత్ షా త్రయం అమలు చేస్తున్న మతోన్మాద, నయా–ఫాసిస్టు రాజకీయాలను సమర్థంగా ఎదుర్కోవడం అత్యంత కీలకం.

ఉత్తర భారత రాష్ట్రాల్లో మా పార్టీ నిర్వహించిన ‘జన్ ఆక్రోష్ యాత్రలు’, వాటి ముగింపుగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ ర్యాలీ, ప్రజల సమస్యలపై పార్లమెంట్ వెలుపల కూడా సిపిఐ(యం) నిరంతరం పోరాడుతుందనడానికి నిదర్శనం. పార్టీ, వామపక్ష శక్తులు కోల్పోయిన ప్రజా ప్రభావాన్ని తిరిగి సాధించాలంటే మరింత క్రమబద్ధమైన, విస్తృతమైన ప్రయత్నాలు అవసరం. పునరుత్తేజం పొందిన వామపక్షం లేకుండా భారతదేశానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యం కాదనేది నిస్సందేహం.

**ప్రశ్న:** ప్రతిపక్షాల ఐక్యతకు తృణమూల్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది, కానీ వామపక్షాలు, కాంగ్రెస్ ఆ ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించాయి.?

**ఎం.ఎ. బేబీ:** తృణమూల్ కాంగ్రెస్ ‘ఇండియా’ వేదికలో భాగస్వామ్య పార్టీ అన్నది నిజమే. అయితే పశ్చిమ బెంగాల్‌లో

తృణమూల్ కాంగ్రెస్ పాలనలో మా పార్టీకి చెందిన వందలాది మంది కామ్రేడ్లు హత్యకు గురయ్యారు. మా మహిళా కార్యకర్తలపై లెక్కలేనన్ని అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడులు జరిగాయి. అత్యాచారాలు, దాడులు చేస్తూ తృణమూల్ గూండాలు అర్థ ఫాసిస్ట్ పాలన చేశారు. ఇవే కాకుండా మా కార్యకర్తలపై లక్షకు పైగా తప్పుడు కేసులు బనాయించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. జీవనోపాధిని కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. "ఎర్రజెండాను వదలకపోతే ఈ గడ్డపై బతకలేరు" అని బెదిరించిన ఘటనలు కూడా జరిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో పశ్చిమ బెంగాల్‌లో బిజెపిని ఎదుర్కోవాలంటూ మమతా బెనర్జీ



పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో యువశక్తికి పట్టం కట్టిన పార్టీ

ప్రతిపక్ష ఐక్యతకు పిలుపునివ్వడం నిజాయితీతో కూడినది కాదని మేము భావిస్తున్నాం.

**ప్రశ్న:** ఎన్నికల ఫలితాలపై మీ పూర్తి విశ్లేషణ ఏమిటి?

**ఎం.ఎ. బేబీ:** అస్సాం, పుదుచ్చేరిలను బీజేపీ నిలబెట్టుకోవడం, అలాగే పశ్చిమ బెంగాల్‌లో మొదటిసారి అధికారంలోకి రావడం బిజెపి సాధించిన విజయం. హిందుత్వ, మతోన్మాద, కార్పొరేట్ శక్తుల బలోపేతానికి నిదర్శనం. ఇవి అత్యంత నిరంకుశ స్వభావం కలిగిన మితవాద శక్తులు. పది సంవత్సరాల పాటు అవినీతిరహిత, అభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలన అందించిన కేరళలోని సిపిఐ(యం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఓడిపోవడం పెద్ద ఎదురుదెబ్బే. కేరళలో బిజెపి మూడు స్థానాలు గెలుచుకోవడం కూడా ఆందోళన కలిగించే విషయం. అయితే తమిళనాడులో సిపిఐ(యం), సిపిఐ కలిపి నాలుగు స్థానాలు గెలవడం ద్వారా బిజెపి రాజకీయ వ్యూహాలను అడ్డుకోగలిగాయి. పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘ విరామం తర్వాత సిపిఐ(యం) మళ్లీ ఒక స్థానాన్ని గెలుచుకోవడం కొంత ఊరటనిచ్చే అంశం. పుదుచ్చేరిలో కూడా సిపిఐ(యం) ఒక స్థానం గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించినప్పటికీ, ఆ ప్రజా స్పందనను ఓట్లుగా మార్చుకోవడంలో మాత్రం మేము విఫలమయ్యాం.

**ప్రశ్న:** దేశంలో వామపక్షాల ఎదుగుదల అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేకపోవడానికి కారణాలేమిటి?

**ఎం.ఎ. బేబీ:** సిపిఐ(యం), వామపక్షాల అభివృద్ధి అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేకపోవడానికి గల కారణాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మేము ఎదుర్కొంటున్న పెద్ద సవాలు వామపక్ష ప్రభావం తగ్గిపోవడమే. ప్రజలతో మరింత బలమైన అనుబంధం ఏర్పరచుకోవడం, కులం, మత, అస్థిత్వ రాజకీయాలను సమర్థంగా ఎదుర్కోవడం మా ముందున్న ప్రధాన సవాళ్లు. ప్రజల జీవనోపాధి సమస్యలపై వర్గపోరాటాన్ని, సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంతో సమన్వయం చేయాలి. కమ్యూనిస్టులు వామపక్షాలకు వ్యతిరేకంగా కుల, మత, ప్రతీఘాత శక్తులు వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసుకుంటున్న విస్తృత కూటములే మా ఎదుగుదలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. వాటిని ఎదుర్కోవాలంటే అంతే బలమైన వామపక్ష, ప్రజాస్వామ్య ఐక్య వేదికలను నిర్మించాల్సి ఉంటుంది.

**ప్రశ్న:** పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు పుంజుకోవడానికి ఉన్న నిర్దిష్ట సవాళ్లు ఏమిటి ?

**ఎం.ఎ. బేబీ:** ఈ ఎన్నికల్లో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌తో సహా పెద్ద, చిన్న వామపక్ష పార్టీలు, సంస్థలను ఒక వేదికపైకి తీసుకురావడంలో గణనీయమైన పురోగతి సాధించాం. యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్రిగేడ్ పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభలు నిర్వహించగలిగాం. యువత, మురికివాడల ప్రజలు, కార్మికులు, రైతులు, గ్రామీణ పేదలను పెద్ద ఎత్తున సమీకరించగలిగాం.

ఇలాంటి ప్రజా ఉద్యమాలు ఎంతో ముఖ్యమైనవి. అయితే వాటిని ఓట్లుగా కూడా మలచుకోవాలి. త్వరలోనే మేము ఆ పనిలో కూడా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది..

**ప్రశ్న:** కొన్ని నియోజకవర్గాల్లో సిపిఐ(యం) బిజెపికి మద్దతు ఇచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బహిరంగంగా ఆరోపించారు. ఈ వాదనలో ఏమైనా నిజం ఉందా?

**ఎం.ఎ. బేబీ:** అది సిపిఐ(యం) పట్ల సానుభూతి ఉన్నవారిని, వామపక్ష భావజాలం కలిగిన ప్రజలను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అనుసరించిన తెలివైన రాజకీయ ఎత్తుగడ మాత్రమే. ఫాసిస్టు ధోరణులు కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న బీజేపీ ప్రమాదాలను అర్థం చేసుకునే రాజకీయ పరిపక్వత పశ్చిమ బెంగాల్‌లో మా కార్యకర్తలకు ఉందని మాకు తెలుసు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకికవాద విలువలను కాపాడటం, శ్రమజీవుల జీవనోపాధి కోసం వారితో కలిసి పోరాడటం, కుల అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించడం కమ్యూనిస్టులు, వామపక్షాల ప్రధాన కర్తవ్యం.

ఈ పోరాటంలో ఢిల్లీ మరియు కోల్‌కతాలోని బీజేపీ ప్రభుత్వాలే మా ప్రధాన లక్ష్యాలు. వీటి నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఇటువంటి ఇటువంటి అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని మేము భావిస్తున్నాం.

**(అనువాదం : కె. హరికిషోర్)** *

ఈ మాసం ప్రత్యేకం

# పడిపోయారే తప్ప ఓడిపోలేదు

**ఎన్నికల విజయాల పరంగా భారతదేశంలో వామపక్షాలు బహుశా అత్యంత బలహీన దశలో ఉన్నప్పటికీ, పెరుగుతున్న అసమానతలు, విభజనలు, బడా పెట్టుబడిదారుల ప్రాబల్యం అధికమవుతున్న నేటి పరిస్థితుల్లో  వాటి ప్రాసంగికత ఏమాత్రం తగ్గలేదు**



రచయిత ఫ్రంట్‌లైన్ పక్ష పత్రిక సీనియర్ డిప్యూటీ ఎడిటర్, రాజకీయ, సామాజిక సమస్యల విశ్లేషకురాలైన

టికె రాజా లక్ష్మి

భారతదేశంలో వామపక్షాలు వివిధ రకాల రాజకీయ వేదికలను కలిగి ఉన్నాయి. వీటి మధ్య అప్పుడప్పుడు తీవ్రమైన వివాదాలు తలెత్తినప్పటికీ, ఒక ప్రత్యేకమైన భావజాలంతో కూడిన రాజకీయాల ద్వారా ఇవి సాపేక్షంగా ఐక్యంగా నిలుస్తున్నాయి. 2026 నాటికి వామపక్షాలు శతవసంతాలు  పూర్తి చేసు కున్నాయి. ముఖ్యంగా కేరళ , పశ్చిమ బెంగాల్, త్రిపుర వంటి సాంప్రదాయ వామపక్ష కంచుకోటలలో సిపిఐ(ఎం) వామపక్షాలలో అతిపెద్ద భాగస్వామిగా ఉంది. అయితే బీహార్‌లో మాత్రం కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్ అత్యంత ప్రభావవంతమైన వామపక్ష పార్టీగా ఉంది.

2006లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ వరుసగా ఏడవసారి రికార్డు స్థాయిలో విజయాన్ని సాధించగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ నుండి కేరళను సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ చేజిక్కించుకుంది. ఆ సమయంలో త్రిపురలో కూడా లెఫ్ట్ పార్టీ అధికారంలో ఉంది. 2004 పార్లమెంటరీ ఎన్నికలు లోక్‌సభలో లెఫ్ట్ కూటమికి 60 సీట్లను అందించి, అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వాన్ని కూలదోశాయి. దాని స్థానంలో వచ్చిన యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఏ-1) ప్రభుత్వం మనుగడ కోసం వామపక్షాల మద్దతుపై ఆధారపడింది. 2006 నుంచి గడచిన ఇరవై ఏళ్లలో, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్న చివరి 12 ఏళ్లలో వామపక్షాల విజయావకాశాలు  బాగా క్షీణించాయి. కేరళలో వామపక్షాలు అధికారం కోల్పోయాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ ధోరణిని ధ్రువీకరిస్తున్నట్లు కనిపిస్తున్నాయి.

పార్లమెంటులో వామపక్షాలు తమ సంఖ్యాబలాన్ని ఎప్పుడో కోల్పోయాయి. కానీ ఇప్పుడు, మొదటిసారిగా వామపక్షాలు ఏ రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహించడం లేదు. అయితే, కేరళలో 2021లో ఎల్‌డిఎఫ్ దశాబ్దాల నాటి సంప్రదాయాన్ని బద్దలుకొట్టి వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ ఓటమిని చూడాలి. వరుసగా రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చరిత్ర మునుపెన్నడూ లేని రాష్ట్రంలో, 2021 నాటి తీర్పు పినరయి విజయన్ ప్రభుత్వ విధానాలకు లభించిన ఒక ప్రత్యేక ఆమోదంగా కనిపించింది.

### పశ్చిమ బెంగాల్ తీర్పు

పశ్చిమ బెంగాల్ తీర్పు మరింత ముఖ్యమైన పరిణామం. 34 ఏళ్ల పాటు అప్రతిహతంగా అధికారంలో ఉన్న తర్వాత 2011లో ఆ రాష్ట్రాన్ని కోల్పోయిన లెఫ్ట్ ఫ్రంట్, 2013లో త్రిపురలో విజయం సాధించి, అక్కడ తన అప్రతిహత పాలనను 35 ఏళ్లకు పొడిగించింది.  2018లో త్రిపురలో అది చివరకు ఓడిపోయినప్పుడు బిజెపి విజేతగా నిలిచి, ఐదేళ్ల తర్వాత అదే విజయాన్ని పునరావృతం చేసింది . దీనికి విరుద్ధంగా, పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల నుండి మితవాదం వైపు మళ్లడం రాత్రికి రాత్రే వచ్చిన మార్పు కాదు.

బెంగాల్‌లో వామపక్షాల స్థానాన్ని మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఆక్రమించింది. భారత ఎన్నికల సంఘం చేపట్టిన వివాదాస్పద ఓటర్ల సవరణ ప్రక్రియ మధ్య, తీవ్రంగా  సాగిన ఎన్నికల సమరంలో బిజెపి విజయం సాధించి, తృణమూల్ 15 ఏళ్ల పాలనకు తెర దించింది. 2026 ఎన్నికల తీర్పు తృణమూల్‌పై ఉన్న బలమైన ప్రభుత్వ వ్యతిరేకతను  ప్రతిబింబించినట్లు కనిపించినప్పటికీ, అది వామపక్షాలు కోల్పోయిన పట్టును తిరిగి పొందడంలో ప్రతిఫలించలేదు. దానికి బదులుగా, రాజకీయ చిత్రపటంలో మరో చివరన ఉన్న పార్టీ అయిన బిజెపి ఈ పరిస్థితి నుండి ఎక్కువగా లబ్ధి పొందింది.

తమిళనాడులో కొత్త తమిళగ వెట్రి కజగం ప్రభుత్వ ఏర్పాటుకు వామపక్షాల మద్దతు కీలకమైంది. అయితే, అధికారం నుండి ఓడిపోయిన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) నేతృత్వంలోని కూటమిలో వామపక్షాలు కూడా భాగస్వాములుగా ఉన్నాయి. అందువల్ల, తమిళనాడులోని ఈ తీర్పును దేశంలో వామపక్షాల ఎన్నికల ప్రాబల్యం సాధారణంగా క్షీణిస్తోందనడానికి ఒక నిర్ధారణగా చూడవచ్చు.

రాజకీయాలు మితవాదం వైపు మళ్లుతున్నందున భారతదేశంలో వామపక్షాలు కోలుకోలేని విధంగా పతనమవుతున్నాయా? లేక ఇది వామపక్షాలు తిప్పికొట్టగల, తిప్పికొట్టే ఒక తాత్కాలిక దశ మాత్రమేనా? అనే ప్రశ్నను ఇది ముందుకు తెస్తుంది.

### వామపక్షం అప్రస్తుతంగా మారిందా?

కేరళలో ఓటమి, పశ్చిమ బెంగాల్, త్రిపురలలో వామపక్షాలు నిర్ణయాత్మకంగా కోలుకోలేకపోవడం వల్ల, ఆ పార్టీ ప్రాసంగికతను కోల్పోయిందనే భావన ఏర్పడింది. 2024 పార్లమెంటరీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా దాదాపు ముప్పయి బిజెపియేతర, ఎన్డీయేతర పార్టీలతో ఏర్పాటైన  'ఇండియా బ్లాక్' కుప్పకూలుతుందనే సిద్ధాంతాలు కూడా విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి.

వామపక్షాలు, కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ), ఇంకా అనేక ఇతర ప్రాంతీయ మిత్రపక్షాలు ఈ బ్లాక్ వెనుక ప్రధాన శక్తులుగా నిలిచాయి. తెలివైన సీట్ల పంపకం, బిజెపి మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా లౌకిక విలువలను నిలబెట్టాలనే ఉమ్మడి నిబద్ధత వెరసి 2024లో ఇండియా బ్లాక్‌కు మంచి ఫలితాలిచ్చింది. ఎన్డీయే ఎలాగో ఒకలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగినప్పటికీ, దాని మొత్తం సీట్ల సంఖ్య తగ్గిపోయింది. ఈ ఫలితం అది చేసిన అర్థంలేని ' చార్ సౌ పార్' (400కు మించి) వాదనకు ఏమాత్రం దగ్గరగా లేదు.

అందువల్ల కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురలలో తగిలిన ఎదురుదెబ్బలు 'ఇండియా' బ్లాక్ ప్రయోగాన్ని, లౌకిక ప్రతిపక్ష ఐక్యత తాలూకు విస్తృత రాజకీయాలను చెల్లుబాటు కాకుండా చేయలేవని వామపక్ష నాయకుల అభిప్రాయం.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ, "మేము కేరళలో ఓడిపోయాం, పశ్చిమ బెంగాల్‌లో పుంజుకోలేకపోయాం తమిళనాడు, పుదుచ్చేరిలలో మేము భాగస్వాములుగా ఉన్న కూటమి ఓడిపోయింది. ఇటీవలి ఎన్నికలలో వామపక్షాల ఓటమి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. పంచాయతీ స్థాయి నుండి పార్లమెంటు స్థాయి వరకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాసంగికత ఉంది. 1957లో ఏకపక్ష పాలనను బద్దలు కొట్టి కమ్యూనిస్టులు చరిత్ర సృష్టించారు, అది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక చారిత్రక ఘట్టం" అన్నారు.

వామపక్షాల ప్రాముఖ్యతను కేవలం ఎన్నికల విజయాలు లేదా అపజయాల పరంగా మాత్రమే అంచనా వేయలేము. అయితే, శాసనసభలో సీట్లు గెలుచుకోవడం తాలూకు ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయకూడదు: ఎన్నికైన సంస్థలలో ఒక పార్టీకి ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడే, అది తన రాజకీయ దృక్పథానికి అనుగుణంగా విధానాలను రూపొందించడంలో తనదైన ముద్ర వేయగలదు. అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉన్న విధానాలలో పాతుకుపోయిన వామపక్షాల దృక్పథం, బహుశా రాజ్యాంగ స్ఫూర్తికి అత్యంత దగ్గరగా ఉంటుంది.

మొదటి యుపిఏ ప్రభుత్వ హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. చారిత్రాత్మక అటవీ హక్కుల చట్టాన్నీ ఆమోదించారు. సామాన్య ప్రజల జీవితాలపై నయా-ఉదారవాద విధానాల హానికరమైన ప్రభావం గురించి, ప్రజా వనరుల భారీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అలాగే ఆరోగ్యం, విద్య వంటి ప్రజా వినియోగ సేవలపై దాదాపు స్తంభించిపోయిన ప్రభుత్వ వ్యయం గురించి గట్టిగా గొంతెత్తిన ఏకైక రాజకీయ శక్తి వామపక్షాలే.

**" మనం ఒక విచిత్రమైన పరిస్థితికి వస్తున్నాము. ఇక్కడ నయా-ఉదారవాదంలోనే ఉండిపోవడం వల్ల పొదుపు చర్యలు, సామూహిక నిరుద్యోగం ద్వారా ప్రజలు అనేక అగచాట్లకు గురవుతారు. కానీ నయా-ఉదారవాదాన్ని దాటి వెళ్లడం అంత నొప్పి లేకుండా ఏమీ జరగదు. ఈ క్రమంలో మూలధన నియంత్రణలు, దిగుమతుల నియంత్రణలు, రేషనింగ్ వంటివి ఉంటాయి. ఈ రెండో మార్గాన్ని అనుసరించి, ఇతరులను కూడా వెంట తీసుకెళ్లగల ఏకైక మార్గం వామపక్షాలే. "**

**నయా-ఉదారవాదం: వామపక్షాల ప్రత్యామ్నాయ మార్గం**

జెఎన్‌యులోని సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ ఎమెరిటస్ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ, వర్గ రాజకీయాల అవకాశాన్ని పరిమితం చేసే నయా-ఉదారవాదం, నేడు వామపక్షాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బహుశా వివరించగలదని అన్నారు. ఆ కోణంలో చూస్తే, వామపక్షాలు బలహీనపడటంలో ఆశ్చర్యం లేదు. అయితే, సాంప్రదాయ నయా-ఉదారవాదం అంతమైందని కూడా పట్నాయక్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక మూలధనం చలనశీలంగా ఉన్నప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ వంటి దేశాలపై అసమాన వాణిజ్య ఒప్పందాలను రుద్దడం ద్వారా మూడవ ప్రపంచ దేశాల వనరులపై మరీ ముఖ్యంగా చమురు వనరులపై సైనిక నియంత్రణను కొనసాగించడం ద్వారా సాంప్రదాయ నయా-ఉదారవాదం నుండి వైదొలిగారు. ఈ విధానమే ఇరాన్‌పై యుద్ధానికి మూలకారణమని పట్నాయక్ చెప్పారు.

నయా-ఉదారవాద పాలనలో భారతదేశం ఇప్పుడు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కార్మికులు, రైతులు, చిల్లర ఉత్పత్తిదారులు, చివరికి ఇక్కడి చిన్న పెట్టుబడిదారులపై భారాన్ని మోపే సామ్రాజ్యవాద వ్యూహం వల్ల ఈ సంక్షోభం మరింత తీవ్రమవుతుందని పట్నాయక్ అన్నారు. నయా-ఉదారవాదాన్ని, దాని ప్రస్తుత రాజకీయ ప్రతిరూపమైన నయా-ఫాసిజాన్ని అధిగమించడానికి ప్రజలను, ఇతర రాజకీయ శక్తులను కూడా సమీకరించగల సామర్థ్యం వామపక్షాలకు మాత్రమే ఉందని ఆయన చెప్పారు.

మనం ఒక విచిత్రమైన పరిస్థితికి వస్తున్నాము. ఇక్కడ నయా-ఉదారవాదంలోనే ఉండిపోవడం వల్ల పొదుపు చర్యలు, సామూహిక నిరుద్యోగం ద్వారా ప్రజలు అనేక అగచాట్లకు గురవుతారు. కానీ నయా-ఉదారవాదాన్ని దాటి వెళ్లడం అంత నొప్పి లేకుండా ఏమీ జరగదు. ఈ క్రమంలో మూలధన నియంత్రణలు, దిగుమతుల నియంత్రణలు, రేషనింగ్ వంటివి ఉంటాయి. ఈ రెండో మార్గాన్ని అనుసరించి, ఇతరులను కూడా వెంట తీసుకెళ్లగల ఏకైక మార్గం వామపక్షాలే. ఈ పరివర్తనలో పేదలు తక్కువగా బాధపడేలా చూడటం కూడా వామపక్షాలకే సాధ్యం. కానీ వామపక్షాలకు ఒక అపారమైన చారిత్రక అవకాశం తెరుచుకుంటోంది. ఈ సవాలును స్వీకరించడానికి వామపక్షాలు ఎంతమాత్రమూ జంకవనే నేను భావిస్తున్నాను. ఎందుకంటే అలా భయపడితే ప్రజలు ఈ అనిశ్చితిలో చిక్కుకుపోయే కాలం మరింత పొడిగించబడుతుంది" అని ప్రభాత్ పట్నాయక్ అన్నారు.

"గుత్త పెట్టుబడితో పొత్తు పెట్టుకున్న నయా-ఫాసిస్ట్ శక్తుల దాడుల నుండి లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో వామపక్షాలు మంచి పాత్ర పోషిస్తాయి. "నయా-ఫాసిజానికి వ్యతిరేకంగా వామపక్షాలు ముందుండి నడిపించాల్సిన అన్ని రాజకీయ శక్తుల ఐక్యతకు ఒక నిర్దిష్ట ఆర్థిక ఎజెండా ఉండాలి. రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక ఆర్థిక హక్కులను చేర్చడం సరైన ప్రతిస్పందన అవుతుందని నేను నమ్ముతున్నాను. కానీ, నయా-ఫాసిజానికి వ్యతిరేకంగా వామపక్షాలు

"ఎన్నికల పరంగా చూసినప్పుడు 1952 తర్వాత వామ పక్షాలు ప్రదర్శించిన అత్యంత పేలవమైన సామర్థ్యాల్లో ఇదొకటి. అంతమాత్రాన దానికి సంతాపం రాయడం తొందరపాటే అవుతుంది. వామపక్షాల భావజాలానికి సంతాపం రాయడం అంటే, భారతదేశ భావనకు సంతాపం రాయడంతో సమానం. కానీ వామపక్షాలలో మరింత నూతనత్వం, కొత్త ఆలోచనలు రావాలి. అప్పుడే కొత్త తరం ముందుకు వస్తుంది."

సమీకరించడానికి ప్రయత్నించే వర్గాలలో కూడా అటువంటి ఎజెండాకు వ్యతిరేకత ఉంటుంది. అలాంటి సందర్భంలో ఎజెండాలోని ఉప అంశాలను ముందుకు తీసుకురావాలి. ఉదాహరణకు జాతీయ ఆరోగ్య సేవ లేదా ప్రాథమిక పాఠశాల నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ప్రభుత్వ సంస్థల ద్వారా ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడం లాంటి సర్వాంగీకార డిమాండ్లను ప్రజల ముందుంచాలి. నయా-ఫాసిజానికి వ్యతిరేకంగా విశ్వసనీయ కూటమి ఏర్పాటులో వామపక్షాలు ప్రధాన పాత్ర పోషించాలి," అని పట్నాయక్ సూచించారు.

ఆర్జేడీకి చెందిన రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, వామపక్షాలను అంత తేలికగా కొట్టిపారేయలేమని అభిప్రాయపడ్డారు. "ప్రతి ఎన్నిక తర్వాత, అందరూ పెద్ద చిత్రాన్ని చూస్తారు. అది తప్పుదోవ పట్టిస్తుంది. ప్రతి రాష్ట్ర ఎన్నిక ఆ రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కేరళలో ఎవరూ ఊహించని విధంగా ఎల్‌డీఎఫ్ వరుసగా రెండు ఎన్నికల్లో గెలిచింది. ఈసారి యుడిఎఫ్ గెలిచింది. భౌతిక పరిస్థితులు రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్న ఈ పరిస్థితుల్లో వామపక్షాల భావజాలం ఎప్పటికీ అప్రస్తుతం కాదు. మితవాదం వైపు మొగ్గుచూపే పార్టీలు కూడా ఈ విషయాలపై వామపక్ష దృక్పథాన్ని కలిగి ఉన్నాయి. ఎన్నికల పరంగా చూసినప్పుడు 1952 తర్వాత వామపక్షాలు ప్రదర్శించిన అత్యంత పేలవమైన సామర్థ్యాల్లో ఇదొకటి. అంతమాత్రాన దానికి సంతాపం రాయడం తొందరపాటే అవుతుంది. వామపక్షాల భావజాలానికి సంతాపం రాయడం అంటే, భారతదేశ భావనకు సంతాపం రాయడంతో సమానం. కానీ వామపక్షాలలో మరింత నూతనత్వం, కొత్త ఆలోచనలు రావాలి. అప్పుడే కొత్త తరం ముందుకు వస్తుంది. మేము విద్యార్థులుగా ఉన్నప్పుడు వామపక్షాలు మా సహజ ఎంపికగా ఉండేవి. ఇప్పుడు అలా కాదు" అని ఆయన ఫ్రంట్‌లైన్‌తో అన్నారు .

ప్రధానంగా ఎన్నికలు, ప్రభుత్వ ఏర్పాటుపై దృష్టి సారించే పార్టీల్లా కాకుండా, వామపక్షాలు తమ రాజకీయ కార్యకలాపాలకు ఎల్లప్పుడూ విస్తృతమైన పరిధిని కలిగి ఉన్నాయి. గణనీయమైన ఎన్నికల శక్తిగా పరిగణించబడని రాష్ట్రాలలో కూడా ఇవి సంస్థాగత ఉనికిని కలిగి ఉన్నాయి. అనేక ఉద్యమాలలో కీలక పాత్ర పోషించాయి. విద్య, బ్యాంకింగ్, బీమా వంటి అనేక రంగాలలో, సాధారణంగా ప్రభుత్వ రంగంలో, వామపక్షాలు కార్మిక సంఘాలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. ఇది దోపిడీ, ప్రైవేటీకరణ ప్రక్రియను నెమ్మదింపజేసింది.

ఈనాటికీ సిపిఐ(ఎం) ప్రజా సంఘమైన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్, ఆదివాసీల అటవీ హక్కుల సమస్యలు, పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం అమలు, గ్రామసభల హక్కుల ఉల్లంఘనలు వంటి అంశాలపై ఉద్యమిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎలక్టోరల్ బాండ్లు, పౌరసత్వ (సవరణ) చట్టం, "బుల్డోజర్" న్యాయం, లేదా కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ప్రచారాలైనా సరే, వామపక్షాలు నిరంతరం గళం విప్పుతూనే ఉన్నాయి.

### తీవ్రమైన సమస్యలు : వామపక్షం ఎదుర్కొంటున్న సవాళ్లు

దీని నుంచి రెండు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదటిది వామపక్షాల ఎదుగుదల అంతటా ఒకే విధంగా లేకపోవడానికి సంబంధించినది: ఇటీవలి ఎదురుదెబ్బలకు ముందే, దేశంలోని మిగిలిన ప్రాంతాలలో వామపక్షాల ఉనికి, బలం కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర బాటను అనుసరించలేదు. పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘకాలం పాలించిన కాలంలో కూడా, తమిళనాడు, బీహార్‌లలో స్వల్ప ఉనికి కలిగివున్నా ప్రధానంగా ఈ మూడు రాష్ట్రాలకే ఒక ప్రధాన ఎన్నికల శక్తిగా వామపక్షాలు పరిమితమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో దాని ప్రాబల్యం సాపేక్షంగా తగ్గింది. అలాంటప్పుడు, వామపక్షాల ప్రస్తుత దుస్థితికి మూలాలు, ముఖ్యంగా హిందీ మాట్లాడే ప్రాంతంలో ఒక జాతీయ శక్తిగా ఎదగలేకపోవడంలోనే ఉన్నాయా?

రెండవ ప్రశ్న వాణి (వాయిస్)కి సంబంధించినది. ప్రొఫెసర్ పట్నాయక్ చెప్పినట్లుగా, దేశవ్యాప్తంగా వామపక్షాలు ఎల్లప్పుడూ సమర్థించే, వాటికి ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించిన అంశాలే ప్రస్తుతానికి అత్యంత కీలకమైన సమస్యలుగా వున్నాయి.

మూడు వ్యవసాయ చట్టాల విషయంలో మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గేలా ఒత్తిడి తెచ్చిన చారిత్రాత్మక రైతాంగ పోరాటం, లేదా కార్మికుల వేతనాలు, పని పరిస్థితుల సమస్యపై నోయిడాలో ఇటీవల తలెత్తిన ఆందోళనలు, తమిళనాడులోని శాంసంగ్ సంస్థలో సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కుపై చెలరేగిన వివాదాలు దీనికి నిదర్శనం. వాస్తవానికి, పెరుగుతున్న సంపద, ఆదాయాలు ఒక దగ్గర పెద్దయెత్తున పోగుపడడం, దేశాన్ని పీడిస్తున్న తీవ్ర అసమానతలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలతో దేశం రగులుతోంది. మరి అలాంటప్పుడు వామపక్షాలు ఈ పోరాటాలను అందిపుచ్చుకుని ఎందుకు ఎదగలేకపోతున్నాయి?

సమాజంలో ప్రతిచోటా మహిళలు, యువత, కార్మికులు, అణగారిన, అణచివేతకు గురవుతున్న వర్గాలలో మార్పు కోసం రేకెత్తుతున్న ఆకాంక్షలను ఒక ఏకీకృత కార్యక్రమంగా మలచడమే వామపక్షాల ముందున్న సవాలు. మతపరమైన ధ్రువీకరణ, భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య సంస్థలను అంతకంతకూ బలహీనపరచడం, ఎన్నికలలో ధనబలం పాత్ర వంటివి కేవలం వామపక్షాలకే కాదు, ఏ ప్రతిపక్ష పార్టీకైనా ఇబ్బందికరమే. సమకాలీన భారతదేశంలో కుల సమస్యను, మహిళల పాత్రను, వాటి వల్ల పుట్టుకొచ్చిన విభిన్న రాజకీయ ధోరణులను వామపక్షాలు ఎలా చూస్తాయనేది చాలా ముఖ్యమైనది. వామపక్షాల పతనాన్ని భారతదేశం భరించగలదా? ఒకవేళ భరించలేకపోతే, తన మహత్తర బాధ్యతను నెరవేర్చడానికి వామపక్షాలు ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి? అనేది చాలా ముఖ్యమైన అంశం.

(అనువాదం: కె. గడ్డెన్న)

విద్యా రంగం

# భారతీయ విద్యావ్యవస్థ కుంభకోణాలమయం



వ్యాస రచయిత ప్రముఖ జర్నలిస్టు, రచయిత. జర్నలిజం చేసిన కృషికి గాను 2006లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.

సుచేతా దలాల్

ఈ మధ్యనే ఢిల్లీలో జరిగిన 'ఇండియా వి.ఐ ఇంపాక్ట్-2026' సదస్సులో గల్‌గోటియా విశ్వవిద్యాలయం పాల్పడిన సిగ్గుమాలిన పనికి కృత్రిమ మేధ రంగంలో భారతదేశం అత్యున్నతమైన, విశ్వసనీయమైన విద్యా ప్రమాణాలతో బలమైనశక్తిగా ఎదగనున్నది అని ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం అభాసు పాలయ్యింది.

ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి చెందిన అధికారిక సమాచార ప్రతినిధి దూరదర్శన్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ 'ఓరియన్' పేరిట గల రోబోకుక్కను తమ యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రూపొందించిందని వివరించారు. వాస్తవానికి అది చైనా వాళ్ళు తయారు చేసింది. బజార్లో అమ్మకానికి దొరుకుతుంది. అందుకే గల్‌గోటియా యూనివర్సిటీ చెప్పుకున్న గొప్పను హేళన చేస్తూ సామాజిక మాధ్యమాల్లో 'మీమ్స్' పోటెత్తాయి. దాంతో నిర్వాహకులు ఆ యూనివర్సిటీకి కేటాయించిన స్టాల్‌ను తక్షణమే ఖాళీ చేయించారు.

ఒక విశ్వవిద్యాలయం జాతీయస్థాయిలో జరిగే ప్రతిష్ఠాత్మక ప్రదర్శనలో అసెంబ్లింగ్‌కు, ప్రదర్శనకు, పరిశోధనకు మధ్య ఉన్న సూక్ష్మమైన తేడాను నిర్లక్ష్యపూరితంగా విస్మరించడం ద్వారా మన అత్యున్నత విద్యావ్యవస్థ ఎంత లోపభూయిష్ఠంగా ఉన్నదో బట్టబయలు చేసింది. అందుకే ఈ సంఘటన మన విద్యా వ్యవస్థ ప్రమాణాల మీద చర్చకు దారితీసింది. తప్పుడు ప్రచారాలు, పసలేని దావాలు, అతి ప్రగల్భాలు మన విద్యావ్యవస్థలో, ప్రాథమిక విద్య నుండి అత్యున్నత విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు అన్నింటా నెలకొని ఉన్న భారీ సంక్షోభానికి నిదర్శనాలు అని విద్యానిపుణులు అనేక మంది భావిస్తున్నారు.

ఒక ప్రక్కన ప్రభుత్వ పాఠశాలల మూసివేతలు, స్కూలు డ్రాపౌట్లు ఆందోళనకర స్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. మరోపక్క నుండి ఈ సంక్షోభాన్ని సొమ్ము చేసుకోవడానికి ప్రైవేటు విద్యాసంస్థలు, కాలేజీలు, విశ్వ విద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పరిశోధనల నుండి పేటెంట్లు నమోదు చేయడం వరకు ప్రభుత్వం నుండి అనుచిత ఆర్థిక లబ్ధి పొందడానికి తప్పుడు మార్గాలను అనుసరిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలో వెలువడిన నివేదికలు పరిశీలిస్తే ఈ అక్రమ మార్గ తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూ.జి.సి) తాజాగా 12 రాష్ట్రాలలో మొత్తం 32 గుర్తింపులేని విశ్వవిద్యాలయాలు నడుస్తున్నాయని వెల్లడించింది. రెండేళ్ళలో ఈ సంఖ్య 20 నుండి 32కు ఎగబాకింది. ఇందులో 12 సంస్థలు దేశ రాజధాని నగరంలో నడుస్తున్నాయి. తల్లిదండ్రులు, విద్యార్థులు జాగ్రత్త వహించాలని యు.జి.సి ఒక ప్రకటన ఇచ్చి చేతులు దులిపేసుకుంది తప్పితే ఈ నకిలీ విశ్వవిద్యాలయాల మీద అసాధారణమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి సిద్ధపడలేదు. యుజిసి ప్రదర్శిస్తున్న ఈ నిర్లిప్తత కారణంగానే నకిలీ విశ్వవిద్యాలయాలు పెట్రేగిపోతున్నాయి. విశ్వవిద్యాలయాల స్థాయిలోనే పరిస్థితి ఈరకంగా ఉంటే ఇక ప్రాథమిక విద్యాస్థాయిలో పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా తయారయ్యాయి.

సర్వశిక్షా అభియాన్ పథకం కింద 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలను ట్రక్కుల కొద్దీ చిత్తు కాగితాల కింద అమ్ముకుంటున్న భారీ కుంభకోణాన్ని ఇటీవలే ఉత్తరప్రదేశ్ పోలీసులు బట్టబయలు చేశారు. కేజీకి 4 రూపాయల చొప్పున ఈ పాఠ్యపుస్తకాలను కారుచౌకగా అమ్మేస్తూ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీశారు. ఈ సంఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందులో ఇంకెన్ని లొసుగులు బయట పడతాయో, ఇది ఎంత పెద్ద నెట్‌వర్క్‌నో బయటపడుతుంది. దేశంలోకెల్లా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అత్యధికంగా పాఠశాలల మూసివేతలు చోటు చేసుకుంటున్నాయి.

విద్యావ్యవస్థలో దిగజారుతున్న ప్రమాణాల గురించి కెరీర్స్ 360 వ్యవస్థాపకుడు పేరి మహేశ్వర్ అత్యంత శ్రమకోర్చి వివరాలన్నీ గుదిగుచ్చి డాక్యుమెంట్ చేస్తున్నారు. ప్రభుత్వ నివేదికలలోని గణాంకాల విశ్లేషణలు, సమాచార హక్కు కింద దాఖలు చేసిన వందల వందల పిటీషన్‌ల ద్వారా సేకరించిన సమాచారాల ఆధారంగా పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మౌలిక సౌకర్యాల అందుబాటు, బోధనా సిబ్బంది ప్రమాణాలు, నియామకాలు, నియంత్రణ వ్యవస్థల పనితీరు వంటి అంశాలలో నెలకొన్న ఆందోళనకర ధోరణుల గురించి వివరణాత్మక సమాచారం ఎప్పటికప్పుడు వెలువరిస్తూనే ఉన్నారు.

గల్‌గోటియా విశ్వవిద్యాలయం పాల్పడిన మోసం బట్టబయలయ్యాక ఫిబ్రవరి 19న పేరి మహేశ్వర్ మన విద్యావ్యవస్థలో అధికారం అండదండలతో జరుగుతున్న అకడమిక్ మోసాలు బట్టబయలు చేస్తూ సామాజిక మాధ్యమం (ట్విట్టర్)లో ఒక పోస్టు పెట్టారు. ప్రాథమిక విద్య నుండి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల వరకు పేరుకుపోయిన అవినీతి ధోరణులను ఎండగట్టారు. శాస్త్ర పరిశోధనలు, పేటెంట్ల విషయంలో చోటు చేసుకుంటున్న తొత్తడాల గురించి కూడా బట్టబయలు చేశారు. ర్యాంకింగ్‌ల ఆధారంగా ప్రోత్సాహకాల అందజేత అన్న వ్యాపార ధోరణి ప్రబలిపోవడం ఇటువంటి మోసాలకు


> **“ సాంకేతిక విద్యారంగంలో 'ఇంటర్న్‌షిప్' చెయ్యడం కీలకం కాబట్టి మార్కెట్‌లో నకిలీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్‌లు అమ్మే సంస్థలు పుట్టుకొచ్చాయి. కేవలం ఈ సర్టిఫికెట్లను మంచి రేటుకు అమ్ముకోవడానికే నోయిడా (ఢిల్లీ)లో నకిలీ కంపెనీలు అనేకం పుట్టుకు వచ్చాయి. సాంకేతిక విద్యా మండలి ఆల్‌ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ) రూపొందించిన నియంత్రణల లోనే ఇలాంటి లొసుగు ఉన్నది. ”**

దారితీసిందని వివరించారు. దీంతో అటానమస్, క్వాసీ-అటానమస్ పేరిట యూనివర్సిటీలు స్థాపించడం, కొత్త కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం, ఆన్-లైన్ డిగ్రీలకు అవకాశం కల్పించడంతో ఈ మోసాలు విచ్చలవిడిగా పెరిగి పోయాయి అంటూ అందుకు సంబంధించి అనేక గణాంక వివరాలను ఉదాహరించారు.

ఉదాహరణకు కేవలం నాలుగంటే నాలుగు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు దేశంలోని అన్ని ఐఐటి సంస్థలు కలిసి చేపట్టిన శాస్త్ర పరిశోధనలు, పేటెంట్ల దావాలకు మించిన సంఖ్యలో పరిశోధనలు సాగించినట్లు, పేటెంట్లు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు లెక్కలు చూపాయి. ఐదు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు శాస్త్ర పరిశోధనలలో 90 శాతానికి మించి ఫలితాలు సాధించినట్లు ప్రకటించుకున్నాయి. అదే మన ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐయస్‌సి) ఈ రంగంలో 51.9 శాతం మాత్రమే ఫలితాలు సాధించినట్లు ప్రకటించింది. కానీ 70కి పైగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఐఐయస్‌సి కన్నా చాలా మెరుగైన ఫలితాలు సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ కొద్దిపాటి లెక్కల సమాచారం చాలు ఆయా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ప్రచారం చేసుకుంటున్న మేరకు నిజంగానే ఫలితాలు సాధించాయా లేదా అన్నది నిగ్గు తేల్చమని విచారణకు ఆదేశించవచ్చు.

ఆఖరుకి మన ప్రతిష్ఠాత్మక ఐఐటిలకు కూడా ఈ జాడ్యం సోకిందని, ఎక్కువ ప్లేస్‌మెంట్స్ (ఉద్యోగ నియామకాలు) సాధించినట్లు, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి తక్కువ చేసి చూపించడం కోసం ఆయా సంస్థలలో విద్యార్థుల చేరికనే తక్కువ చేసి చూపించారని పేరి మహేశ్వర్ 2025 సెప్టెంబర్ నెలలో వెల్లడించారు. అన్ని ఐఐటిలు కలసి 1,001 సీట్లు కలిగి ఉన్నాయి. కానీ 710 మంది మాత్రమే (70.9 శాతం) చేరినట్లు చూపించాయి. ఈ రకమైన అంకెల గారడీని ఎవరు చూడవచ్చారులే అన్న ధీమా కామోసు.

అక్టోబర్ 2024 'కెమిస్ట్రీ వరల్డ్' సంచికలో, ఆగస్టు 2025 'నేచుర్' సంచికలో – ఈ రకంగా వివిధ శాస్త్ర పరిశోధనలు, పేటెంట్ల నమోదులు సంఖ్యలో అనూహ్యమైన పెరుగుదల దృష్ట్యా ఈ రంగాలను తగిన విధంగా 'సంస్కరించాల్సిన' అవసరం ఉందని పేర్కొన్నాయి. యూనివర్సిటీలు ర్యాంకింగ్‌ల కోసం, వాణిజ్యపరమైన లబ్ధి కోసం పేటెంట్లు దరఖాస్తు చెయ్యడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయని 2026 జనవరి టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక వార్తను ప్రచురించింది. 'ఇంటర్న్‌షిప్' మోసాలకూ కొదవలేదని ఎత్తి చూపింది.




సాంకేతిక విద్యారంగంలో 'ఇంటర్న్‌షిప్' చెయ్యడం కీలకం కాబట్టి మార్కెట్‌లో నకిలీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్‌లు అమ్మే సంస్థలు పుట్టుకొచ్చాయి. కేవలం ఈ సర్టిఫికెట్లను మంచి రేటుకు అమ్ముకోవడానికే నోయిడా (ఢిల్లీ)లో నకిలీ కంపెనీలు అనేకం పుట్టుకు వచ్చాయి. సాంకేతిక విద్యామండలి ఆల్‌ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ) రూపొందించిన నియంత్రణలలోనే ఇలాంటి లొసుగు ఉన్నది. ప్రతి రెండవ సెమిస్టర్ తర్వాత విద్యార్థులు ఒక ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్ దాఖలు చెయ్యాలి అని నియమాన్ని రూపొందించింది కానీ అందుకు తగిన అవకాశాలు కల్పించే బాధ్యతను ఆయా విద్యాలయాల మీద పెట్టకపోవడమే ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల కుంభకోణానికి ఊపిరి పోసింది. ఏటా 15 నుండి 20 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న మన దేశంలో ప్రతి విద్యార్థి కోర్సు పూర్తి చేసే నాటికి 4 ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు సమర్పించాలి అంటే ఇది ఎంత మార్కెట్‌గా

తయారయ్యిందో మీరే ఊహించుకోండి.


ఉన్నత విద్యారంగం ర్యాంకుల వెంబడి పరుగు తీయాల్సిరావడం, తద్వారా అందే ప్రోత్సాహకాల ఆదాయాన్ని గరిష్ఠంగా గడించాలని వెంపర్లాడడం మూలంగా మన విద్యారంగ ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి.

ప్రాథమిక విద్యా రంగమయితే పీడకలలా తయారయింది. ప్రాథమిక విద్యారంగంలో మన దేశ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి 2000వ సంవత్సరంలో సర్వశిక్షాఅభియాన్ పథకాన్ని రూపొందించి అమలులోకి తెచ్చారు. అనతి కాలంలోనే 98 శాతం స్కూల్ ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యాన్ని సాధించామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు దశాబ్దాల తర్వాత ఇవాళ్టి పరిస్థితిని చూసుకుంటే చాలా తేడా పడుతుంది. ప్రాథమిక పాఠశాలలు వేల సంఖ్యలో మూతబడ్డాయి. విద్యార్థుల చేరిక పడిపోయింది. ఉత్తర ప్రదేశ్‌లో పాఠ్యపుస్తకాల కుంభకోణం, మధ్యప్రదేశ్‌లో స్కాలర్‌షిప్‌ల కుంభకోణం – ఇవన్నీ మన ప్రాథమిక విద్యారంగ వ్యవస్థ ఎంత రుజాగ్రస్థం అయ్యిందో వెల్లడిస్తున్నాయి.

పార్లమెంటుకు సమర్పించిన గణాంక నివేదికల ప్రకారమే గత దశాబ్ద కాలంలో 93,000 ప్రాథమిక పాఠశాలలు, అందులో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంత పాఠశాలలు మూతపడ్డాయి. పాఠశాలల్లో విద్యార్థుల చేరిక 2.41 కోట్లకు పడిపోయింది. పాఠశాలల్లో 7 శాతం 'డ్రాపౌట్లు' ఉంటే ప్రైవేటు పాఠశాలల్లో చేరికలు 32 శాతం పెరగడం ద్వారా ఆ నష్టం కొంత భర్తీ అయినట్లు కనబడుతున్నది. దేశవ్యాప్త జనాభా పెరుగుదల రేటుతో చూస్తే ప్రాథమిక అక్షరాస్యతా శాతం తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతున్నది.

విద్యా వార్షిక సర్వే నివేదిక (ఎఎస్ఇఆర్) 2024ను పరిశీలిస్తే ఐదవ తరగతి చదివే విద్యార్థులలో సగం మందికి పైగా రెండవ తరగతి పాఠ్య పుస్తకాన్ని చదవలేకపోయారు. జనాభా పెరుగుదల మన దేశానికి అంది వచ్చిన హారం అంటున్నారు కానీ అది మన పాలిట పీడకలలా మారనున్నదని మహేశ్వర్ హెచ్చరిస్తున్నారు.

> “ప్రాథమిక విద్యా రంగమయితే పీడకలలా తయారయింది. ప్రాథమిక విద్యారంగంలో మన దేశ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి 2000వ సంవత్సరంలో సర్వశిక్షాఅభియాన్ పథకాన్ని రూపొందించి అమలులోకి తెచ్చారు. అనతి కాలంలోనే 98 శాతం స్కూల్ ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యాన్ని సాధించామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు దశాబ్దాల తర్వాత ఇవాళ్టి పరిస్థితిని చూసుకుంటే ప్రాథమిక పాఠశాలలు వేల సంఖ్యలో మూతబడ్డాయి. విద్యార్థుల చేరిక పడిపోయింది.”



చైనా రోబోట్‌ను తన స్వంత ఆవిష్కరణగా చెప్పుకున్న గల్గోటియా యూనివర్శిటీ. ఆర్ఎస్ఎస్–బిజెపితో దీనికి దగ్గరి సంబంధాలున్నాయి

ఇవేవో మన విద్యావ్యవస్థలో అక్కడక్కడా ఎదురవుతున్న లోపాలు అని సరిపెట్టుకోవడానికి లేదు. 2025, 2026 సంవత్సరాలలో మెడికల్ కళాశాలల తనిఖీలు జరగడానికి ముందుగా ఆయా కాలేజీలలో బోధకుల సంఖ్యను ఎక్కువ చేసి చూపిస్తున్నారని తేలింది. లా కాలేజీల విషయంలో 'నియామకాల సాధన' ప్రకటనలు అవాస్తవ పూరితమైనవని బహిర్గతమయ్యింది. అనేక విశ్వవిద్యాలయాలు సమర్పించిన పరిశోధనా పత్రాలు వివిధ సోర్స్‌ల నుండి ఎత్తి రాసినవని వెల్లడి కావడంతో గుట్టుచప్పుడు కాకుండా వాటిని వెనక్కి తీసుకుంటున్నాయి.

మెడిసిన్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా ఇలా అన్ని రంగాల వ్యవస్థలలో లొసుగులను అడ్డం పెట్టుకుని అనుచిత లబ్ధి పొందడానికి చూడడం, మోసాలకు పాల్పడడం అతి సాధారణ విషయంగా స్థిరపడిపోయింది. ర్యాంకులు, పేటెంట్లు, ప్లేస్‌మెంట్లు ప్రభుత్వం నుండి లబ్ధి పొందడానికి సాధనాలుగా మారిపోయాక ప్రయోగశాలలు, న్యాయస్థానాలు, ఆసుపత్రులు, బోర్డురూంలు వృత్తి గత నైపుణ్యంలో ప్రతిభలో, నిబద్ధత, నిమగ్నతలలో రాజీలకు సిద్ధపడిపోతాయి. 'వికసిత భారత్'కు ఇది మార్గం కానే కాదు.

(అనువాదం: కె. సత్యరంజన్)



## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# ఉత్తర భారత పట్టణాల్లో 13, 14 శతాబ్దాల నాటి సామాజిక తరగతులు



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

### 1.బానిసలు

13,14 శతాబ్దాల నాటికి భారతదేశంలోని పట్టణాల్లో గణనీయమైన సంఖ్యలో బానిసలు ఉండేవారని తెలుస్తోంది. ఈ బానిసలు ఉత్తర, దక్షిణ భారత భూభాగాల్లోని రాజ్యాల్లో ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయి. యూదు వర్తకుల రికార్డు "జ్యూయిష్ జెనిజా" లో (క్రీ.శ. 1130–1140 కాలానికి సంబంధించినది) మంగుళూరు రేవు పట్టణంలో వ్యాపారం చేసే ఒక అరబ్బీ యూదు వర్తకుడు – అతడి పేరు అబ్రహాం బిన్ యిజు – తన కొట్టంలో రాగి, కంచు పాత్రలను తయారు చేసే పనిలో పెట్టుకోడానికి బానిస కూలీలను కొనుగోలు చేసినట్టు ఉంది. వారితోబాటు తన ఉంపుడుగత్తెగా ఉండేందుకు ఒక ఆడ బానిసను కూడా కొనుగోలు చేశాడని ఉంది. ఆ తర్వాత గుజరాత్‌ను చాళుక్యులు పాలించిన కాలంలో 1230–1231 కాలంలో నమోదైన రికార్డు – దీనిని లేఖపద్ధతి అని అంటారు– లభ్యమైంది. (దాని అనువాదాన్ని ఈ వ్యాసంతోబాటు ఇస్తున్నాము. చూడండి.) సైనిక దాడుల్లో బానిసలను చెరబట్టే పద్ధతి ఉండినట్టు ఈ రికార్డును బట్టి తెలుస్తోంది. అంతేకాక, దారిద్ర్య బాధను భరించలేక తమను తాము అమ్ముకోవడం కూడా ఉండేది. పన్నులు చెల్లించలేకపోయిన రైతులు తమ భార్యాబిడ్డలను బానిసలుగా అమ్ముకునే పద్ధతి కూడా ఉండేది. ఇంటిచాకిరీ, పొలం పనులు, పశువుల కొట్టం పనులతోబాటు పాయిఖానా పనులు కూడా ఈ బానిసలే చేయాలి. ఒకసారి బానిసలుగా మారాక వారికి వారి కులం అనేది వర్తించదు. ఆడబానిసల విషయంలో యజమానిదే ఇష్టారాజ్యం. బానిసలను అమ్ముకోడానికి అధికారం యజమానికి ఉండేది.

ఈ కాలంలో భారతదేశంలోకి ప్రవేశించిన తురుష్కులు, అరబ్బులు– ముఖ్యంగా ఇస్లాం మతాన్ని అనుసరించేవారు తమ తమ దేశాల్లో ఉన్న ఇస్లామిక్ చట్టాలు బానిసల విషయంలో ఏవిధంగా చెప్పాయో, ఇక్కడ భారత దేశంలో కూడా దాదాపు అదే మాదిరిగా ఉండడాన్ని గమనించారు. వాళ్ళు సాగించిన కొన్ని దాడులు కేవలం ఇక్కడినుంచి బానిసలను పట్టుకుపోవడానికే అన్నట్టు జరిగాయి. 1197లో కుతుబుద్దీన్ ఐబక్ గుజరాత్ మీద దాడి జరిపి 20,000 మంది బానిసలను పట్టుకున్నాడు. 1202–1203లో జరిపిన కలింజర్ దండయాత్రలో 50,000 మందిని పట్టుకున్నాడు. 1266–87 మధ్య పాలించిన బాల్బన్ గంగామైదాన ప్రాంతంలో జరిపిన యుద్ధాల్లో బానిసలను, పశువులను చాలా పెద్ద ఎత్తును పట్టుకున్నాడు. దాని ప్రభావం వలన ఢిల్లీ బజారులో బానిసల, పశువుల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి! తనకు విధేయులుగా వ్యవహరించిన సైనికాధికారులకు తమ వద్దనుండే ఆడ బానిసలను కానుకగా రాజు బహూకరించడం అనేది ఒక ఆనవాయితీగా ఉండేది.

అల్లావుద్దీన్ ఖిల్జీ వద్ద 50,000 మంది బానిసలు ఉండేవారు. ఫిరోజ్ షా వద్ద 1,80,000 మంది ఉండేవారు. వాళ్ళలో 12,000 మందిని చేతివృత్తుల పనుల్లోకి, కూలీ పనికి నియోగించాడు. తక్కినవారిలో కొందరిని సైనిక దళాలకు చాకిరీ చేసే పనుల్లో నియమించారు. ఒక్కో ఆశ్వికదళ రౌతుకు ఇద్దరేసి బానిసలను కేటాయించాడు. ఉన్నత రాజవంశీకుల వద్ద వందల, వేల సంఖ్యలో బానిసలు ఉండేవారు. వర్తకుల వద్ద కూడా పనులు చేయడానికి బానిసలను పెట్టుకునేవారు. కొంతమంది సాధారణ స్థాయి ఆదాయా లున్నవారు కూడా బానిసలను కలిగివుండే వారు. నూర్ తుర్క్ అనే ఒక సన్యాసి తనవద్ద ఉన్న బానిస సంపాదించే ఆదాయంతో జీవించేవాడు.

ఇలా బానిసల సంఖ్య నిరంతరమూ పెరిగిపోవడంతో బానిసల మార్కెట్‌లో వ్యాపారం జోరుగా సాగేది. ఆడ బానిసలను బాగా పరిశీలించి వారి రేట్లను నిర్ధారించే బ్రోకర్ల గురించి అమీర్ ఖుస్రూ (ఇతడు ప్రముఖ కవి) పేర్కొన్నాడు. పని చేసేందుకు కొనే ఆడ బానిసకు 5 నుంచి 12 టంకాల వరకూ రేటు ఉండేది. ఉంపుడుగత్తెగా ఉండేందుకు కొనే బానిసకు 20 టంకాల వరకూ రేటు ఉండేది. పనులు తెలిసిన బానిస యువకులకు 10 నుంచి 15 టంకాలు, ఏ పనీ తెలియని వారికి 7 లేదా 8 టంకాలు రేటు ఉండేది. అదే కాలంలో ఒక పాడి గేదె ఖరీదు 10 నుండి 12 టంకాలు ఉండేది. ముసిలిదైపోయిన గుర్రం 25 టంకాల ఖరీదు చేసేది. దీనిని బట్టి జంతువుల కన్నా మనుషులే బానిసల మార్కెట్‌లో చౌకగా దొరికేవారని తెలుస్తోంది. 15వ శతాబ్దం వరకూ ఇటువంటి పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాతే అది తగ్గుముఖం పట్టింది.

### 2. స్వతంత్ర పేద కూలీలు

వేల సంఖ్యలో పని చేసే బానిసలతో బాటు స్వతంత్రులుగా పరిగణించబడే కూలీలు కూడా ఇంకా పెద్ద సంఖ్యలో ఉండేవారు. పని చేయడానికి బానిసలు ఎక్కువమంది లభించే పరిస్థితి ఉండడంతో యువతీయువకులు స్వతంత్రులుగా ఉంటూన్నప్పటికీ నిరుద్యోగంతో చాలా ఇబ్బందులు పడేవారు. సుల్తాను భవనం ముందు, ఇతర సంపన్నుల ఇళ్ళముందు పనులకోసం పడిగాపులు పడే యువకుల సంఖ్య ఢిల్లీలో చాలా ఎక్కువగా ఉండేదని ఇబన్ బటూటా తన రికార్డుల్లో ప్రస్తావించాడు. నిరుద్యోగంతోబాటు వేతనాలు చాలా తక్కువ స్థాయిలో ఉండడం కూడా వీరికి పెద్ద సమస్య. ఏడాదికి 8 నుండి 12 టంకాలు వేతనానికి

పని చేసే కూలీలు ఉండేవారు. ఆ వేతనంతో రోజుకు 2 నుండి 3 కిలోల గోధుమలు మాత్రం కొనగలిగే పరిస్థితి ఉండేది. అదే అక్బర్ కాలంలోనైతే (1595) కనీస ఆదాయం పొందే ఒక రోడ్డు ఊడ్చే కూలీ తన ఆదాయంతో రోజుకు 4.5 కిలోల గోధుమలను కొన గలిగేవాడు.

**“ వేల సంఖ్యలో పని చేసే బానిసలతో బాటు స్వతంత్రులుగా పరిగణించబడే కూలీలు కూడా ఇంకా పెద్ద సంఖ్యలో ఉండేవారు. పని చేయడానికి బానిసలు ఎక్కువమంది లభించే పరిస్థితి ఉండ డంతో యువతీయువకులు స్వతంత్రులుగా ఉంటూన్నప్పటికీ నిరుద్యోగంతో చాలా ఇబ్బందులు పడేవారు. సుల్తాను భవనం ముందు, ఇతర సంపన్నుల ఇళ్ళముందు పనులకోసం పడిగాపులు పడే యువకుల సంఖ్య డిల్లీలో చాలా ఎక్కువగా ఉండేదని ఇబన్ బట్టుటా తన రికార్డుల్లో ప్రస్తావించాడు. ”**

### 3. చేతివృత్తుల వారు

చేతివృత్తుల వారి స్థితి స్వతంత్ర కూలీల పరిస్థితి కన్నా కొంత మెరుగ్గా ఉండేది. వారిలో ఎక్కువమంది స్వంతంగా తమ వృత్తులను చేసుకునేవారు. కొనుగోలుదారులతో నేరుగా వారికి సంపర్కం ఉండేది. వీరిపై విధించిన పన్నులలో చాలా భాగాన్ని ఫిరోజ్ షా కాలంలో రద్దు చేయడంతో వీరు పెద్ద ఊరట పొందినట్లైంది.

భవన నిర్మాణం తదితర వృత్తులు చేపట్టేవారు ఆయా కులాలకు చెందినవారే ఎక్కువగా ఉండేవారు. ఆ వృత్తి నైపుణ్యాన్ని వంశపారంపర్యంగా పొందేవారు. ముస్లింలుగా ఉన్న వారు కూడా వృత్తులలో ఉన్నప్పటికీ, వారు వేరుగానే పరిగణించబడేవారు. తమ ఉత్పత్తులకు రేట్లను మార్కెట్‌లో ఉండే డిమాండ్‌ను బట్టి నిర్ణయంచే అవకాశం ఉండడంతో కొన్ని వృత్తులవారు ఆ పరిస్థితులను వినియోగించు కోగలిగేవారు. సుల్తాను వద్ద, ఉన్నతాధికారు లవద్ద పోగుబడే సంపద నిరంతరం పెరుగు తూవుండడంతో వాళ్ళు తమ స్వంత అవసరా లకోసం ఎక్కువమంది చేతివృత్తి దారులను నియమించుకునేవారు. మహమ్మద్ తుగ్లఖ్ వద్ద కేవలం అల్లిక పనులు చేసే వారు 4000 మంది ఉండేవారు. పట్టు వస్త్రాలను అల్లడం, వాటిమీద బంగారు డిజైన్లు వేయడం చేసేవారు. ఇటువంటి కార్ఖానాలు ప్రభువుల వద్ద ఫిరోజ్‌షా కాలంలో 36 వరకూ ఉండేవని తెలుస్తోంది.

## “ఒక ఆడబానిస అమ్మకపు పత్రం”

## దాసీ పత్ర విధి, గుజరాత్, క్రీ.శ.1230

### (లేఖపద్ధతి గ్రంధం నుంచి)



సంవత్ సంవత్సరం 1288 వైశాఖ శుద్ధి, 15, గురువారం (అంటే 1230 ఏప్రిల్ 30) రోజున రాజ పరంపర గురించి సక్రమంగా ప్రస్తావించిన అనంతరం, దిగువ విధంగా ఒక ఆడ బానిస అమ్మకానికి సంబంధించి ఒప్పందపు పత్రాన్ని రాయడం జరిగింది: రాణా ప్రతాప సింహుడు వరే రాజ్యం మీద దాడి చేసి తెచ్చిన బానిసల్లో ఒక అందంగా ఉన్న 16 ఏళ్ళ అమ్మాయి –పేరు పణుతి–ని అమ్మకానికి పెట్టారు. ఈ విషయాన్ని ముందుగా పంచ నగర ప్రముఖులకు తెలియజేయడం జరిగింది. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో ఆమె తలపై ఒక గరిక పోచ ఉంచి అమ్మకానికి పెట్టారు. ఆశాధరుడు అనే వర్తకుడు 504 విశాలప్రియ ద్రమ్మాలను రాఫా ప్రాప సింహునికి చెల్లించి పణుతి అనే పేరు గల ఈ ఆడ బానిసను కొనుగోలు చేయడం జరిగింది. ఈ విషయాన్ని ఇందుమూలంగా నగరంలోని నాలుగు కులాల ప్రజలకూ తెలియజేయడమైనది.

సదరు ఆడ బానిస ఆ వ్యాపారస్తుడి ఇంట్లో తరగడం, పిండి విసరడం, రుబ్బడం, గచ్చులు ఊడవడం, పొయ్యిలోకి కట్టెలు తేవడం, నీళ్ళు మోసుకురావడం, మలాన్ని ఎత్తి బైట పారబోయడం, ఆవులకు, గేదెలకు, మేకలకు పాలు పిండడం, పెరుగు చిలికి మజ్జిగ చేసి దానిని పొలానికి తీసుకుపోవడం, పొలం నుండి పశువులకు మేత తేవడం, పొలాల్లో కలుపు తీయడం, గడ్డి కోయడం వగైరా పనులు చేయవలసివుంటుంది. ఇక యజమాని వంతుగా అతడు ఆమె అడకకుండానే ఆహారాన్ని, దుస్తులను, ఇతరాలను అతడి స్తోమతను బట్టి ఇవ్వవలసివుంటుంది. ఒకవేళ ఆమె పనిలో ఉన్న వేళల్లో ఆమె తండ్రి, లేదా సోదరుడు, లేదా భర్త గాని వచ్చి డబ్బు చెల్లించివేసి ఆమెను తిరిగి తీసుకుపోతామని అంటే, వాళ్ళని కాళ్ళూ చేతులూ కట్టేసి చితకబాదే అధికారం యజమానికి ఉంది. ఒకవేళ తనను పెట్టే బాధలను తట్టుకోలేక ఆ ఆడబానిస గనుక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటే మరు జన్మలో ఆమె ఆడ గాడిదగా గానీ, ఆడ కుక్కగా గానీ, చండాలిగా గానీ పుడుతుంది. ఆమె యజమాని గంగాస్నానం చేసినంత పవిత్రుడిగా పరిగణించబడతాడు.

ఇందుకు నగరంలోని రక్షక దళ సభ్యులు, పౌరులుగా ఉన్నవారిని సాక్షులుగా ఎంపిక చేయడమైనది. ఈ పత్ర లేఖకుడు పార్థిజయతుడు. ఇందులో అక్షర దోషాలు ఉన్నా వాటిని లెక్క చేయనవసరం లేదు.”

“ వ్యాపారానికి కావలసిన పెట్టుబడి అవసరాలను తీర్చే బ్యాంకింగ్ విధానాలు కూడా ఈ కాలంలో మనకు కనిపిస్తాయి. వీరిని సర్రాఫ్‌లు అని పిలిచేవారు. వీళ్ళు కొందరి దగ్గర డబ్బు డిపాజిట్‌గా స్వీకరించి దానిమీద వడ్డీ ఇస్తూ మరోపక్క అవసరమైన వారికి రుణాలు ఇచ్చి దానిమీద వడ్డీ వసూలు చేసేవారు. ఈ సర్రాఫ్‌లలో కొందరు ఉన్నత రాజవంశీకులకు కూడా రుణాలు ఇచ్చేవారు. ”

### 4. వర్తకులు

చేతివృత్తుల తరగతులకు ఎగువ స్థాయిలో వర్తకుల తరగతి ఉండేది. వీరిలో అధికసంఖ్యలో ఉండే దుకాణదారులు ఆర్థిక స్తోమత తక్కువగా ఉన్నవారు. కొద్దిమంది మాత్రమే ఎక్కువ సంపద కలిగివుండేవారు. షేక్ నసీరుద్దిన్ రాతలలో అయోధ్యలో బట్టల వ్యాపారుల్లో పెద్ద స్థాయి గలిగిన ఒక వ్యక్తి రెండు వేల టంకాలు (బంగారు నాణేలు) పెట్టుబడి పెట్టినట్టు పేర్కొన్నాడు. డిల్లీలో వ్యాపారుల గృహాలు సాధారణంగా రెండంతస్తులలో ఉండేవని, దిగువ అంతస్తులో దుకాణం, ఎగువ అంతస్తులో వారి కుటుంబం ఉండేవని నసీరుద్దిన్ తెలిపాడు.

బహుశా మొదటిసారి మనకి దళారీ వర్తకుల ప్రస్తావన ఈ కాలపు రాతల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా గుర్రాల వ్యాపారంలో, ఆడ బానిసల వ్యాపారంలో వీళ్ళు ఉండేవారని అమీర్ ఖుస్రూ తెలిపాడు. వాళ్ళు అటు కొనుగోలుదారులనీ, ఇటు అమ్మకందారులనీ కొల్లగొట్టే రకాలుగా అతడు విమర్శించాడు. ఈ విధంగానే విమర్శకు పాత్రులైన మరొక తరగతి టోకు వ్యాపారులు. వీళ్ళు కృత్రిమంగా కొరతను సృష్టించి ధరలను పెంచేందుకు పూనుకుంటారని ఖుస్రూ పేర్కొన్నాడు. వీరిని అల్లావుద్దిన్ ఖిల్జీ అణచివేయడానికి కూడా పూనుకున్నాడు.

వ్యాపారానికి కావలసిన పెట్టుబడి అవసరాలను తీర్చే బ్యాంకింగ్ విధానాలు కూడా ఈ కాలంలో మనకు కనిపిస్తాయి. వీరిని సర్రాఫ్‌లు అని పిలిచేవారు. వీళ్ళు కొందరి దగ్గర డబ్బు డిపాజిట్‌గా స్వీకరించి దానిమీద వడ్డీ ఇస్తూ మరోపక్క అవసరమైన వారికి రుణాలు ఇచ్చి దానిమీద వడ్డీ వసూలు చేసేవారు. ఈ సర్రాఫ్‌లలో కొందరు ఉన్నత రాజవంశీకులకు కూడా రుణాలు ఇచ్చేవారు. ఆ రుణాలను తిరిగి చెల్లించేబదులు కొన్ని పరగణాల్లో పన్నులు వసూలు చేసుకుని రుణం



చెల్లుబాటుకింద జమ కట్టుకునేవిధంగా ఆ రాజవంశీకులు ఫర్మానాలు జారీ చేసేవారు. ఈ క్రమంలో ఆ వడ్డీ వ్యాపారులు బాగా సంపదలను పోగేసుకోగలిగారని బరానీ తెలిపాడు. కొందరు వడ్డీ వ్యాపారులైతే ఆ ఫర్మానాలనే హెచ్చు ధరకు మరికొందరికి అమ్ముకునేవారని కూడా తెలిపాడు. ఈ వడ్డీ వ్యాపారుల ప్రస్తావనలు, వారికి ఇచ్చిన ఫర్మానాలు (వీటినే హుండికలు అనేవారు) డిల్లీ సుల్తానుల రాజ్యంలోనే గాక కాశ్మీర్‌లో (11వ శతాబ్దం, క్షేమేంద్రుడు రాసిన లోక ప్రకాశ నుంచి) గుజరాత్ లో (13వ శతాబ్దం, లోకపద్ధతి నుండి) మనకు కనిపిస్తున్నాయి. క్రమంగా 15వ శతాబ్దం నాటికి ఆర్థికంగా బలమైన ఒక బ్యాంకర్ల తరగతి దేశంలో వివిధ ప్రాంతాల్లో పెరిగింది. వీరి వద్ద సంపద పోగుబడడంలో హుండికలు ఒక ముఖ్య పాత్ర పోషించాయి. వీరి వద్ద పోగుబడిన సంపద ఎంత ఎక్కువగా ఉండేదంటే ఫిరోజ్‌షాకు 1351లో హర్యానాలోని కొందరు సర్రాఫ్‌లు కొన్ని లక్షల టంకాల రుణం ఇచ్చే స్థాయికి పెరిగారు.

ఈ క్రమంలో ఈ వ్యాపార తరగతుల వారంతా బలంగా సంఘటితం కావడానికి వారికి కుల వ్యవస్థ తోడ్పడింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ కులాలుగా అంతవరకూ వ్యవహరించిన వీరు ఇప్పుడు ఒకే పెద్ద కులంగా, వైశ్య కులంగా (బనియా) సంఘటితం అయారు. అందులోనే వివిధ ఉపకులాలు సర్దుకున్నాయి. గుజరాత్‌లోని లేఖపద్ధతి రాతల్లో అంతవరకు శ్రీమాలి, ప్రగవతె, వాయాద, ఓస్వాల్, గుర్జర వంటి వేరు వేరు కులాలుగా ఉన్నవారంతా బనియా కులంలోని ఉపకులాలుగా ఏర్పడినట్టు ఉంది. ముల్తాన్ పట్టణం నుంచి డిల్లీ వచ్చిన ఖత్రీ కులస్తులు కూడా బనియాలలో ఒక ఉపకులంగా మారారు. రోహతగి, అగర్వాల్ వంటి కులాలూ అదేవిధంగా బనియా కులంలోని ఉపకులాలుగా మారారు. దక్షిణాదిలోని చెట్టియా ర్లూ అంతే.

హిందూ బనియాలతోబాటు ముస్లిం వర్తకులు కూడా దేశంలో స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేవారు. వీరిలో భారతదేశం నుండి గజనికి బానిసలను తరలించే వ్యాపారాన్ని కూడా చేసేవారు.

### 5. మధ్య తరగతి

రాజ్య నిర్వహణలో లెక్కలు రాయడం, ఫర్మానాలు తయారు చేయడం, లేఖలు రాయడం, దౌత్య సంభాషణలను రికార్డు చేయడం, ఒప్పంద పత్రాలను తయారు చేయడం, లావాదేవీలను నమోదు చేయడం వంటి పనులను చేయడానికి చదువుకున్న వ్యక్తులు అవసరమయారు. వీరిని దానిష్‌మండ్‌లు అనేవారు. వీరిలో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలలో కుదురుకునేవారు. వీరితోబాటు మత వ్యవహారాలను నడిపే ఒక పెద్ద తరగతి కూడా ఉండేది. బ్రాహ్మణులు, ముల్లాలు కలిసి ఫిరోజ్‌షాకు డిల్లీలో 1351లో స్వాగతం పలికినట్టు బరానీ పేర్కొన్నాడు.


దాన ధర్మాలు కూడా పెద్ద సంఖ్యలో ఉపాధికల్పనకు తోడ్పడ్డాయి. కుతుబుద్దిన్ ముబారక్ షా సమాధి సందర్శకులకు ఉచిత భోజన సదుపాయం కల్పించే పనిలో 460 మంది పని చేస్తూవుండినట్టు తెలుస్తోంది. ఉచిత భోజన కేంద్రాలను లంగర్లు అనేవారు. హిందువులు ధర్మశాలలు (సత్రాలు) నడిపేవారు. రాజులు, వర్తకులు ఈ లంగర్లకు, ధర్మశాలలకు ఇచ్చే విరాళాలు వాటిని నిర్వహించడానికి తోడ్పడేవి. వాటిని నడిపే పనిలో పెద్ద సంఖ్యలో పనివాళ్ళు, నిర్వాహకులు ఉండేవారు. ఈ లంగర్లు, ధర్మశాలలు పేదరిక భారాన్ని తగ్గించడానికి పెద్దగా తోడ్పడలేదు. కానీ సన్యాసులను, ఫకీర్లను, బికార్లను, ముష్టివారిని పెంచాయి.

(తరువాయి వచ్చే సంచికలో)

అంతర్జాతీయ పరిణామాలు

# క్యూబాపై అమెరికా కుట్రలను తిప్పికొట్టాలి

పీటర్ బొహ్మెర్



రచయిత 1967 నుండి సమాజాన్ని విప్లవాత్మకంగా మార్చటానికి తోడ్పడే ఉద్యమాలలో పని చేస్తున్నారు. జాత్యహంకారానికి వ్యతిరేకంగా, వియత్నాం, దక్షిణాఫ్రికా, ప్యూర్టోరికో, క్యూబా, పాలస్తీనా, మధ్య అమెరికా దేశాలలో జరుగుతున్న ఉద్యమాలకు సంఘీభావ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఆయన కార్యక్రమాలు, బోధనలపై కినుక వహించిన ఎఫ్‌బిఐ ఆయనను లక్ష్యంగా చేసుకుంది. పశ్చిమాఫ్రికాలోని ఒలెంపియాలో ఉన్న ఎవర్‌గ్రీన్ స్టేట్ కాలేజి అధ్యాపక బృందంలో 1987 నుండి 2021 వరకు సభ్యునిగా ఉండి, రాజకీయ అర్థశాస్త్రం బోధించారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సాధ్యమేనని ఆయన నమ్ముతున్నారు. ఆయనకు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు

క్యూబాపై అదనపు ఆంక్షలు విధించటం కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై ట్రంప్ 2026, మే 1వ తేదీన సంతకం చేశాడు. "క్యూబాను మనం తక్షణమే స్వాధీనం చేసుకోబోతున్నాం" అని ట్రంప్ ప్రకటించాడు. క్యూబాకు వ్యతిరేకంగా సైనిక చర్యకు సన్నద్ధంగా ఉండాలని ఏప్రిల్ 14వ తేదీన ట్రంప్ అధికార యంత్రాంగం అమెరికా రక్షణ శాఖ పెంటగాన్‌కు ఆదేశాలు జారి చేసినప్పటి నుండి ఈ బెదిరింపులు పెరుగుతున్నాయి. "ఎంత శక్తివంతమైన దురాక్రమణదారునికైనా క్యూబా లొంగిపోవటం జరగదు. మా దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ప్రతి అంగుళం భూ భాగాన్ని కాపాడుకోవటానికి దృఢంగా నిలబడే ప్రజలను వారు ఎదుర్కొంటారు" అని క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఈ బెదిరింపులకు సమాధానం చెప్పాడు.

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ముగిసిన తర్వాత క్యూబా విషయం చూస్తాం అని ట్రంప్ విలేకరులకు చెప్పాడు. అమెరికా జాతీయ భద్రతకు క్యూబా నుండి అసాధారణమైన ప్రమాదం ఎదురౌతున్నదని జనవరి 29వ తేదీన జారి చేసిన ఎగ్జిక్యూటివ్ ఆదేశాలలో పేర్కొన్నారు. క్యూబాకు ఆయిల్ సరఫరా చేయటాన్ని నిరోధిస్తున్నామని, ఆ దేశానికి ఆయిల్ సరఫరా చేసే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించాడు. క్యూబాకు మెక్సికో, వెనిజులా ప్రధానంగా ఆయిల్ సరఫరా చేస్తున్నాయి. వీటితో పాటు ఇతర దేశాలు కూడా క్యూబాకు ఆయిల్ సరఫరా చేయకుండా మార్చి నెలలో అమెరికా నిరోధించింది. మార్చి నెలాఖరులో రష్యా నుండి ఒక పెద్ద నౌక మాత్రమే ఆయిల్ తీసుకొని క్యూబాకు వచ్చింది.

సిఐఎ నిరంతర జోక్యంతో పాటు, ఈ మధ్య క్యూబాపై సైనిక విమానాలు తారట్లాడుతున్నాయి. ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి 1961లో సిఐఎ నాయకత్వంలో జరిగిన బే ఆఫ్ పిగ్స్ దురాక్రమణ దాడులను ఇది గుర్తుకు తెస్తున్నది. ఫైడల్ కాస్ట్రోను హత్య చేయటం కోసం సిఐఎ వందకు పైగా విఫల ప్రయత్నాలు చేసింది. క్యూబా నుండి అమెరికాకు వలస వచ్చిన వారిని ఆ దేశంలోని సార్వభౌమ ప్రభుత్వంపై ఉగ్రవాద దాడులు చేయటం కోసం వినియోగించుకొంటున్నారు.

ఫైడల్ కాస్ట్రోతో కలిసి ఆయన సోదరుడైన రావుల్ కాస్ట్రో విప్లవాన్ని జయప్రదం చేయటం కోసం పోరాడారు. 2008 నుండి 2018 వరకు రావుల్ కాస్ట్రో దేశాధ్యక్షునిగా పనిచేశారు. 50 సంవత్సరాలు క్యూబా సైనికదళాలకు నాయకత్వం వహించారు. 95 సంవత్సరాల వయసున్న రావుల్ కాస్ట్రోను అరెస్టు చేయటం కోసం అమెరికా న్యాయశాఖ మే నెల 21వ తేదీన వారెంట్ జారి చేయటం పరిస్థితులను మరింత తీవ్రం చేసింది. కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఉన్న రావుల్ కాస్ట్రోపై తప్పుడు ఆరోపణలతో అక్రమ కేసులు బనాయించారు. ప్రత్యేక సైనికదళాలు క్యూబాలో ప్రవేశించి, రావుల్ కాస్ట్రోను చంపటం లేదా అపహరించుకుపోవటానికి ఈ వారంట్ సాకుగా ఉపయోగపడుతుంది.

దాడి చేస్తామని బెదిరించటం, కొందరిని లక్ష్యంగా పెట్టుకొని హత్యలు, బాంబు దాడులు చేయటంతో పాటు ఆర్థిక దిగ్బంధం చేయటం ద్వారా క్యూబాపై ఇప్పటికే యుద్ధం చేస్తున్నారు. 66 సంవత్సరాలుగా క్యూబాపై దిగ్బంధాన్ని కొనసాగించటంతో పాటు, దానిని మరింత తీవ్రం చేయటాన్ని ఇది వెల్లడిస్తున్నది. అమెరికా విమానవాహక యుద్ధనౌక నిమిట్జ్‌ను క్యూబా తీరంలో నిలిపి ఉంచటంతో పాటు కరీబియన్ ప్రాంతంలో సైనిక కార్యకలాపాలను తీవ్రం చేశారు. క్యూబా భూభాగంలో ఉన్న గ్వాంటనామో బేను అమెరికా ఆక్రమించుకొని ఉన్నది.

క్యూబాకు చమురు దొరకకపోవటంతో విద్యుత్ కోతలు సాధారణమైనాయి. ఒక్కొక్కసారి 20 గంటల పాటు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. ఆరోగ్యవ్యవస్థ దెబ్బతినటంతో పాటు ఆహారం, నీటి కొరతను క్యూబా ప్రజలు ఎదుర్కొంటున్నారు. క్యూబా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొనేలా చేయటం, వాటిని భరించలేక వారు తిరగబడి ప్రభుత్వాన్ని కూలదోసేలా రెచ్చగొట్టటం ట్రంప్ ప్రభుత్వ వ్యూహంగా ఉన్నది. ఈ వ్యూహం చట్టానికి, మానవత్వానికి, నైతిక సూత్రాలకు వ్యతిరేకమైనది. క్యూబా ప్రభుత్వం చట్టబద్ధమైనది కావటం, అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే కేంద్రంగా ఉండటం వలన ఈ వ్యూహం విజయం సాధించటం కష్టమౌతుంది. దానితోపాటు క్యూబా కమ్యూనిస్టు పార్టీలోనూ, సైన్యంలో నాయకత్వంపైనా కొద్ది మేరకు వ్యతిరేకత ఉన్నది. అయినప్పటికి అమెరికా సైనికదాడి తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. అది జరగకుండా మనం చూడాలి.

> **"ఒబామా అధ్యక్షునిగా ఉన్న కాలంలో దిగ్బంధాన్ని కొంత మేరకు సడలించారు. దౌత్య సంబంధాలను పునరుద్ధరించటంతో పాటు టూరిజం, వాణిజ్యంతో పాటు అమెరికాలో ఉంటున్న క్యూబన్లు నిధులు పంపటానికి కొంత మేరకు అనుమతించారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత వీటిని రద్దుచేసి తిరిగి పాత విధానాలను అమలు జరుపుతున్నాడు. క్యూబా టెర్రరిజాన్ని బలపరుస్తున్నదని ప్రకటించటంతో అంతర్జాతీయ ఆర్థిక వనరుల నుండి రుణాలు పొందటానికి మరిన్ని పరిమితులు ఏర్పడ్డాయి."**

### అమెరికా క్యూబాను ద్వేషించటానికి కారణమేమిటి?

ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలోని విప్లవకారులు 1959, జనవరి 1వ తేదీన ఫుల్‌గెన్సియో బటిస్టా నియంతృత్వాన్ని కూలదోయటంతో క్యూబా విప్లవం జయప్రదమైంది. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ క్యూబా విప్లవ ప్రభుత్వాన్ని కూలదోయటం కోసం 1960 ఆకురాలు కాలంలో ఆదేశాలు జారి చేశాడు. గత 66 సంవత్సరాలుగా క్యూబాలోని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించటానికి కుట్రలు చేయటమే అమెరికా ప్రభుత్వ విధానంగా ఉన్నది.

1960 నుండి 1980వ దశాబ్దం అంతా అమెరికా పాలకవర్గాలను భయపెట్టే "మంచి ఉదాహరణ"గా క్యూబా ఆర్థిక విధానం ఉన్నది. తన ప్రజల అవసరాలను తీర్చటం ద్వారా దక్షిణార్ధ గోళంలోని దేశాల ప్రజలు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా విప్లవాలకు సన్నద్ధమయేలా క్యూబా ఉత్తేజపరుస్తుందనే భయం అమెరికాకు పట్టుకున్నది. క్యూబాలో అమలు జరిపిన భూ సంస్కరణల వలన అమెరికన్ల యాజమాన్యంలోని పంచదార మిల్లులు, గనులు, హోటళ్ళ లాంటి ఆస్తులు జాతీయం చేయబడ్డాయి. ప్రపంచంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు, విప్లవోద్యమాలకు మద్దతిచ్చే అంతర్జాతీయ విధానం, సార్వజనిక విద్య, వైద్యం, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడటం ద్వారా క్యూబా విప్లవం, ఫైడల్ కాస్ట్రో అమెరికా ఖండంలోని దేశాలన్నింటిలోనూ ప్రజల మద్దతు పొందారు.

1990-91లో సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత క్యూబా తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నది. తాము దిగుమతి చేసుకొంటున్న సరుకులకు చెల్లించటానికి అవసరమైనంత విదేశీ మారక ద్రవ్యాన్ని ఎగుమతుల ద్వారా సంపాదించ లేకపోవటమే వారి ప్రధాన సమస్యగా ఉన్నది. 1990ల ప్రారంభం నుండి పర్యాటక రంగం విదేశీ మారకాన్ని సంపాదించే ప్రధాన వనరుగా ఉన్నది. కానీ కోవిడ్ మహమ్మారి సమయంలో దెబ్బతిన్న ఆ రంగం తిరిగి కోలుకోలేదు. హోటళ్ళ రంగంలో క్యూబా ఎక్కువ పెట్టుబడులు పెట్టింది. 1998లో వెనిజులాలో హ్యూగో ఛావెజ్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత క్యూబా డాక్టర్ల సేవలు, మందులు, రక్షణ, వ్యవసాయ రంగాలలో సలహాదారులు అందించిన సేవలకు బదులుగా ఆయిల్ సరఫరా చేసింది. దీనితో సోవియట్ పతనంతో వాటిల్లిన నష్టం పాక్షికంగా భర్తీ అయింది.

ఒబామా అధ్యక్షునిగా ఉన్న కాలంలో దిగ్బంధాన్ని కొంతమేరకు సడలించారు. దౌత్య సంబంధాలను పునరుద్ధరించటంతో పాటు టూరిజం, వాణిజ్యంతో పాటు అమెరికాలో ఉంటున్న క్యూబన్లు నిధులు పంపటానికి కొంత మేరకు అనుమతించారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత వీటిని రద్దుచేసి తిరిగి పాత విధానాలను అమలు జరుపుతున్నాడు. క్యూబా టెర్రరిజాన్ని బలపరుస్తున్నదని ప్రకటించటంతో అంతర్జాతీయ ఆర్థిక వనరుల నుండి రుణాలు పొందటానికి మరిన్ని పరిమితులు ఏర్పడ్డాయి. కొందరు క్యూబన్లు ఆర్థిక ఇబ్బందులతో వలసలు పోయారు. ప్రస్తుతం క్యూబాలో 1.09 కోట్ల జనాభా ఉన్నారు. గత ఆరు సంవత్సరాలలో 15 లక్షల జనాభా తగ్గింది. 2018-25 మధ్య బాలల మరణాలు రెండు రెట్లకు పైగా పెరిగాయి.

అమెరికా దిగ్బంధం, ఆంక్షలు క్యూబా ఆర్థిక సమస్యలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. తమ ప్రజలకు అవసరమైనంత ఆహారాన్ని ఉత్పత్తి చేయలేకపోవటంతో పాటు, జీవన ప్రమాణాలను స్థిరంగా పెంచే విధంగా ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయలేదు. 1990వ దశాబ్దంలో ప్రారంభించిన రసాయన రహిత వ్యవసాయం మంచి ఫలితాలను ఇచ్చినప్పటికీ, ఆహార దిగుమతులపై ఆధారపడటాన్ని అధిగమించలేక పోయింది. ఎక్కువ రంగాలలో ఉత్పాదకత పెరుగుదల మందకొడిగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత ప్రణాళికను రూపొందించి అమలు చేయటం సమస్యగా

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

ఉన్నది. ప్రైవేటు మార్కెట్లపై ఆధారపడటం పెరిగినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. ఉత్పత్తిని పర్యవేక్షించటంలో ఎక్కువ మంది కార్మికులు భాగస్వాములయేలా చేయటం ఉపయోగకరంగా ఉంటుంది.

"మంచి ఉదాహరణ"గా ఉన్న క్యూబా ఇప్పుడు ప్రమాదకరంగా లేనప్పటికీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించటమే ఆ దేశం చేసిన నేరమని అమెరికా భావిస్తున్నది. తన దేశ రాజకీయాలు, ఆర్థికవ్యవస్థను నిర్వహించుకోవటంలో అమెరికా పెత్తనాన్ని క్యూబా వ్యతిరేకిస్తున్నది. 1824లో రూపొందించిన మన్రో సిద్ధాంతం ప్రాతిపదికగా అమెరికా లాటిన్ అమెరికా దేశాలపై ఆధిపత్యం కొనసాగిస్తున్నది. ట్రంప్ ప్రభుత్వం 2025 డిసెంబరులో రూపొందించిన జాతీయ భద్రత వ్యూహం నివేదిక ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నది. అమెరికా 2026, జనవరి 3వ తేదీ నుండి వెనిజులాపై దాడిని తీవ్రం చేస్తున్న లక్ష్యాలలో వెనిజులా నుండి క్యూబాకు ఆయిల్ పరఫరా కాకుండా చూడటం ఒకటి.

### క్యూబా ఎదుర్కొంటున్న సంక్షోభం: అందుతున్న మద్దతు

తనకు అవసరమైన ఇంధనంలో మూడోవంతు మాత్రమే స్వంతంగా ఉత్పత్తి చేసుకొంటున్న క్యూబా తన అవసరాలకు సరిపడా దిగుమతులు చేసుకోవటానికి విదేశీ మారకద్రవ్యం లభ్యత ఒక ప్రధాన సమస్యగా ఉన్నది. గ్యాలన్ గ్యాసోలిన్‌ను 40 డాలర్లకు అమ్ముతున్నారు. చైనా నుండి ఎక్కువ సౌర ఫలకాలు, బ్యాటరీలను దిగుమతి చేసుకొని, పునరుత్పాదక ఇంధనాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేయటం ద్వారా ఈ సమస్యను పరిష్కరించటానికి క్యూబా ప్రయత్నం చేస్తున్నది. క్యూబా అవసరాలలో సౌర విద్యుత్ నాలుగవ వంతు ఉన్నది. ఉత్పత్తిని వేగంగా పెంచుతున్నారు. కానీ ఇది తక్షణ పరిష్కారం కాదు.

అమెరికాకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ప్రపంచంలోని అనేక దేశాల ప్రభుత్వాలు, ప్రజలు క్యూబాకు మద్దతు ఇస్తున్నారు. క్యూబాపై విధించిన దిగ్బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఓటింగ్‌లో 165 దేశాలు అనుకూలంగా ఓటు చేయగా, ఏడు దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి. ప్రధానంగా వైద్య పరికరాలు, ఆహారంతో కూడిన 800 టన్నుల సహాయాన్ని మెక్సికో ప్రభుత్వం ఈ మధ్యనే పంపించింది. ఈ సహాయం

> ❝ తనకు అవసరమైన ఇంధనంలో మూడోవంతు మాత్రమే స్వంతంగా ఉత్పత్తి చేసుకొంటున్న క్యూబా తన అవసరాలకు సరిపడా దిగుమతులు చేసుకోవటానికి విదేశీ మారకద్రవ్యం లభ్యత ఒక ప్రధాన సమస్యగా ఉన్నది. గ్యాలన్ గ్యాసోలిన్‌ను 40 డాలర్లకు అమ్ముతున్నారు. చైనా నుండి ఎక్కువ సౌర ఫలకాలు, బ్యాటరీలను దిగుమతి చేసుకొని, పునరుత్పాదక ఇంధనాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేయటం ద్వారా ఈ సమస్యను పరిష్కరించటానికి క్యూబా ప్రయత్నం చేస్తున్నది. ❞




అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ పర్యటన సందర్భంగా లండన్ నగరంలో 'క్యూబా జోలికి వెళ్లొద్దు' అంటూ బ్యానర్లతో నిరసన ప్రదర్శన చేస్తున్న బ్రిటిష్ పౌరులు

ముఖ్యమైనదే అయినప్పటికీ క్యూబా ప్రజలకు ఎదురౌతున్న ఆర్థిక సమస్యలను తగ్గించటానికి, ప్రభుత్వాన్ని కూలదోయటం కోసం అమెరికా చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కోవటానికి ఇది ఏ మాత్రం సరిపోదు.

క్యూబా కమ్యూనిస్టు పార్టీకి, నాయకత్వానికి మద్దతు, ముఖ్యంగా యువతలో తగ్గుతున్నప్పటికీ అమెరికా నాయకత్వంలో జరిగే తిరుగుబాటుకు, క్యూబా నుండి వలస వెళ్ళిన మితవాదుల నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి తక్కువ మంది మాత్రమే మద్దతు ఇస్తున్నారు. వెనిజులాలో వలే ప్రస్తుతం ఉన్న వ్యవస్థను, నాయకత్వాన్ని కూలదోయటానికి మద్దతు ఇచ్చేవారు క్యూబా కమ్యూనిస్టు పార్టీలోనూ, సైన్యంలోనూ లేరు. క్యూబా నాయకత్వాన్ని అమెరికా అపహరించటం లేదా హత్య చేయటం( యుద్ధనేరం) చేయవచ్చు. కానీ అక్కడ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నడపటం సాధ్యం కాదు. అమెరికా దురాక్రమణ, బాంబు దాడులు ప్రజలకు మరిన్ని ఆర్థిక ఇబ్బందులు కల్పించటంతో పాటు మరణాలు కూడా సంభవించవచ్చు. కానీ అమెరికా దురాక్రమణకు ప్రజలు, సైన్యం నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురౌతుంది. క్యూబాను ప్రతినిత్యం బెదిరిస్తున్నప్పటికీ, ఇరాన్‌పై సైనికంగా విజయం సాధించటంలో ట్రంప్ ప్రభుత్వానికి ఎదురైన వైఫల్యంతో ప్రత్యక్ష దాడికి విముఖంగా ఉన్నారు.

1930లో స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరుగుతున్నపుడు ఫాసిజానికి వ్యతిరేకంగా రిపబ్లిక్‌ను, వామపక్షాలను బలపరచటం కోసం 50కి పైగా దేశాల నుండి వలంటీర్లు వెళ్ళి ప్రతిఘటనలో పాల్గొన్నారు. అమెరికా నుండి అబ్రహాం లింకన్ బ్రిగేడ్‌లో 3,000 మందికి పైగా పాల్గొన్నారు. ఫ్రాంకో విజయాన్ని వారు అడ్డుకోలేకపోయినప్పటికీ ఫాసిజం వలన రానున్న ప్రమాదాన్ని గురించి ప్రపంచ ప్రజలలో చైతన్యం పెంచారు. ఇపుడు క్యూబాకు అటువంటి సంఘీభావం కావాలి.

క్యూబాకు సంఘీభావం అంటే అర్థం ప్రభుత్వానికి, ప్రజలకు, సంఘాలకు మద్దతు తెలపాలి. క్యూబాకు, క్యూబా ప్రజలకు

> **" స్థానికంగానూ, జాతీయంగానూ కరీబియన్, తూర్పు పసిఫిక్‌లో బోట్ల పైనా, ఇరాన్, వెనిజులా, ఇతర దేశాలపై అమెరికా దాడులను వ్యతిరేకిస్తూ అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన యుద్ధ వ్యతిరేక ఉద్యమం రావాలి. ప్రస్తుతం అమెరికా లో జరుగుతున్న పాలస్తీనా సంఘీభావ ఉ ద్యమాన్ని ఇందుకు ప్రాతిపదికగా ఉపయోగించుకొని ముందుకు తీసుకుపోవాలి. "**

వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న దిగ్బంధాన్ని వ్యతిరేకించటమే కాకుండా, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇవ్వాలి. అంతర్జాతీయంగానూ, దేశీయంగానూ క్యూబా వ్యవహరించిన తీరు సంఘీభావం పొందటానికి అర్హమైనదిగా ఉన్నది. ఇంధనం, సరుకుల కొరత ఉన్నప్పటికీ ప్రజలందరికీ సామాజిక రక్షణను కల్పించటాన్ని కొనసాగిస్తున్నది.

**మనమేమి చేయాలి?**

ఇంతకు ముందు చెప్పినట్లుగా జనవరిలో దిగ్బంధాన్ని తీవ్రం చేయక ముందు నుండే క్యూబా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. క్యూబాకు ఆయిల్ విక్రయిస్తే అదనపు సుంకాలు విధిస్తామని బెదిరించటం కొత్తది. ద్విముఖ వ్యూహంతో 66 సంవత్సరాల నుండి క్యూబాపై దిగ్బంధాన్ని కొనసాగిస్తున్నారు. అమెరికా కొనసాగిస్తున్న అన్ని విధాలైన దిగ్బంధం, ఆంక్షలను రద్దు చేయాలనీ, క్యూబా ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవం పొందటానికి అవసరమైన వాణిజ్యం, రుణాలు, ద్రవ్య ప్రవాహం, పర్యాటకం, రాయబార సంబంధాలలో ఆంక్షలు తొలగించటంతో పాటు సార్వభౌమత్వాన్ని గౌరవించాలనే ప్రధాన డిమాండ్‌ను కూడా నొక్కి చెప్పాలి. క్యూబాతో సాధారణ సంబంధాలను ఏర్పాటు చేసుకొనే దేశాలపై ఎటువంటి ఆంక్షలు విధించకూడదు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధాన్ని మెజారిటి ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లుగానే క్యూబాకు వ్యతిరేకంగా యుద్ధం చేయటానికి ఉన్న నిశ్శబ్ద వ్యతిరేకతను కార్యాచరణతో కూడిన వ్యతిరేకతగా మార్చాలి. మే 6వ తేదీన యుగొ సంస్థ విడుదల చేసిన ఒపీనియన్ పోల్‌లో 64 శాతం అమెరికా ప్రజలు క్యూబాపై యుద్ధం చేయటాన్ని వ్యతిరేకిస్తున్నారు. 15 శాతం బలపరచగా, 21 శాతం అనిశ్చితిలో ఉన్నారు.






రావుల్ కాస్ట్రో

స్థానికంగానూ, జాతీయంగానూ కరీబియన్, తూర్పు పసిఫిక్‌లో బోట్ల పైనా, ఇరాన్, వెని జులా, ఇతర దేశాలపై అమెరికా దాడులను వ్యతిరేకిస్తూ అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన యుద్ధ వ్యతిరేక ఉద్యమం రావాలి. ప్రస్తుతం అమెరికా లో జరుగుతున్న పాలస్తీనా సంఘీభావ ఉద్యమాన్ని ఇందుకు ప్రాతిపదికగా ఉపయోగించుకొని ముందుకు తీసుకుపోవాలి. ఇజ్రాయెల్‌కు అన్ని విధాలైన సహాయాన్ని వ్యతిరేకించటం, పాలస్తీనాకు సంఘీభావం తెలియజేయటం వలన అది ఒక పెద్ద యుద్ధ వ్యతిరేక ఉద్యమంగా రూపు దిద్దుకుంటుంది. కాలేజీలలో అపుడపుడు జరుగుతున్న ఉద్యమాలకు స్థిరత్వాన్ని ఇవ్వటానికి ఇది అవసరం. యుద్ధానికి వ్యతిరేకంగా, సమానత్వం, న్యాయం కోసం దేశీయంగా, విదేశాలలో యుద్ధ వ్యతిరేక ప్రజా సంస్థలను నిర్మించటం మరొక మార్గం.

మన సమాజాలలో, కుటుంబాలలో, పని ప్రదేశాలలో, యూనియన్లు, చర్చిలు, పాఠశాలలు, వివిధ సంస్థలు, రాజకీయ పార్టీలు, వివిధ కార్యక్రమాలలో క్యూబాకు వ్యతిరేకంగా దాడులు చేయకూడదని, తక్షణమే దిగ్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేయాలి. చర్చలు, తీర్మానాలు, కాంగ్రెస్‌ను ప్రభావితం చేయటం తదితరాల ద్వారా క్యూబాకు సంఘీభావం తెలపాలి. ఫోరమ్స్, ప్రదర్శనలు, సభలు, ప్రత్యక్ష కార్యాచరణ తదితరాలలో క్యూబాకు సంఘీభావం తెలపటాన్ని భాగంగా చేయాలి. అమెరికాకు వలస వెళ్ళిన వారిలో క్యూబాపై యుద్ధానికి వ్యతిరేకతను పెంచటం, అమెరికాలో ఆర్థిక న్యాయాన్ని సాధించుకోవటానికి ఈ విధంగా ప్రయత్నం చేయాలి.

క్యూబాపై అమెరికా దాడులను ఆపటం కష్టమే కానీ సాధ్యమౌతుంది. ఇందుకు అమెరికాను వ్యతిరేకించటంతో పాటు క్యూబాకు ప్రపంచ సంఘీభావం అవసరం. డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లలో ఎవరు అధికారంలో ఉన్నా క్యూబా సార్వభౌమత్వాన్ని ఆమోదించటం, అన్ని విధాలైన దాడులను ఆపటం తమకు ప్రయోజనం కలిగిస్తుందని భావించటానికి అమెరికాలో సాధ్యమైనంత ఎక్కువగా యుద్ధ వ్యతిరేక శక్తులను సమీకరించటం అవసరం.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

సిద్ధాంతం

# ఆంటోనియో గ్రాంసీ: ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం

## (హెజిమోనీ, కౌంటర్-హెజిమోనీ)



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

ఎస్ వెంకట్రావు

మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, పిన్న వయసులోనే ఫాశిస్టు ముస్సోలినీ కర్కశ జైలు శిక్షలో అసువులు బాసిన ఆంటోనియో గ్రాంసీ రచనల్లో అతి ముఖ్యమైన విషయం, నేటి కాల పరిస్థితుల్లో మనం అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉన్న అంశం…"ఆధిపత్యం, ప్రత్యాధి పత్యం" (హెజిమోనీ, కౌంటర్–హెజి మోనీ). హెజిమోనీ అనే పదాన్ని గ్రాంసీ సృష్టిం చకపోయినా ఒక భావన (కాన్సెప్ట్)కు ఆ పేరు పెట్టింది, లేదా ఆ పేరుతో ఒక భావనను వివరించింది మాత్రం ఆయనే. 11 ఏళ్ల తన జైలు జీవితంలో గ్రాంసీ ఎంతో ప్రయాసకోర్చి రాసిన 'జైలు రచనలు' (ప్రిజన్ నోట్‌బుక్స్)లో హెజిమోనీ, కౌంటర్ హెజిమోనీ అనే భావనను ప్రతిపాదించాడు.

### ఆధిపత్యం (హెజిమోనీ) అంటే ఏమిటి?

ఆధిపత్యం అనే పదాన్ని గ్రాంసీ సాధరణ అర్థంలో వాడలేదు. ఏదైనా పాలకవర్గం తన క్రింది వర్గాలపై ఎలా పరిపాలన సాగిస్తుంది అని చెప్పడానికి గ్రాంసీ ఈ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అన్న పదాన్ని ఉపయోగించాడు. అందువల్ల పాలవర్గాన్ని లేక వర్గాలను కూలదోసి తనదైన వర్గపాలన నెలకొల్పాలనుకున్న వర్గం లేక వర్గాలు కూడా తమతో కలిసివచ్చే వర్గాలపై 'ఆధిపత్యం' (హెజివోనీ) సాధించాలని చెప్పాడు. నిజానికి ఆధిపత్యం అనే భావన మార్క్సిస్టు పరిభాషలో అంతకుముందు నుండీ వస్తున్నదే. కార్మిక వర్గం ఇతర పీడిత వర్గాలకు నాయకత్వం వహించడాన్ని లెనిన్ కార్మికవర్గ ఆధిపత్యంగా వర్ణించాడు. ''వర్తమాన సమాజంలో ఏకైక నిరంతర విప్లవ వర్గంగా కార్మిక వర్గం మొత్తం ప్రజల ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాలి. అంటే మొత్తం శ్రామికులు, దోపిడీకి గురవుతున్న ప్రజలు తమను పీడిస్తున్న, దోపిడీ చేస్తున్న వర్గాలపై జరిపే పోరాటానికి నాయకత్వం హించాలి" అని లెనిన్ చెప్పాడు. అయితే, గ్రాంసీ ఈ లెనినిస్టు భావనను మరింత పరిపుష్టం గావించాడు.

గ్రాంసీ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అంటే పీడిత వర్గాలపై పాలక వర్గాల నైతిక, మేధోపరమైన నాయకత్వం అని అర్థం. ఇటువంటి నాయకత్వం వల్ల పీడిత వర్గాలు పాలక వర్గాల నాయకత్వాన్ని అంగీకరిస్తాయి. 1870 తరువాత పశ్చిమ దేశాల్లో ఏర్పడిన బూర్జువా ప్రభుత్వాలు నిరంకుశ అధికార యంత్రాంగం ద్వారా కాకుండా ఈ విధమైన సైద్ధాంతిక, సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా, ఒక రకంగా తమ పాలనను పీడిత వర్గాలు అంగీకరించేట్లు ఒప్పించడం ద్వారా పరిపాలన సాగిస్తూ వస్తున్నాయని గ్రాంసీ పేర్కొన్నాడు. పశ్చిమ దేశాల్లోనే కాకుండా మన దేశంతో సహా బూర్జువా పాలన స్థిరపడిన దేశాలన్నింటా ఇదే పరిస్థితిని మనం చూడగలం.

ఆధిపత్య వర్గాలు సమాజాన్ని రెండు రాజకీయ రూపాల్లో నియంత్రిస్తాయని గ్రాంసీ చెప్పాడు. మొదటిది, అణచివేత (డోమినేషన్). ఇందులో నేరుగా ప్రజలను పోలీసులు, సైన్యం ఇతర అధికార యంత్రాంగంతో భౌతికంగా అణచివేస్తుంది. రెండవది ఆధిపత్యం (హెజిమోనీ). ఇందులో సైద్ధాంతికంగా, మరీ ముఖ్యంగా ఒప్పించడం ద్వారా నియంత్రి స్తుంది. ఎంతటి నిరంకుశ ప్రభుత్వమైనా కేవలం రాజ్యాధికారం ద్వారా, పోలీసులు, సైన్యం ద్వారా పరిపాలించలేదు. దీర్ఘకాలంలో అది సుస్థిరంగా ఉండాలంటే ప్రజల సమ్మతినీ, మద్దతునూ పొందాలి. ఈ సమ్మతిని వారిపై సైద్ధాంతిక ఆధిపత్యం (హెజిమోనీ) ద్వారా పాలకవర్గాలు పొందుతాయని గ్రాంసీ వివరించాడు.

గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథ స్థితిని కొనసా గించడం. అంటే ప్రజల దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లోకీ ఈ విలువలను చొప్పించడం అనేది ఒక నిరంతర కార్యక్రమంగా కలిగి ఉండడం. వాస్తవానికి మార్క్సిస్టు మహో పాధ్యాయుడు కారల్ మార్క్స్ ఈ విషయాన్ని అంతకు క్రితమే మరో రూపంలో వివరించి ఉన్నాడు. జర్మన్ ఐడియాలజీలో ఆయన దీని గురించి ఈ విధంగా వివరించాడు:

"ప్రతి శకంలోనూ పాలక వర్గాల భావాలే పాలక భావాలుగా ఉంటాయి. అంటే సమాజంలోని పాలక భౌతిక శక్తి అయిన వర్గమే ఆ సమయంలో పాలక మేధో శక్తిగా కూడా ఉంటుంది. పాదార్థిక ఉత్పత్తి సాధనాలను కలిగి ఉన్న వర్గమే మేధో ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఏమవుతుందంటే మేధో ఉత్పత్తి సాధనాలు కలిగి లేని వర్గం పాలక వర్గ భావాల ఆధిపత్యం కింద ఉంటుంది. పాలక వర్గాల భావాలు అనేవి ఆధిపత్య భౌతిక సంబంధాలు మినహా మరేమీ కాదు. అంటే అవి భావాల రూపంలో స్వీకరించబడిన ఆధిపత్య భౌతిక సంబంధాలే."

ప్రజా సమూహం పాలక వర్గాల చైతన్యాన్ని పుణికి పుచ్చుకోవడం వల్ల అది సమాజమంతటి సాధారణ 'విజ్ఞత'గా మారిపోతుందని గ్రాంసీ వివరించాడు. ఆ విధంగా పాలకవర్గాల తత్వం, సంస్కృతి, నైతికవిలువలు అన్నీ కూడా సహజమైన సామాజిక లక్షణాలుగా మారిపోతాయి.

### ఆధిపత్యం(హెజిమోనీ)కీ, అణచివేత (డోమినెన్స్)కీ మధ్య తేడా

గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అనేది సమాజ ఉపరితలం ద్వారా నియంత్రించే ఒక రూపం. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం సమాజంలోని పునాది ఆర్థిక విషయాలకూ, ఉపరితలం ఆ పునాదిపై ఆధారపడి ఏర్పడే సంస్థలకూ, నమ్మకాల వ్యవస్థకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పిన దాని ప్రకారం సమాజ ఉపరితలాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది, న్యాయ,

> **“ ఉపరితలాన్ని ఆయన అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడు. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. ”**

రాజకీయ రూపాలు. ఇవి అప్పటి ఉత్పత్తి సంబంధాలను వ్యక్తం చేస్తాయి. రెండు చైతన్య రూపాలు. ఇవి ఆయా వర్గాల ప్రాపంచిక దృష్టిని వ్యక్తం చేస్తాయి. మూడు అనేక కార్యకలాపాల ద్వారా ప్రజలు మౌలిక ఆర్థిక వైరుధ్యం పట్ల చైతన్యం పొంది, సమాజ మార్పుకు సిద్ధపడతారు.

గ్రాంసీ సమాజ ఉపరితలానికి సంబంధించి ఈ మార్క్సిస్టు సూత్రీకరణలను మరింత ముందుకు తీసుకుపోయాడు. ఉపరితలాన్ని ఆయన అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడు. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. అయితే, ఆయన దృష్టిలో పాఠశాలలు కొంతవరకు రెండు కేటగిరీల్లోకీ వస్తాయి. ఉదాహరణకు పాఠశాల జీవితంలో కొంతభాగం అణచివేతతో కూడి ఉంటుంది. నిర్బంధ విద్య, జాతీయ పాఠ్యాంశాలు, జాతీయ స్టాండర్డ్స్, ఉత్తీర్ణతలు వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి. మిగిలినవి అంటే అనియత విద్య, సమాజిక అధ్యయనం వంటివి ఇందులోకి రావు.

గ్రాంసీ జైలు రచనల ప్రకారం పౌర సమాజం (సివిల్ సొసైటీ) ద్వారా పాలక వర్గాల వర్గాధిపత్యం ఒప్పించబడుతుంది. రాజకీయ సమాజం లేక రాజ్యం ద్వారా ప్రత్యక్ష అణచివేత, లేక నియంత్రణ జరుగుతుంది. అంటే ఈ రెండూ రెండురకాల నియంత్రణా రూపాలన్న మాట. ఒకటి ఒప్పించేది రెండవది అణచివేసేది. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రజలే పాలక వార్గాల అధిపత్యాన్ని అంగీకరించేట్టు ఒప్పించేది హెజిమోనీ (ఆధిపత్యం), అంగీకరించని ప్రజలను బలవంతంగా అణచివేసి ఉంచేది డోమినెన్స్. రెండూ ప్రజలను పాలక వర్గాల నియంత్రణలో ఉంచేవే. కాకపోతే ఒకటి పౌర సమాజంలో ఒప్పించడం ద్వారా నియంత్రణలో ఉంచుతుంది, రెండవది నిరంకుశ సాధనాల ద్వారా అణచివేసి నియంత్రణలో ఉంచుంతుంది. వీటి గురించి గ్రాంసీ ఇంకా విడమరిచి ఇలా చెప్పాడు:

1. “సామాజిక ఆధిపత్యం” (హెజిమోనీ) అంటే మొత్తం ప్రజానీకం పాలక వర్గాల ఆధిపత్యానికి ఆమోదం తెలపడం. పాలక వర్గాలకు ఈ ఆమోదం 'చారిత్రకంగా' అవి సంపాదించిన ప్రతిష్టద్వారా లభిస్తుంది. ఉత్పత్తిలో పాలకవర్గాలు సాధించిన స్థానం, అవి నిర్వహించే విధులద్వారా ఆ ప్రతిష్ట పొందు తాయి.

2. ''రాజకీయ ప్రభుత్వం'' అంటే పాలకవర్గాల ఆధిపత్యాన్ని అంగీకరించని గ్రూపులను అణచివేతద్వారా దారిలోకి తెచ్చుకునేందుకు రాజ్యం చేతుల్లో ఉన్న నిరంకుశాధికార పనిముట్లు. ఈ పనిముట్లు మొత్తం సమాజం మీద నిరంతరం వేలాడుతూ ఉంటాయి. ఎందుకంటే సంక్షోభాలు వచ్చినప్పుడు 'సమ్మతి' విఫలమైతే వీటిని ఉపయోగిస్తారు. అంటే కోర్టులు, చట్టాలు, సైన్యం, పోలీసు, అధికార యంత్రాంగం దీనికిందకు వస్తాయి.

గ్రాంసీ ఈ రెంటినీ విడదీసి చెప్పినప్పటికీ ఈ రెండూ అంటే 'సామాజిక ఆధిపత్యం' (హెజిమోనీ), 'రాజకీయ ప్రభుత్వం' (డోమినెన్స్) రెండూ ఒకే 'సమగ్ర రాజ్యం'లో భాగమే.

### పౌర సమాజం (సివిల్ సొసైటీ)

గ్రాంసీ ప్రతిపాదించిన విషయాల్లో పౌర సమాజం అనేది అతి ముఖ్యమైనది. మార్క్సిస్టులు పూర్తిగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. పౌర సమాజం ద్వారానే సమాజం మీద పాలక వర్గాలు తమ ఆధిపత్యాన్ని (హెనివోనీ) చెలాయిస్తాయని గ్రాంసీ సూత్రీకరించాడు. రాజ్యం అన్నది రాజకీయ సమాజం, పౌర సమాజాల కలయిక అని ఆయన చెప్పాడు.

పౌర సమాజంతో ప్రజలను ఒప్పించడం ద్వారా, రాజకీయ సమాజం లేక రాజ్యంతో ప్రజలను అణచివేయడం ద్వారా పాలక వర్గాలు పరిపాలన సాగిస్తాయి. ఈ రెంటిలో కూడా ప్రభుత్వ నిరంకుశ యంత్రాంగం కంటే పౌర సమాజం బలమైందని గ్రాంసీ పేర్కొన్నాడు. “రాజ్యం బీటలువారితే దాని వెనుక పౌర సమాజం అనే గట్టి నిర్మాణం బయటపడుతుంది. రాజ్యం అనేది కోట బయట కందకం మాత్రమే. దాని వెనుక అత్యంత బలమైన మట్టి కట్టలు, కోట గోడలు (పౌరసమాజం) ఉంటాయి'' అని గ్రాంసీ వివరించాడు.

రష్యాలో అక్టోబర్ విప్లవం జరిగినప్పుడు అక్కడ ఫ్యూడల్ సమాజం బలంగా ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతగా ఎదగలేదు. అందువల్ల అక్కడ పౌరసమాజం బలపడలేదు. అక్టోబర్ విప్లవం రాజ్యంపై తిరుగుబాటు చేసినప్పుడు అది ప్రధానంగా ఎదుర్కొన్నది రాజకీయ ప్రభుత్వాన్ని. అంటే నిరంకుశ రాజ్య వ్యవస్థనూ, బలహీనంగా ఇంకా చెప్పాలంటే 'జిగట జిగటగా' ఉన్న పౌరసమాజాన్నీ. కానీ బూర్జువా వర్గం బలపడిన పశ్చిమ దేశాల్లో పౌర సమాజం రాజ్యాన్ని కాపాడేందుకు పటిష్టమైన కోటగోడలా మారిందని గ్రాంసీ వివరించాడు.

''పౌర సమాజం'' అనేది చాలా సంక్లిష్టమైన నిర్మాణం. అది ఆర్థిక సంక్షోభాలు, మాంద్యాలు వంటి అనేక ఆర్థిక తుపానులను తట్టుకుని నిలబడగలదు. సమాజ ఉపరితలంలోని పౌర సమాజం ఆధునిక యుద్ధంలో సైనికులు దాక్కునేందుకు తవ్వుకునే కందకాల (ట్రెంచ్) వ్యవస్థ వంటిది. ఒక్కోసారి యుద్ధంలో భీకరమైన బాంబు దాడులతో శత్రువుల రక్షణ వ్యవస్థలు మొత్తాన్ని తుత్తునియలు చేయవచ్చు గాక కానీ అలా నాశనమయ్యేది బాహ్య వలయం మాత్రమే. కందకాల వ్యవస్థ మాత్రం చెక్కు చెదరదు.. అని గ్రాంసీ వివరించాడు.

పౌర సమాజం అనేది సామాజిక ప్రయోజనాలకూ, వ్యష్టి స్వప్రయోజనాలకూ మధ్యస్తం నడిపే ఏజెంట్ అని గ్రాంసీ చెప్పాడు. సరిగ్గా ఈ కారణం వల్లనే సమాజంలో

ఘర్షణకు కూడా పౌర సమాజం వేదికగా ఉంటుందని చెప్పాడు. పెట్టుబడిదారీ భావాల ఉత్పత్తీ, పునరుత్పత్తీ పౌరసమాజంలోనే జరుగుతాయి. సామాజిక వర్గాల మధ్య పోటీకీ ఇది మొదటి మెట్టు. సైద్ధాంతిక ఆధిపత్యానికి (హెజిమోనీకి) ఇది మొదటి దశ. ఆ విధంగా పౌర సమాజం అనేది రాజ్యం, ఆర్థిక వ్యవస్థల మధ్య, ప్రయివేటు, సామాజిక రంగాల మధ్య సంబంధాలను పునర్నిర్వచించే వేదిక అని గ్రాంసీ పేర్కొన్నాడు. ఇదంతా కూడా ఆధిపత్యం (హెజిమోనీ) రూపంలో వ్యక్తమయ్యే సైద్ధాంతిక పోటీగా సాగుతుంది.

> **"ఈ విషయంలో గ్రాంసీ మార్క్సిస్టు మౌలిక సూత్రం నుండి వైదొలగి వర్గ పోరాటాన్ని ఆర్థిక రంగంలో కాకుండా సమాజ ఉపరితలం లోని పౌరసమాజంలోకి తీసుకువచ్చాడని కొందరు వాదిస్తున్నారు. కానీ వాస్తవానికి మార్క్స్ ఏనాడూ వర్గ పోరాటంలో సమాజ ఉపరితలం ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అదే సమయంలో గ్రాంసీ రచనలు చదివినప్పుడు ఆయన సమాజిక పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను వదిలిపెట్టి ఉపరితలమే అంతా నిర్ణయిస్తుందని కూడా చెప్పలేదు."**

ఈ విషయంలో గ్రాంసీ మార్క్సిస్టు మౌలిక సూత్రం నుండి వైదొలగి వర్గ పోరాటాన్ని ఆర్థిక రంగంలో కాకుండా సమాజ ఉపరితలం లోని పౌరసమాజంలోకి తీసుకువచ్చాడని కొందరు వాదిస్తున్నారు. కానీ వాస్తవానికి మార్క్స్ ఏనాడూ వర్గ పోరాటంలో సమాజ ఉపరితలం ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అదే సమయంలో గ్రాంసీ రచనలు చదివినప్పుడు ఆయన సమాజిక పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను వదిలిపెట్టి ఉపరితలమే అంతా నిర్ణయిస్తుందనీ చెప్పలేదు. మరి గ్రాంసీని మార్క్సిజానికి అభిముఖంగా నిలబెట్టే ఈ చర్చ ఎందుకు వచ్చింది?


ఆంటోనియో గ్రాంసీ

### పునాది–ఉపరితలం చర్చ

మార్క్సిస్టు సూత్రీకరణ ప్రకారం ఏ సమాజ నిర్మాణంలోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి పునాది. రెండవది ఉపరి తలం. ఒకానొక సమాజంలోని ఉత్పత్తి శక్తులూ, ఉత్పత్తి జరిగేటప్పుడు వాటి మధ్య ఏర్పడే సంబంధాలు అంటే ఆర్థిక సంబంధాలు సమాజపు పునాదిగా ఉంటాయి. ఈ పునాదిపై ఆధారపడిన ఉపరితలంలో రాజకీయం, సామాజిక, సాంస్కృతిక అంశాలు, భావజాలం అంటే రాజ్యాంగ యంత్రం, మతం, సంప్రదాయాలు, సంస్కృతి, కళలు వగైరాలు ఉంటాయి. పునాదికీ, ఉపరితలానికీ మధ్య గతితార్కిక సంబంధం ఉంటుందనీ, వర్గపోరాటం పునాదిలో తెచ్చే మార్పులు అంతిమంగా ఆ సమాజ గమనానికి కారణమవుతాయని మార్క్స్–ఏంగెల్స్ చెప్పారు. కారల్ మార్క్స్ రాజకీయ ఆర్థికవ్యవస్థపై విమర్శ అన్న గ్రంథానికి ముందుమాట రాస్తూ... భౌతిక జీవనపు ఉత్పత్తి విధానం సామాజిక, రాజకీయ, మేధోపరమైన అంశాలను సాధారణంగా నియంత్రిస్తుంది. మానవుల చైతన్యం వారి భౌతిక స్థితిని నిర్ణయించదు, దానికి భిన్నంగా వారి సామాజిక జీవనమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అని చెప్పాడు. అంతే కాకుండా మనుషుల ఆలోచనలు వారి చైతన్యాన్ని బట్టి ఏర్పడవు, అందువల్ల ఆలోచనల్లో మార్పులు కూడా వారి చైతన్యాన్ని బట్టి జరగవు. వారి ఆలోచనల్లో మార్పులకు కారణం వారు జీవించే భౌతిక జీవనంలోని సంఘర్షణలే అంటే సామాజిక ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణే అని చెప్పాడు.

అయితే, దీన్ని కొందరు మార్క్సిస్టులు యాంత్రికంగా తీసుకుని సమాజ పురోగమనంలో పునాదే, అంటే ఆర్థిక సంబంధాలే ప్రధానం, ఉపరితలంలోని అంశాలన్నీ దానిపై ఆధారపడి నడుస్తాయని చెప్పడం ప్రారంభించారు. అంటే పునాదిలో మార్పులు జరిగితే ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలు వాటంతటవే మారుతాయని భావించారు. అంటే సామాజిక మార్పును వారు 'ఆర్థికవాదం' కిందకు కుదించేశారు. ఉదాహరణకు రెండవ ఇంటర్నేషనల్‌లో కాట్స్కీ, బెర్న్‌స్టీన్ వంటి వారు ఆర్థిక రంగంలో మార్పులు వాటంతటవే రాజకీయాల్లో మార్పులు తెస్తాయి వాటి కోసం వేచి చూడ్డమే మన పని అనే స్థితికి వెళ్లిపోయారు. ఇది ఒక రకంగా ఆర్థిక సంక్షోభం కోసం వేచి చూసేధోరణి.

గ్రాంసీ ఈ ఆర్థిక వాదాన్ని తీవ్రంగా విమర్శించాడు. నిజానికి మార్క్స్–ఏంగెల్స్ గానీ తరువాతి కాలంలో లెనిన్ గానీ ఇటువంటి ఆర్థికవాదాన్ని (ఎకనామిజం) లేక నియతివాదాన్ని (డిటర్మినిజం) ఖండించారు. వాస్తవానికి ఆర్థికవాదం అనే పదాన్ని మొట్టమొదట లెనిన్ ఉపయోగించాడు. సోషల్ డెమోక్రాటిక్ ఉద్యమంలో మార్క్సిజాన్ని అసభ్యకరమైన స్థాయికి దిగజార్చే ఒక వైఖరే ఆర్థికవాదం అని ఆయన చెప్పాడు. ఇది సామాజిక జీవనంలోని చైతన్యానికి సంబంధించిన అంశాన్ని దిగజార్చేస్తుందని చెప్పాడు. లెనిన్ తను రాసిన 'ఏం చేయాలి?' గ్రంథంలో ఆర్థికవాదానికి వ్యతిరేకంగా వాదించాడు. కార్మికవర్గానికి బయటినుండి సోషలిస్టు చైతన్యాన్ని అందించడం కమ్యూనిస్టుల కర్తవ్యమని చెబుతూ ఆ కర్తవ్యాన్ని చైతన్యపూర్వకంగా నిర్వహించకుండా ప్రత్యక్ష కార్యాచరణల వెంటబడి కొట్టుకుపోవడాన్ని ఆయన విమర్శించాడు. అయితే ఆర్థికవాదం ప్రత్యక్ష కార్యాచరణకు సంబంధించిన అంశమే కాకుండా దానికి సైద్ధాంతిక ప్రాముఖ్యత ఉందని గ్రాంసీ వివరించాడు. ఆర్థికవాదాన్ని

**"ఆధునిక కాలంలో పౌర సమాజం వర్గ పోరాటానికి వేదికగా మారిందని, ఇంకో మాటలో చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు కాపాడే సాధనంగా మారిందని గ్రాంసీ వాదిస్తాడు. పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని రక్షించేది పౌర సమాజం. పౌర సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించే సారవంతమైన నేల రాజకీయ పోరాటాలేనని గ్రాంసీ చెప్పాడు. అందువల్ల పౌర సమాజం అనే క్షేత్రంలో జరిపే ఈ పోరాటాల ద్వారానే తొలుత భావజాల రంగంలోనూ, తదుపరి రాజకీయ రంగంలోనూ ఆధి పత్యం (హెజి మోనీ) సాధించడం జరుగుతుందని తెలిపాడు."**

పుణికిపుచ్చుకున్న వారు సామాజిక పరివర్తన గురించి చెప్పేటప్పుడు కేవలం ఆర్థిక పునాది మీద కేంద్రీకరిస్తారు. సామాజిక మార్పుకు దోహదం చేసే ఇతర అంశాలు అంటే ఉపరితలంలో ఉండే సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలను విస్మరిస్తారు అని గ్రాంసీ పేర్కొన్నాడు. నిజానికి మార్క్స్ ఏంగెల్స్ కూడా ఉపరితలంలోని చైతన్యానికి సంబంధించిన అంశాల ప్రాధాన్యతను ఏనాడూ తక్కువ అంచనా వేయలేదు. మార్క్స్ మరణించిన తరువాత ఏంగెల్స్ 1890 సెప్టెంబర్‌లో జె. బ్లాక్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు:

...భౌతికవాద పద్ధతిలో చరిత్రను పరిశీలించినప్పుడు చరిత్రలో చివరి నిర్ణయాత్మక అంశం వాస్తవ జీవితపు ఉత్పత్తి, పునరుత్పత్తి అవుతుంది. దీనికి మించి మార్క్స్‌గానీ, నేను గానీ ఇంకేమీ చెప్పలేదు. అందువల్ల, ఎవరైనా దీన్ని వక్రీకరించి ఆర్థికాంశం ఒక్కటే నిర్ణయాత్మకమైనది అని అంటే వారు మేము చెప్పిన దాన్ని అర్థం లేని, రూపంలేని, బుద్ధిహీనమైన మాటకింద మార్చేస్తున్నట్లే. ఆర్థిక పరిస్థితే పునాది. కానీ, ఉపరితలంలోని అనేక అంశాలు అంటే వర్గపోరాటాల, వాటి ఫలితంగా ఏర్పడే రాజకీయ రూపాలు – ఉదాహరణకు, గెలుపొందిన వర్గం రూపొందించే రాజ్యాంగం వగైరా, న్యాయపరమైన రూపాలు, చివరికి ఈ ప్రత్యక్ష పోరాటాలు అందులో పాల్గొన్న వారి మెదళ్లలో ప్రేరేపించే ఉద్దీపనలు, రాజకీయ, న్యాయ, తాత్విక సిద్ధాంతాలు, మతభావనలూ అవి మూఢనమ్మకాలుగా మారిపోయిన తీరు... ఇవన్నీ కూడా చారిత్రక పోరాటాల మీద ప్రభావం చూపిస్తాయి. అనేక సందర్భాల్లో పోరాట రూపాలను నిర్ణయించడంలో ఇవే ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి..."

అందువల్ల మార్క్స్-ఏంగెల్స్‌గానీ, లెనిన్ గానీ సామాజిక ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అయితే పశ్చిమదేశాల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ తన వర్గాధిపత్యాన్ని మొత్తం సమాజం మీద చెలాయించడానికి ఈ ఉపరితలాంశాలను ఎలా ఉపయోగించు కుంటున్నదో లెనిన్ తరువాతి నాయకత్వం గ్రహించలేకపోయింది. కానీ దీని గురించి గ్రాంసీ ప్రతిభావంతంగా వివరించాడు. ఈ సమాజంలో కార్మికవర్గ విప్లవాలు సాధించాలన్నా, తదనంతరం కార్మికవర్గ రాజ్యం కొనసాగించాలన్నా కూడా ఉపరితలంలోని అంశాలపైన కేంద్రీకరించాలని పేర్కొన్నాడు. ఇందులో భాగంగా ఆయన 'ఆధిపత్యం' (హెజెమోనీ), పౌర సమాజం (సివిల్ సొసైటీ), రాజకీయ సమాజం (పొలిటికల్ సొసైటీ) వంటి భావనలను విస్తృతపరిచాడు.

ఆధునిక కాలంలో పౌర సమాజం వర్గ పోరాటానికి వేదికగా మారిందని, ఇంకో మాటలో చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు కాపాడే సాధనంగా మారిందని గ్రాంసీ వాదిస్తాడు. పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని రక్షించేది పౌర సమాజం. పౌర సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించే సారవంతమైన నేల రాజకీయ పోరాటాలేనని గ్రాంసీ చెప్పాడు. అందువల్ల పౌర సమాజం అనే క్షేత్రంలో జరిపే ఈ పోరాటాల ద్వారానే తొలుత భావజాల రంగంలోనూ, తదుపరి రాజకీయ రంగంలోనూ ఆధిపత్యం (హెజి మోనీ) సాధించడం జరుగుతుందని తెలిపాడు. ఒకసారి భావ జాల రంగంలో ఆధిపత్యం (హెజిమోనీ) కార్మికవర్గం చేతిలోకి వచ్చేసిందంటే అప్పుడిక పౌర సమాజపు అవసరం, అంటే ఆర్థిక వ్యవస్థకూ, రాజకీయ వ్యవస్థకూ మధ్య సంస్థాగతంగా జోక్యం చేసుకోవలసిన అవసరం ఉండదని గ్రాంసీ వివరించాడు. అంటే వ్యక్తుల ప్రయోజనాలకూ, సామాజిక ప్రయోజనాలకూ మధ్యవర్తిత్వం నడిపేది పౌర సమాజం. సోషలిస్టు సమాజంలో అటువంటి మధ్యవర్తిత్వం నడపాల్సిన అవసరం ఉండదు కనుక పౌర సమాజపు అవసరం ఉండదని వివరించాడు.

పెట్టుబడిదారీ రాజ్యాన్ని ఓడించాలంటే పౌర సమాజంలో ఆ వర్గం తరఫున పనిచేసే సంస్థలను గెలుచుకోవాలంటాడు గ్రాంసీ. విలువల్లోనూ, సంస్కృతిలోనూ కొత్త మార్పులు తీసుకురావాలి. ఈ పనిలో కార్మిక వర్గానికి చెందిన కొత్త మేధావులు కీలక పాత్ర నిర్వహిస్తారని చెప్పాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పౌర సమాజంలో రాజ్యానికీ, కార్మికులకూ మధ్య జరిగిన మధ్యస్థాల వల్ల పాలక పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యాన్ని కార్మికులు ఆమోదించే విధంగా రాజకీయాలు మలచబడ్డాయని గ్రాంసీ వివరించాడు. మత సంస్థలు, యూనియన్లు, పౌర సమాజంలోని ఇతర సంస్థలు రకరకాల లక్ష్యాలతో పనిచేసేవన్నీ కూడా పెట్టుబడిదారీ వర్గ సైద్ధాంతిక ఆధిపత్యానికి కార్మికుల నుండి సమ్మతిని పదేపదే ఉత్పత్తి చేశాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వర్గపు "మేధో పరమైన, నైతిక పరమైన ఆధిపత్యం" అనేది పౌర సమాజంలోని వివిధ సంస్థలు వ్యక్తీకరించే సమ్మతి ద్వారా వెల్లడవుతుందని గ్రాంసీ వివరించాడు. అందువల్ల మార్పు కోసం జరిగే వర్గ పోరాటం ఆర్థిక రంగంతో పాటు సైద్ధాంతిక ఆధిపత్యం కోసం, ఇంకో మాటలో చెప్పాలంటే చైతన్యాన్ని ప్రభావితం చేసే పోరాటంలో కేంద్రీకృతమవుతుందని చెప్పాడు. లెనినిస్టు సూత్రం ప్రకారం ఉత్పత్తికి సంబంధించిన భౌతిక పరిస్థితులు పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. అయితే ఈ ఆధిపత్యం (హెజిమోనీ) పౌర సమాజంలోని సంస్థల ద్వారా చెలాయించ బడుతుంది. అందువల్లనే పౌర సమాజం రాజ్యంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తుంది గానీ వాస్తవంగా రాజ్యంలో ఇది ఒక అంతర్భాగమేనని ఆయన వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాలలు, విశ్వ విద్యాలయాలు, మత సంస్థలు వగైరాలు.. పెట్టుబడిదారీ వర్గపు ఆధిపత్య విలువలను ఉత్పత్తి చేసి పెట్టుబడిదారీ రాజ్యాన్ని రక్షించడం కోసం "బలమైన కోటలు, కందకాల వ్యవస్థగా" రూపొందాయని గ్రాంసీ చెప్పాడు.

రెండు ప్రపంచ యుద్ధాల కాలంలో పార్లమెంటరీయిజం, దానికి సంబంధించిన పార్టీలు, యూనియన్ల వ్యవస్థలు విస్తృతమైనాక, విస్తారమైన రాజ్య, 'ప్రయివేటు' అధికార

**❝ రాజ్యం, పౌర సమాజాల మధ్యనున్న సంబంధం, ఈ రెంటికీ బూర్జువా వర్గపు అధిపత్య సిద్ధాంతంతో ఉన్న సంబంధం దాంతోపాటు ఒప్పించే యంత్రాంగం ద్వారా అంటే పాలితుల సమ్మతిని సాధించే పద్ధతి ద్వారా ఈ ఆధిపత్య సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేయడం అనేది గ్రాంసీ సూత్రీకరణల్లోని ప్రధాన మైన అంశం. పౌర సమాజంలోని ఏ సంస్థ కూడా, దాని లక్ష్యం ఏదైనా కానీయండి అది నిరంతరాయంగా పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేసే లక్షణం కలిగి ఉంటుంది. ❞**

యంత్రాంగం వేళ్లూనుకున్న తరువాత, ఆర్థిక, ఆర్థికేతర 'రాజకీయ' పార్టీలు, ఇతర సంస్థలు నాటి రాజకీయ వ్యవస్థల్లో భాగాలుగా మారాయి. ఆ విధంగా అవి మార్పుకు అడ్డంకిగా మారాయి అని గ్రాంసీ వివరించాడు.

రాజ్యం, పౌర సమాజాల మధ్యనున్న సంబంధం, ఈ రెంటికీ బూర్జువా వర్గపు అధిపత్య సిద్ధాంతంతో ఉన్న సంబంధం దాంతోపాటు ఒప్పించే యంత్రాంగం ద్వారా అంటే పాలితుల సమ్మతిని సాధించే పద్ధతి ద్వారా ఈ ఆధిపత్య సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేయడం అనేది గ్రాంసీ సూత్రీకరణల్లోని ప్రధానమైన అంశం. పౌర సమాజంలోని ఏ సంస్థ కూడా, దాని లక్ష్యం ఏదైనా కానీయండి అది నిరంతరాయంగా పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేసే లక్షణం కలిగి ఉంటుంది.

గ్రాంసీ సూత్రీకరణ ప్రకారం పౌర సమాజమూ, దాని సంస్థలూ పెట్టుబడిదారీ వర్గంతోనూ, దాని సైద్ధాంతిక ఆధిపత్యం కిందనూ ఉన్నంత కాలం విప్లవోద్యమాన్ని అడ్డుకుంటూనే ఉంటాయి. పెట్టుబడిదారా వ్యవస్థ తనలోని అంతర్గత వైరుధ్యాల వల్ల కుప్పకూలిపోవడం కోసం వేచి ఉండడం విప్లవ చర్య కాజాలదు. అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల పెట్టుబడారీ వ్యవస్థలు అంతర్గత వైరుధ్యాలతో కుప్పకూలిపోతే వాటిపై నియంత్రణ సాధించడం సాధ్యం కాదు. రష్యాలో "రాజ్యమే అన్నీ అయింది. పౌర సమాజం శైశవ దశలో, పలుచటి బంకలా ఉంది. పశ్చిమ దేశాల్లో రాజ్యానికీ, పౌర సమాజానికీ మధ్య సరైన సంబంధాలున్నాయి. అక్కడ రాజ్యం కుప్పకూలిపోతే వెనువెంటనే పటిష్టమైన పౌర సమాజం అనే బలమైన నిర్మాణం బయట పడుతుంది" అని గ్రాంసీ వివరించాడు. అందువల్లనే "అక్కడ ప్రజా సమూహాలను ఎడ్యుకేట్ చేసి, వారి సమిష్టి చైతన్యాన్ని సమీకరించాలి. వారిలోకి కొత్త విలువలను ఎక్కించి రాన్ను విప్లవం కోసం సిద్ధం చేయాలి. ఇటువంటి చర్య ద్వారా మాత్రమే వారిని కార్యాచరణలోకి దించగలం" అని ఆయన చెప్పాడు.

ఈ వివరణ ద్వారా గ్రాంసీ ఒక విషయం స్పష్టం చేశాడు: ప్రత్యామ్నాయ పౌర సమాజాన్ని సృష్టించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజ్యాన్ని సృష్టించాలన్నాడు. కార్మికవర్గ విలువలు, లక్ష్యాలను పుణికిపుచ్చుకున్న విప్లవ యంత్రాంగం ద్వారా ఈ పనిచేయాలని ఆయన చెప్పాడు. ఈ విప్లవ యంత్రాంగం కార్మిక వర్గ విలువలనూ, సైద్ధాంతిక ఆధిపత్యాన్నీ మళ్లీమళ్లీ ఉత్పత్తి చేయగలగాలని చెప్పాడు. దీనికోసం కార్మికవర్గాన్ని అంతర్గతంగా ఎడ్యుకేట్ చేయడం, పెట్టుబడిదారీ పౌర సమాజానికి ప్రత్నామ్నాయ సంఘాలను సృష్టించడం జరగాలన్నాడు. మానవాళి దశల వారీగా తన స్వంత విలువలతో కూడిన చైతన్యాన్ని సంతరించుకుంటుంది. ఈ చైతన్యం మొదట కొద్ది మంది వ్యక్తుల్లో ఏర్పడుతుంది. తదుపరి మొత్తం వర్గం దాన్ని పుణికిపుచ్చుకుంటుంది. దాంతో అప్పటివరకు అణచివేయబడి ఉన్న వర్గం తిరుగుబాటుకు, సామాజిక పునర్నిర్మాణానికి పూనుకుంటుందని చెప్పాడు.

ఆ విధంగా గ్రాంసీ పశ్చిమ యూరప్‌లోని పెట్టుబడిదారీ దేశాల్లో అధికార వ్యవస్థలు ఎలా ఉంటాయో చెప్పడమే కాదు, ఆ దేశాల్లో కమ్యూనిస్టు విప్లవాలు జయప్రదం కావాలంటే ఏం చేయాలో కూడా చెప్పాడు. పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని నెలకొల్పాలంటే ఆర్థిక సంక్షోభాలు వస్తేనే సరిపోదని ఆయన వాదించాడు. ఆర్థిక సంక్షోభాలు మాత్రమే పీడిత వర్గాలను పోరాటాలవైపు నెట్టవు, వారిలో బలమైన పోరాటేచ్ఛను పెంపొందించవు. లేక అవి మాత్రమే బూర్జువా వర్గపు ధైర్యాన్ని సడలించలేవు, చివరికి శిధిలాల్లో ఉన్నా కూడా పెట్టుబడిదారీ వర్గాన్ని యుద్ధ రంగం నుండి తరిమివేయలేవని గ్రాంసీ స్పష్టం చేశాడు. సాయుధ దాడుల ద్వారా మాత్రమే కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని కూలదోయలేదని వాదించాడు. "కేవలం సైనిక నమూనాను నమ్ముకుని కూర్చోవడం వెర్రితనం. ఇక్కడ కూడా సైనిక చర్యల మీద రాజకీయాలే ప్రాధాన్యత వహిస్తాయి. రాజకీయాలు మాత్రమే వ్యూహాత్మకంగా వ్యవహరించడానికీ, ముందుకు కదలడానికీ అవకాశాలు కల్పిస్తాయి" అని చెప్పాడు. గ్రాంసీ దృష్టిలో రాజకీయ పోరాటాలు అంటే వర్గాధిపత్యం కోసం జరిగే పోరాటమే. రాజ్యాధికారాన్ని చేపట్టి రాజ్యాన్ని ఎడ్యుకేటర్‌గా మార్చేందుకు జరిగే వర్గ పోరాటమే 'ఆధిపత్యం' (హెజిమోనీ) కోసం జరిగే పోరాటం అని ఆయన చెప్పాడు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత తలెత్తిన అత్యంత తీవ్రమైన సంక్షోభ పరిస్థితుల్లో కూడా పశ్చిమ ఐరోపా దేశాల్లో కార్మిక వర్గం మొత్తంగా విప్లవ చైతన్యం పెంపొందించడంలో ఎందుకు విఫలమయ్యింది? పాలనా వ్యవస్థను కూల్చ డానికి బదులుగా దానికి అనుగుణంగా ఆలోచించే సంస్కరణ వాదంలో ఎందుకు పడిపోయింది? ఈ ప్రశ్నలకు లెనిన్ 'ఏం చేయాలి' గ్రంథంలో కొంతవరకు వివరణ ఇచ్చాడు. బూర్జువా సిద్ధాంత బలం ఎంతగా ఉంటుందంటే కార్మిక వర్గాన్ని గనుక దాని మట్టుకు దాన్ని వదిలేస్తే దానికి అబ్బేది ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలోనే తమ జీవన పరిస్థితులను మెరుగుపరుచుకోవాలన్న కాంక్ష మాత్రమే అని లెనిన్ పేర్కొన్నాడు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో గ్రాంసీ విశ్లేషణ మార్క్సిజానికి మరింతగా తోడ్పడుతుంది. పాలకవర్గాలు ఎలా పాలిస్తున్నాయో, పాలించాలో వివరించడానికి ఇతరుల కన్నా గ్రాంసీ విశ్లేషణ బాగా ఉపయోగపడుతుంది. 'ఆధునిక యువరాజు', 'అమెరికనిజం-ఫోర్డిజం' అన్న వ్యాసాల్లో ఆయన ఈ అంశాలపై మరింత విశ్లేషణ చేశాడు.

**ప్రతి-ఆధిపత్యం (కౌంటర్-హెజిమోనీ)**

గ్రాంసీ చెప్పిందే నిజమైతే అంటే పాలక వర్గాలు ప్రజల సమ్మతితోనే తమ వర్గాధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే, కేవలం చివరి అస్త్రంగా మాత్రమే వారు ప్రత్యక్ష అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగిస్తుంటే అప్పుడు పాలక వర్గాలను అధికారం నుండి

"అయితే, ప్రజల్లో స్థిరపడిపోయిన చైతన్యాన్ని అదిగమించడం అంత తేలికైన పని కాదు. ఎందుకంటే పాలక వర్గాల సైద్ధాంతిక ఆధిపత్యం వల్ల సమాజంలో జరుగుతున్న దాన్ని 'విజ్ఞతగా' మెజారిటీ ప్రజలు అంగీక రిస్తారు. 'సమాజాన్ని నడపడానికి అదొక్కటే మార్గం' అనుకుం టారు. జరుగుతున్న పరిణామాల పట్ల ఫిర్యాదు లు, అసంతృప్తులు ఉండవచ్చు. ప్రజలు మరింతమెరుగైన పాలన, సంస్కరణలు కావాలని కోరుకోవచ్చు. కానీ, సమాజంలోని మౌలిక మైన నమ్మకాలు, విలువలు తటస్థంగా ఉన్నాయనీ, లేక వర్గ సమాజం అంతటికీ అవి సాధారణంగా వర్తిస్తాయనీ వారు భావిస్తారు."

తొలగించాలనుకుంటున్న విప్లవ వర్గాలు ఏం చేయాలి? పాలకులకూ, పాలితులకూ మధ్య ఏర్పడిన సైద్ధాంతిక బంధం ద్వారా పాలక పెట్టుబడిదారీ వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే విప్లవ వర్గాల వ్యూహం ఎలా ఉండాలి? దానికి గ్రాంసీ ఇలా సమాధానం చెప్పాడు: పాలక వర్గాల సైద్ధాంతిక 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని ఛేదించాలనుకునే వారు పాలకవర్గాలకు వ్యతిరేకంగా ''ప్రతి-ఆధిపత్యం'' (కౌంటర్-హెజిమోనీ) నిర్మించాలి. అంటే వారు సమాజ నిర్మాణంలో మార్పునూ, సైద్ధాంతిక మార్పునూ ఒకే పోరాటంలో భాగంగా చూడాలి. వర్గ పోరాటంలో పెట్టుబడికీ, కార్మికవర్గానికీ ఘర్షణ కేంద్రంగా ఉంటుంది. కానీ, పీడించబడుతున్న వర్గాలు తమను పరిపాలించేందుకు తమ రాజకీయ, ఆర్థిక యజమానులకు ఉన్న హక్కును ప్రశ్నించాలంటే, అలా ప్రశ్నించే చైతన్యం వారికి కలగాలి. అటువంటి చైతన్యం వారిలో సైద్ధాంతిక పోరాటం ద్వారా మాత్రమే వస్తుంది. దానికోసం పౌర సమాజంలో విజ్ఞత (కామన్ సెన్స్) రూపంలో స్థిరపడిపోయిన ప్రజా చైతన్యాన్ని సవాలు చేయాలి.

అయితే, ప్రజల్లో స్థిరపడిపోయిన చైతన్యాన్ని అదిగమించడం అంత తేలికైన పని కాదు. ఎందుకంటే పాలక వర్గాల సైద్ధాంతిక ఆధిపత్యం వల్ల సమాజంలో జరుగుతున్న దాన్ని 'విజ్ఞతగా' మెజారిటీ ప్రజలు అంగీకరిస్తారు. 'సమాజాన్ని నడపడానికి అదొక్కటే మార్గం' అనుకుంటారు. జరుగుతున్న పరిణామాల పట్ల ఫిర్యాదులు, అసంతృప్తులు ఉండవచ్చు. ప్రజలు మరింతమెరుగైన పాలన, సంస్కరణలు కావాలని కోరుకోవచ్చు. కానీ, సమాజంలోని మౌలికమైన నమ్మకాలు, విలువలు తటస్థంగా ఉన్నాయనీ, లేక వర్గ సమాజం అంతటికీ అవి సాధారణంగా వర్తిస్తాయనీ వారు భావిస్తారు. వాళ్ళు రొట్టెల ఫ్యాక్టరీ నాది అనుకోరు. ఒకటో రెండో రొట్టె ముక్కలు అదనంగా లభిస్తే చాలు అనుకుంటారు. ఇలా సామాజిక విజ్ఞత (కామన్‌సెన్స్) రూపంలో చెలామణీ అయ్యే ఈ 'ఆధిపత్య' భావజాలాన్ని 'ప్రతి-ఆధిపత్య' భావజాలంతో సవాలు చేయాలి. 'ప్రతి-ఆధిపత్యం' అనేది నిజమైన 'ఆధిపత్యం' కాదు. కార్మికవర్గం లేక విప్లవ వర్గాలు తమ 'ఆధిపత్యాన్ని' (హెజిమోనీని) నెలకొల్పడానికి ఆర్థికంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా సిద్ధం కావడమే "ప్రతి-ఆధిపత్యం".

### ప్రతి-ఆధిపత్య నిర్మాణంలో మేధావుల పాత్ర

''ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించడంలో మేధావుల పాత్రకు గ్రాంసీ అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. కార్మికవర్గ విప్లవ పోరాటానికీ, పురోగామి మేధావులకూ ఉండాల్సిన సంబంధాలను గురించి ఆయన విపులంగా చర్చించాడు. పురోగామి మేధావులను ఆయన రెండుగా విభజించాడు. మొదటి రకం, ఇతర వర్గాల నుండి వచ్చే ప్రజాతంత్ర మేధావులు. రెండు, కార్మికవర్గ పోరాటం నుండి పుట్టుకు వచ్చిన మేధావులు. ఈ రెండు రకాలూ కలిసి విప్లవ కార్మికవర్గ ఉద్యమం అవుతారు. బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించే చారిత్రక కర్తవ్యాన్ని కార్మికవర్గం నెరవేర్చాలంటే వారు మూడు రంగాల్లో అంటే ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో సమగ్ర పోరాటాం చేయాలి. ఈ మూడు రంగాల్లో సమగ్రంగా జరిగే పోరాటమే వర్గ పోరాటం. ఏదో ఒక రంగంలో మాత్రమే చేసే పోరాటం పాక్షిక పోరాటం అవుతుంది గానీ సమగ్ర పోరాటం కాదు. ఇలా సమగ్ర పోరాటం చేయకుండా కార్మికవర్గం విప్లవం ద్వారా బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించడం సాధ్యం కాదని ఏంగెల్స్ చెప్పిన మాటలను లెనిన్ ప్రస్తావించాడు.

మేధావులు ఒక ప్రత్యేక వర్గం కాదని గ్రాంసీ చాలా స్పష్టంగా చెప్పాడు. వాళ్ళు అటు పాలక వర్గంలో గానీ కార్మికవర్గ నాయకత్వంలోని శ్రామిక వర్గంలో గానీ అంతర్భాగంగా ఉంటారు. ఈ రెండు వర్గాల్లో అంటే అటు పాలక వర్గంలో ఇటు పాలిత వర్గంలో ఉండే మేధావుల మధ్య ఐక్యత-పోరాటం నిరంతరం సాగుతుంటుంది. ఈ ఐక్యతా-పోరాటమే ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే పోరాటంలో మేధావుల పాత్రను నిర్ణయిస్తుంది. కార్మికవర్గం 'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించే పనిని కార్మికవర్గ "సజీవ మేధావుల" ద్వారా సాగించాలని గ్రాంసీ చెప్పాడు. సజీవ మేధావులు ఎవరంటే ఆధిపత్య వర్గాల తరపున కింది వర్గాలపై సామాజిక ఆధిపత్యం, రాజకీయ పరిపాలన నిర్వహించే వారు. పాలకవర్గాల తరఫున ఇతరులను సమీకరించడం, పరిపాలనసాగించడం, మార్గదర్శకత్వం వహించడం, ఎడ్యుకేట్ చేయడం, నాయకత్వం వహించడం వీరి పని.

'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించే కార్మికవర్గం కూడా ఆ పని కోసం తన స్వంత 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలని గ్రాంసీ చెప్పాడు. ఇక్కడ మేధావులు అంటే గ్రాంసీ ఉద్దేశంలో నాలుగు గోడల మధ్య పుస్తకాలతో కుస్తీపట్లు పడుతుండే అకాడమిక్ మేధావులు కాదు. "ప్రజలందరూ మేధావులే" అని ఆయన రాశాడు. "అయితే సమాజంలో అందరూ మేధావుల పని చేయరు". అంటే ప్రతి ఒక్కరికీ మేధస్సు ఉంటుంది, దాన్ని ఉపయోగిస్తారు గాని అందరూ సామాజిక పని విభజనలో మేధావుల పని చేయరు. ఉదాహరణకు, ఒక వ్యక్తి వంకాయ కూర వండుతాడు, ఇంకొకడు చొక్కాకు బత్తాయిలు కుడతాడు. అంతమాత్రాన వాళ్లను వంట వాడనీ, దర్జీ అనీ అనలేం. ఈ పనులను ప్రత్యేకంగా చేసేవారినే అలా పేర్కొంటాం. మేధావుల విషయం కూడా అంతే అని గ్రాంసీ వివరించాడు. అభివృద్ధి చెందే ప్రతి సామాజిక వర్గం తనతో పాటుగా తన మేధోపరమైన పనులు నిర్వహించే మేధావులను కూడా తయారు చేసుకుంటుంది. వాళ్లు మేనేజర్లుగానో, సివిల్ సర్వెంట్లుగానో, పురోహితులుగానో, ఉపాధ్యాయులుగానో, టెక్నీషియన్లు, లాయర్లు, సైంటిస్టులు, డాక్టర్లు వగైరాలుగా పనిచేస్తారు. వాళ్ళు పాలక వర్గంతో పాటు కలిసి అభివృద్ధి చెంది పాలక వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తారు.

అందువల్ల మేధావులు సమాజంలో వర్గాలకు అతీతంగా తటస్థంగా ఉంటారనడం మిథ్య అని గ్రాంసీ స్పష్టం చేశాడు.


పౌర సమాజం ద్వారా పాలక వర్గాల ఆధిపత్యాన్ని పాలితుల చేత ఒప్పించే పని నిర్వహించేది ప్రధానంగా మేధావులు. గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజలచేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. వాళ్లు స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తారు. సమాజంలో ఎన్ని మార్పులు జరుగుతున్నా ఈ రకం మేధావులు మాత్రం చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్నట్లు కనిపిస్తారు. పూజారులు, రాయసగాళ్లు, తత్వవేత్తలు, ప్రొఫెసర్లు ఇలాంటి కోవకు వస్తారు. వీళ్లు పాలక వర్గాల నుండి తాము స్వతంత్రంగా ఉన్నామని అనుకుంటున్నా అదంతా మిథ్య మాత్రమే. ప్రధానంగా వాళ్లు పాలక వర్గంతో ఉండి వారికి సహకరించే పాతకాలపు లేక మితవాద మేధావులు మాత్రమే.

సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోబాటుగానే పుట్టి పెరుగుతారు. వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలుగా ఉంటూ ప్రజలను సమీకరించే పని చేస్తుంటారు. ఇటువంటి మేధావులు గురించి ఆలోచించడం ముఖ్యం అని గ్రాంసీ చెప్పాడు. సమాజంలో పాలకవర్గాల వ్యవహారాలు చక్కబెట్టడానికి విద్యావిధానం ద్వారా ఈ మేధావులు ఉత్పత్తి చేయబడతారు. వీరి ద్వారానే పాలక వర్గాలు మొత్తం సమాజం మీద తమ 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని చెలాయిస్తాయి.

పాలకవర్గాలను అధికారం నుండి తొలగించాలనుకునే వారు 'ప్రతి–ఆధిపత్యం' నిర్మించాలి. అంటే చెలామణిలో ఉన్న ఏకాభిప్రాయాన్ని సవాలు చేయాలి, 'విజ్ఞత' పేరుతో సాగుతున్న భావజాలాన్ని ఎదుర్కోవాలి. ఎలా?

దీనికి గ్రాంసీ చెప్పిందేమంటే... కార్మికవర్గం సంప్రదాయ మేధావుల్లో గణనీయమైన భాగాన్ని తనవైపు తిప్పుకోవడమే కాకుండా కార్మికవర్గ ఉద్యమం తనదైన 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలి. "మానవ జీవితంలోని అన్ని రంగాల్లోనూ మేధావులకు పని ఉంటుంది" అంతేకాదు, ప్రతి మనిషీ తను చేస్తున్న వృత్తికి బయట ఏదో ఒక రకం

" పౌర సమాజం ద్వారా పాలక వర్గాల ఆధిపత్యాన్ని పాలితుల చేత ఒప్పించే పని నిర్వహించేది ప్రధానంగా మేధావులు. గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజలచేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. వాళ్లు స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తారు. సమాజంలో ఎన్ని మార్పులు జరుగుతున్నా ఈ రకం మేధావులు మాత్రం చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్నట్లు కనిపిస్తారు. "




మేధో కృషి జరుపుతూనే ఉంటాడు, ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉంటాడు, ఏదో ఒక నైతిక విలువకు కట్టుబడి ఉంటాడు. అందువల్ల అతను తన వంతుగా ప్రాపంచిక దృక్పథానికి తోడ్పడ్డమే కాదు దాన్ని తన దృక్పథానికి అనుగుణంగా మార్చడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా కొత్త ఆలోచనా విధానాలను ఉనికిలోకి తెస్తుంటాడు. అంటే, ప్రజలకు ఆలోచించే సామర్థ్యాలు ఉంటాయి. అయితే, సమస్యంతా ఆ సామర్థ్యాలను ఎలా బయటకు తీయాలి అన్నదే.

కార్మికవర్గంలో ఇటువంటి సామర్థ్యాలను బయటకు తీసి తనదైన 'సజీవ మేధావులను' తయారుచేసుకోవాలనీ, సంప్రదాయ మేధావుల్లో నుండి సాధ్యమైనంత ఎక్కువమందిని విప్లవ పోరాటంలోకి లాక్కోవాలనీ గ్రాంసీ బోధించాడు. తను నిర్వహించిన 'కొత్త శకం' పత్రిక ద్వారా అటువంటి మేధావులను అకర్షించడానికి ప్రయత్నించాడు. ఈ పత్రికకు 'వారం వారం సోషలిస్టు సంస్కృతి పై సమీక్ష' అనే ఉపశీర్షిక పెట్టాడు. 1919లో టురిన్ నగరంలో పెద్ద ఎత్తున పారిశ్రామిక సమ్మెలు, మిలిటెంట్ రాజకీయ కార్యకలాపాలు సాగుతున్న సమయంలో ఆయన ఈ పత్రిక నడిపాడు.

గ్రాంసీ సైద్ధాంతిక పోరాటం గురించి చెప్పిన విషయాలు కేవలం చైతన్యాన్ని పెంపొందించడానికి మాత్రమే పరిమితం కాలేదు. చైతన్యాన్ని మార్చాలని, సోషలిస్టు చైతన్యాన్ని సృష్టించాలని చెప్పాడు. కార్మికవర్గ దైనందిన జీవితానుభవాల ద్వారా అటువంటి చైతన్యం పొందేందుకు తోడ్పడాలని చెప్పాడు. అందువల్ల మేధావుల కృషి ఎక్కడో నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల దైనందిన జీవితంలో భాగంగా సాగాలని చెప్పాడు. "కొత్త మేధావులను ఎంతబాగా విషయాలు చెప్పగలుగుతున్నారన్న దాన్నిబట్టి కాకుండా దైనందిన జీవితంలో నిర్మాతలుగా, ఆర్గనైజర్స్‌గా వారి పనిని బట్టి నిర్ణయించాలి. నిరంతరం వెంటబడి పనులు జరిగేట్లు చూసేవారే గానీ కేవలం ఉపన్యాసాలు చెప్పేవారు సజీవ మేధాలు కాదు" అని ఆయన వివరించాడు.

దైనందిన జీవితంలో చురుకుగా పాల్గొనే కార్మికవర్గ మేధావులను తయారు చేసుకోవడం ద్వారా ప్రస్తుత సామాజిక సంబంధాలను బద్దలుగొట్టే "ప్రతి–ఆధిపత్యం" ఏర్పాటుకు తోడ్పడాలి అని చెప్పాడు. ఆ విధంగా ఆయన సిద్ధాంతాన్ని ఆచరణకు ముడిపెట్టాడు. కార్మికవర్గం నుండి ఇతర పీడిత వర్గాల నుండి మేధావులను తయారు చేయడంలో అనియత విద్య ఎంతగానో తొడ్పడుతుందని గ్రాంసీ చెప్పాడు. అందువల్లనే గ్రాంసీ జైలు రచనల్లో

❝ నేడు మతం, కులం, ఇతర మూఢ భావాల పేరుతో ఎన్ని దురాగతాలకైనా పాలకులు పాల్పడగలుగు తున్నారు. ఈ ఆధిపత్య భావజాలం ప్రజలను పాలకులనుండి వస్తున్న నిజమైన కష్టాల నుండి దృష్టి మళ్లించగలుతున్నది. ఇది మన దేశంలోనే కాదు అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలతో సహా ప్రపంచ వ్యాపి తంగా జరుగుతున్న పరిణామం. అమెరికాలో పెంచిపోషించ బడుతున్న తెల్లజాతి దురహంకారం, యూరప్‌లో వలసదారులకు వ్యతిరేకంగా తలెత్తుతున్న సంకుచిత భావజాలం. ❞

ఎక్కువ భాగం విద్యా విధానం ఎలా ఉండాలి అన్నదానికి కేటాయించాడు.

**వర్తమాన సమాజం-గ్రాంసీ బోధనల ప్రాముఖ్యత**

గ్రాంసీ తక్కువ కాలమే - 46 సంవత్సరాలు జీవించాడు. (పుట్టుక:1891 జనవరి 22, మరణం: 1937 ఏప్రిల్ 27) అందులోనూ చివరి 11 ఏళ్లు (1926 నుండి 1937 వరకు) తీవ్రమైన అనారోగ్యంతో ఫాసిస్టు ముస్సోలినీ జైల్లో మగ్గాడు. అయినప్పటికీ ఆయన బయట జరుగుతున్న పరిణామాలను తెలుసుకుంటూనే ఉన్నాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పశ్చిమ ఐరోపాలోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలు కార్మికవర్గంపై ఎలా తమ ఆధిపత్యాన్ని (హెజిమోనీ) నెలకొల్పుతున్నాయో గమనించడమే కాదు ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న వ్యవస్థాగత మార్పుల గురించి కూడా "అమెరికనిజం, ఫోర్డిజం". "కొత్త యువరాజు" అనే రచనల్లో హెచ్చరికలు చేశాడు. అమెరికాలో జరుగుతున్న మార్పులు పెట్టుబడిదారీ వ్యవస్థకు "కొత్త ముఖాన్ని" సమకూరుస్తున్నాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో అమెరికన్ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తెచ్చిన మార్పులు, అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రారంభించి తదుపరి అధ్యక్షులు కొనసాగించిన 'న్యూ డీల్' చర్యలు అమెరికాలోనే కాకుండా మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలోని కార్మికవర్గంలో భ్రమలు సృష్టించింది. ఈ చర్యలన్నీ అప్పటికే రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో ఏర్పడిన కమ్యూనిస్టు రాజ్యం నుండి పశ్చిమ దేశాల కార్మిక వర్గ దృష్టిని మళ్లించేందుకు, సోషలిజానికి ప్రత్యామ్నాయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త రూపు సంతరించుకుంటోందని చెప్పడానికీ ఉపయోగపడ్డాయి.

సిపిఐ(ఎం) అగ్రనాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఈ విషయంలో గ్రాంసీ ముందు చూపు గురించి ఈ విధంగా చెప్పారు: "అక్టోబర్ విప్లవం తరువాత 80 ఏళ్లు గడిచినా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఒక్క దాన్లో కూడా విప్లవం రాకపోగా సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలే సోషలిజం నుండి వెనక్కు మళ్లి ఆర్థికంగా పెట్టుబడిదారీ వ్యవస్థనూ, రాజకీయంగా బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కౌగలించుకున్నాయంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి క్రమంలో వచ్చిన మార్పుల ప్రాముఖ్యత అర్థమవుతుంది. సోషలిజాన్ని తుపాకులతో ఓడించలేదు.... లెనిన్ ఊహించినట్లు ఆర్థిక ఉత్పత్తి విధానంలో జరిగిన చారిత్రక పోరాటంలో అది ఓడించబడింది. అమెరికాకు చెందిన అణ్వస్త్రాలు కాదు సోవియట్‌ను దెబ్బతీసింది. కొత్త శాస్త్ర-సాంకేతిక విప్లవం తాత్కాలికంగా నైనా, సోషలిజం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ మెరుగైనది అన్న భావన కలిగించింది. ....విశేషమేమంటే, ఆంటోనియో గ్రాంసీ తన జైలు రచనలు (ప్రిజన్ నోట్ బుక్స్)లో 'అమెరికనిజం, ఫోర్డిజం' అన్న రచనలో ఈ విషయాలను ముందుగానే గ్రహించగలిగాడు."

వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త శకంలోకి - ద్రవ్య పెట్టుబడి చోదిత ప్రపంచీకరణ యుగంలోకి ప్రవేశించింది. అది పెంచి పోషిస్తున్న వినిమయదారీ విధానం ప్రపంచ వ్యాపితంగా కొత్త విలువలను సృష్టిస్తోంది. ప్రజల్లో గతంలో ఉన్న భావాలకు అర్థాలను మార్చేస్తోంది. వ్యష్టి నుండి సమిష్టికి మారడం, సంపదను అందరికీ పంచడం వంటివి ఒక నాడు ఆర్థిక సంస్కరణలు అంటే ప్రజల్లో ఉండే భావన, గ్రాంసీ పరిభాషలో చెప్పాలంటే ప్రజల్లో పాలకవర్గాలు కల్పించిన సాధారణ 'విజ్ఞత' (కామన్ సెన్స్). కానీ నేడు సంస్కరణలంటే ప్రజల సంపదను ప్రయివేటు పరం చేయడం, లేనివానిపై భారాలు మోపి, ఉన్న వాని బొక్కసాలు నింపడం. సంపద సృష్టికి కార్మికుని శ్రమ మూలం అనే భావన స్థానంలో పెట్టుబడులే సంపదను సృష్టిస్తాయన్న భావన బలపడింది. అప్పులు చేస్తే తిప్పలొస్తానే భావం పోయి అప్పు మనిషి గొప్పకు చిహ్నంగా మారిపోయింది. కాయకష్టం చేసేవారు రోజురోజుకీ మరింత పేదరికంలోకి పోతున్నా, కుభేరులు మరింత కుభేరులవుతున్నా వ్యవస్థను ప్రశ్నిండం పిచ్చితనంగా మారిపోతున్నది. ద్రవ్య పెట్టుబడి దోపిడీని ప్రశ్నించడం తెలివి తక్కువ తనం కిందా, ఎన్ని రయితీలైనా ఇచ్చి దాన్ని ఆకర్షించేవాడు తెలివైన వాడుగానూ చెలామణీ అవుతోంది. దీనికి తోడు విద్యారంగంలోనూ ఇంకా అనేక జీవన రంగాల్లోనూ సృష్టించబడుతున్న కొత్త భావజాలం అంతా కూడా పాలితులపై పాలక వర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోడానికి తోడ్పడుతున్నాయి.

దీనికి తోడు మితవాద భావజాలం, మన దేశంలో మతతత్వ మితవాద భావజాలం కొత్త తిరోగమన విలువలను సృష్టిస్తున్నాయి. ప్రజల ఆలోచనలపై మతతత్వ ఆధిపత్యం సాధించగలిగింది గనుకనే నేడు మతం, కులం, ఇతర మూఢ భావాల పేరుతో ఎన్ని దురాగతాలకైనా పాలకులు పాల్పడగలుగు తున్నారు. ఈ ఆధిపత్య భావజాలం ప్రజలను పాలకులనుండి వస్తున్న నిజమైన కష్టాల నుండి దృష్టి మళ్లించగలుతున్నది. ఇది మన దేశంలోనే కాదు అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలతో సహా ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న పరిణామం. అమెరికాలో పెంచిపోషించబడుతున్న తెల్లజాతి దురహంకారం, యూరప్‌లో వలసదారులకు వ్యతిరేకంగా తలెత్తుతున్న సంకుచిత భావజాలం. ఇటలీతో సహా అనేక దేశాల్లో నయా-ఫాసిస్టు శక్తులకు ఆదరణ లభించడం ఇవన్నీ కూడా దీనికి ఉదాహరణలే.

ఇలాంటి పరిస్థితుల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ సమాజంలో విప్లవాలను జయప్రదం చేయడానికి మార్క్సిస్టు మహోపాధ్యాయుల రచనలకు తోడుగా గ్రాంసీ బోధనలు కార్మికవర్గానికి ఎంతగానో తోడ్పడతాయన్న దాంట్లో సందేహం లేదు.

*

# 'కాక్రోచ్'లు సంక్షోభ మూలాల్లోకి వెళ్లాలి!

**సాహిల్ బధ్వర్**

భారత ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను "బొద్దింకలు" (కాక్రోచెస్)తో పోల్చారు. ఈ నిరుద్యోగ యువతలో కొందరు మీడియాగా మారారు, కొందరు సోషల్ మీడియాగా, ఆర్‌టిఐ కార్యకర్తలుగా మారారు".... "అందరిపై దాడిచేయడం మొదలు పెట్టారు" అని ఆయన అన్నారు. ఒక సీనియర్ న్యాయవాది హోదాకు సంబంధించిన కేసులో ఒక న్యాయవాది వేసిన పిటిషన్ సుప్రీం కోర్టులో విచారణకు వచ్చిన సందర్భంగా 2026 మే 15వ తేదీనీ ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మిశ్రా ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ వ్యాఖ్యలపై భారతీయ యువత నుండి తీవ్రమైన ఆగ్రహం పెల్లుబికింది. ఈ వ్యాఖ్యలు భారత యువజనులకు అవమానకరమైనవనీ, ఖండించదగ్గవనీ వారిలో చాలా మంది అభిప్రాయపడ్డారు. దీనిపై కొందరు యువకులు వ్యంగ్యపూరితంగా స్పందిస్తూ తమను తాము "బొద్దింకలు" (కాక్రోచ్‌లు)గా పేరుపెట్టుకున్నారు. ఒక వ్యంగ్య చిత్రంగా ప్రారంభమైంది కాస్తా త్వరలోనే కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)గా మారింది. ఈ ఉద్యమం వెనువెంటనే సోషల్ మీడియా పేజీలను రూపొందించింది, పోస్టర్లు వేసింది, పూర్తి స్థాయి ప్రణాళిక (మ్యానిఫెస్టో)తో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. అందులో తమ పార్టీలో చేరడానికి అర్హతలను ప్రకటించింది. అన్నిటికీ మించి ఈ జోక్‌లో పాల్గొనే వాళ్లెవరో ముందుకు రావాలని కోరింది.

మే 16న సిజెపి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ప్రారంభించింది. తమ పార్టీలో 25,000 మంది చేరారని ప్రకటించింది. తరువాత నాలుగు రోజుల్లోనే ఆ పేజీ ఫాలోవర్ల (అనుచరుల) సంఖ్య భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఫాలోవర్లకన్నా పెరిగిపోయింది. వాస్తవానికి బిజెపికి పేరడీగానే సిజెపి పార్టీ పెట్టుకుంది. ఈ నాలుగు రోజుల్లో దాని ఫాలోవర్ల సంఖ్య 88 లక్షలకు పెరిగిపోయింది. తరువాత ఆ సంఖ్య 2.06 కోట్లకు చేరుకున్నది.

ఇంటర్నెట్‌లో జరిగే చాలా విచిత్రాల్లాగే కాక్రోచ్ జనతా పార్టీ కూడా ఒక వ్యంగ్య చిత్రంగా ప్రారంభమై దేశవ్యాపితంగా తీవ్రమైన



చర్చకు కారణమైంది. ఇంతకీ ఇది కేవలం ఒక వైరల్ జోక్ మాత్రమేనా లేక నేటి రాజకీయ వ్యవస్థను సవాలు చేసే నిజమైన రాజకీయ శక్తా? జవాబు అస్పష్టంగానే ఉంది. ఆ పార్టీ సభ్యులు, నిర్వాహకులు, వ్యవస్థాపకులకు నిర్దిష్టమైన విజన్ ఉందా అనేది కూడా అస్పష్టమే. మనం ఇంతవరకు ఏం తెలుసుకున్నామో దానితో మొదలెట్టడమే ప్రస్తుతానికి ఉపయోగకరం.

**సిజెపి గురించి ఇటీవలి పరిశీలన**

సమాచార యుగంలో ప్రజలు తెలుసుకున్న విషయం ఏమంటే, ఏదైనా ఘటన జరిగినప్పుడు మనకు పైకి కనిపించేదానికన్నా లోతుగా పోయి పరిశీలించాలి. అలా చూసినప్పుడు మనకు ఇక్కడ ఒక చక్కటి వైరుధ్యం కనిపిస్తుంది. తప్పుడు సమాచార తుపాను సృష్టించి, అబద్ధాలను ప్రచారం చేసే సోషల్ మీడియా చివరికి ఒక తెలివైన ప్రేక్షకులను సృష్టించింది. ఈ ప్రేక్షకులు చాలా ఖర్చుతోకూడిన కృత్రిమ మేధ (ఎఐ)తో ఎంతో వాస్తవికంగా సృష్టించబడిన చిత్రాలను కూడా నమ్మరు. ఆన్‌లైన్ మోసాల గురించి వారికి బాగా తెలుసు. దేన్నీ సులువుగా నమ్మకూడదన్న విషయం కూడా వారికి తెలుసు.

తప్పుడు ప్రచారాన్నే కాదు ప్రజల నిశిత పరిశీలనకు నిలవని ఏ ప్రచారాన్నీ కొనసాగించడం అంత సులువు కాదు. నీవు ప్రపంచ పెట్టుబడితో జతకట్టినప్పుడు మాత్రమే ఇంటర్నెట్‌లో శాంతియుతంగా ఉండగలవు. నీ ప్రచారాన్ని సాగించుకోగలవు. అలా చేయాలంటే నీకు మీడియా మీద, సోషల్ మీడియా మీద గుత్తాధికారం ఉండాలి. ఇంతర్నెట్‌లో అబద్ధాలు ప్రచారం చేయడం, తప్పుడు సమాచారం ఇవ్వడం బిజెపీకీ దాని నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికీ సులువు. వారికి ప్రధాన స్రవంతి మీడియాను నియంత్రించే యంత్రాంగం ఉంది. దాంతోపాటు వారికి అనేక ప్రత్యామ్నాయ మీడియా వేదికలున్నాయి. మీడియా ప్రభావశీలురు (ఇన్‌ఫ్లుయన్సర్లు) ఉన్నారు. ఆటోమేటిక్‌గా, మాన్యువల్‌గా పనిచేసే ఒక పెద్ద ట్రోల్స్ సైన్యం ఉంది. ప్రపంచ పెట్టుబడితో అనుబంధమైన, జాతీయంగా ప్రతి వీధిలో, ప్రతి గల్లీలో ప్రజల్లో పనిచేసే ఒక పెద్ద ఆశ్రిత బలగం ఉండడం వల్ల సత్యాన్ని పూర్తిగా వక్రీకరించి చెప్పగల సామర్థ్యం దానికి వచ్చేసింది.

అందువల్ల సహజంగానే ఈ సామర్థ్యాలేవీ లేని సిజెపిని వివిధ రాజకీయ ఆలోచనలతో ఉన్న యువతీయువకులు నిశితంగా పరిశీలించి దాని పక్షాన చేరారు. సిజెపి ఆకాశమంత ఎత్తు ఎదిగిపోవడంతో వివిధ రాజకీయ సిద్ధాంతాలకు చెందిన అనేక మంది ఇన్‌ఫ్లుయన్సర్లు ఆ పార్టీని దాని వ్యవస్థాపకుడైన అభిజీత్ దీపికెను విమర్శించడం మొదలుపెట్టారు. సిజెపి పార్టీ

> "ఒక తల్లికి పుట్టిన సంతానంలో స్వల్పమైన తేడాలు ఉంటా యి. ఈ తేడాలలో కొన్ని మనుగడకు సహాయకారిగా మరికొన్ని హాని కరమైనవి ఉంటాయి. హానికరమైన తేడాలు కలిగినవి నశించి పోతాయి. సహాయకరమైన తేడాలు కలిగినవి బ్రతుకు తాయి. అంతేకాక ఇవి సంతానోత్పత్తి చేసి తమ సహాయకర మైన తేడాలు తమ సంతానానికి అందిస్తాయి. ఈ సంతానం మళ్లీ సహాయకరమైన, హానికరమైన తేడాలతో జన్మిస్తాయి. ఇలాగా తరం నుండి తరానికి ఒక జీవజాతి మార్పులు చెందుతూ కొనసాగుతూ ఉంటుంది."

వెనుక ఉన్న వారి జాతకాలతో వీడియోలు తీస్తున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడైన దీపికె, ఆ పార్టీ వెనుకనున్న ఇతరులూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టిఎంసి)లకు చెందిన వారని విమర్శిస్తున్నారు. ఇటువంటి విమర్శలు ఊహించదగినవే. అందువల్ల మన విశ్లేషణలో వాటిని సీరియస్‌గా తీసుకోనక్కర లేదు. కానీ మరి కొందరు సిజెపి ఒక ఉద్యమ మా, లేక ధోరణా (ట్రెండా) అని ప్రశ్నిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా పేదలు, కార్మికవర్గ ప్రజలు తీవ్రమైన ఈతిబాధలకు గురిచేయ బడుతున్న తీరును గమనించి మానసికంగా ఉద్రేకానికి లోనైన కొంతమంది మధ్య తరగతి యువకుల ప్రతిస్పందనే ఈ సిజెపి అని మరి కొందరు చెబుతున్నారు, షార్ట్ ఫిల్మ్‌లు తీస్తు న్నారు, సోషల్ మీడియాలో అనేక రకాలైన విశ్లేషణలు చేస్తున్నారు.

### నేటి సోషల్ మీడియాకు సంబంధించిన రాజకీయ అర్థశాస్త్రం

సిజెపి అనేది ఒక ఉద్యమమా లేక కేవలం ఒక ధోరణి మాత్రమేనా? ఈ విషయంలోకి వెళ్లే ముందు మనం ఈ ప్రశ్ననే అర్థం చేసుకో వాలి. ఈ ప్రశ్నను ఇలానే ఎందుకు వేస్తున్నా మంటే చాలా మంది ఇంటెర్‌నెట్‌లో ఈ ప్రశ్నను లేవనెత్తుతున్నారు.

చరిత్ర మొత్తం చూసుకుంటే, సామాజిక, రాజకీయ ఉద్యమాలు తమ ఉద్యమాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఆనాటికి అందుబాటులో ఉన్న శక్తివంతమైన ప్రచారయంత్రాంగాలపై ఆధారపడ్డం మనకు కనిపిస్తుంది. ప్రాచీన నాగరికతల్లో పాలకులు, మతసంస్కరణ వాదులు చేతిరాత గ్రంధాలను, శిలాఫలకాలనూ, నోటితో చెప్పే కథల ద్వారా నూ తమ భావాలను ప్రజల్లో ప్రచారం చేశారు. ప్రొటెస్టెంట్ సంస్కరణోద్యమం సందర్భంగా మార్టిన్ లూథర్ వంటి వారు ప్రింటింగ్ ప్రెస్‌ను బాగా ఉపయోగించుకున్నారు. వారు అచ్చువేసిన కరపత్రాలు, అనువాదాల ద్వారా తమ విమర్శలను యూరప్ అంతటా చాలా వేగంగా ప్రచారం చేయగలిగారు. 18, 19 శతాబ్దాల్లో ఫ్రాన్స్, అమెరికాల్లో విప్లవోద్యమాలు వార్తా పత్రికలు, రాజకీయ కరపత్రాలను ఉపయో గించుకుని పౌరుల్లో స్ఫూర్తినింపడం ద్వారా ప్రతిఘటనోద్యమాలను నిర్మించారు. 20వ శతాబ్దం వచ్చేసరికి అమెరికా పౌరహక్కుల ఉద్యమం వంటివాటికి రేడియో, టెలివిజన్‌లు కీలకమైన సాధనాలుగా మారాయి. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ వంటి వారు ఈ రేడియో, టెలివిజన్ ఉపన్యాసాలతో లక్షలాది మంది ప్రజలను ఉగ్రూతలూగించారు.

ఇరవయ్యవ శతాబ్ది చివర, ఇరవయ్యొకటో శతాబ్దం ప్రారంభంలో రంగంలోకి వచ్చిన ఇంటర్నెట్ ఉద్యమాల స్వరూపాన్ని మరోమారు మార్చివేసింది. వెబ్‌సైట్లు, బ్లాగులు, ఆన్‌లైన్ వేదికల ద్వారా ప్రపంచవ్యాపిత సమాచార మార్పిడికి మార్గం సుగమం చేసింది. భావాలను పంచుకోడానికీ, ప్రచారం చేయడానికీ ఈనాడు సోషల్ మీడియా వేదికలు ప్రధాన మాధ్య మాలుగా మారాయి. దాంతో వాతావరణ ఉద్యమాలు, సామాజిక న్యాయ ఉద్యమాలు తమ నినాదాలను అప్పటికప్పుడు విశ్వవ్యా పితంగా ప్రచారం చేయగలుగుతున్నాయి. ప్రపంచ వ్యాపితంగా మద్దతుదారులను కూడ గట్టగలుగుతున్నాయి. నిజజీవితంలో ప్రజాభి ప్రాయాన్ని మలచగలుగుతున్నాయి. అదే సమ యంలో, పాలక వర్గాలు కూడా ఈ మాధ్య మాన్ని తమ ప్రచారం కోసం ఉపయోగించు కోడానికి దీనిలోకి విపరీతంగా పెట్టుబడి పెడుతున్నాయి. ఈనాడు సోషల్ మీడియా వేదికలను గుత్త పెట్టుబడి నియంత్రిస్తోంది.

చరిత్రలో ఇతర ప్రజా ప్రచార సాధనాల మాదిరిగానే సోషల్ మీడియా కూడా విస్తార మైన ప్రజానీకానికి సమాచారాన్ని, భావాలనూ సమర్ధవంతంగా ప్రచారం చేయడానికే ఉన్నదని ఎవరైనా అంటే కాదనే చెప్పాలి. గతంలో ప్రజాబాహుళ్య ప్రచార సాధనాలైన కరపత్రాలు, వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి వాటిలా సోషల్ మీడియా కేవలం సమాచా రాన్ని చేరవేసే సాధనం కాదు. అది లాభాలు, డేటా సేకరణ, అల్గోరిథిమ్ నియంత్రణతో నడపబడే ఒక బడా డిజిటల్ పరిశ్రమలో అంతర్భాగం. గతంలో సమాచార వ్యవస్థలు భౌతిక ఉత్పత్తి, ఎడిటోరియల్ వ్యవస్థలు, లేక ప్రభుత్వ నియంత్రణలకు పరిమితమయ్యేవి. కానీ ఆధునిక సోషల్ మీడియా వేదికలు కొద్దిపాటి శక్తివంతమైన టెక్నాలజీ కార్పొరేషన్‌లచే నడపబడుతున్న వాస్తవ ఆర్థికవ్యవస్థల ద్వారా నిర్వహించబడుతున్నాయి. మెటా, గూగుల్, టిక్‌టాక్ వంటి కంపెనీలు ప్రపంచ సమాచార ప్రవాహాలను నిర్వహించడంలో ఆధిపత్యం వహిస్తున్నాయి. వినియోగదారులను ఆకర్షిం చడం, ఎడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా గరిష్ట లాభాలు గడించడం లక్ష్యంగా ఇవి అల్గోరిథిమ్ ద్వారా ఏ సమాచారాన్ని కనిపించేట్లు చేయాలి, దేన్ని కనిపించకుండా చేయాలి అనే విషయాన్ని నిర్ణయిస్తున్నాయి. దీనికోసం ఇవి కొద్దిపాటి కార్పొ రేషన్లలో అధికారాన్ని, పెట్టుబడినీ కేంద్రీకరిస్తు న్నాయి. దానర్థం వార్తాపత్రికలు, టెలివిజన్ వంటి ఇతర ప్రచార సాధనాలు పెట్టుబడి నియంత్రణలో లేవని కాదు. కానీ సోషల్ మీడియాలో సమాచార ప్రవాహంపై ఇది మరింత ఎక్కువగా ఆధిపత్యం వహిస్తున్నది.

ఇది ఏ పరిస్థితికి దారితీసిందంటే, అనేక మంది ప్రజలు, ముఖ్యంగా సమాచారాన్ని జాగ్రత్తగా ఆలోచించి రూపొందించేవారు, లేక అలా చేయాలనుకున్న వారు కూడా తమ సమాచారాన్ని ఎక్కువమందికి చేరవేయాలనే ఆతృతతో అల్గోరిథిమ్ ధోరణుల్లోకి వెళ్లిపోతు న్నారు. ఆ రకంగా చెప్పాలంటే, సోషల్ మీడియా వినియోగదారులు ఒకే సమయంలో సోషల్ మీడియా సమాచార వినియోగదారు లుగానూ, అదే సమయంలో ప్రతిఫలం తీసుకోని ఉత్పత్తిదారులుగానూ పనిచేస్తున్నారు. వారు నిరంతరాయంగా డేటా ఉత్పత్తి చేస్తూ దాన్ని లాభాలుగా మార్చుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో... ఎలాంటి విప్లవాత్మక సైద్ధాంతిక ప్రాతిపదిక లేని ఇటువంటి వ్యంగ్య చిత్రాలు (మెమె)లు ద్వారా ప్రారంభమైన ధోరణి మనకు ఎదురైంది. దీని గురించి హిమాంషి దహియా, క్వింట్‌లో ఒక వ్యాసం రాస్తూ "వ్యంగ్య చిత్రాలతో మీరు సిద్ధాంతాన్ని అధిగమించి వెళ్లలేరు" అని అన్నారు. అధిగమించాల్సిన ఆ సిద్ధాంతమే హిందూత్వ అని ఆమె వివరించారు. ఎన్నికల ద్వారా విస్తరించిన సైద్ధాంతిక ప్రాజెక్టు హిందూ త్వ అని ఆమె పేర్కొన్నారు. ఇది హిందుత్వ మాత్రమే కాదు, ఇది ఒక నయా-ఫాసిస్టు

> “ డార్విన్ తన పరిశోధనా విషయా లన్నింటినీ ఒక నోట్స్‌గా తయారు చేస్తున్నప్పుడు 1855లో ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే శాస్త్రవేత్త “నూతన జాతుల ఆవిర్భావానికి ఆధార సూత్రాలు” అనే శీర్షికన ఒక వ్యాసం రాశాడు. దానిలోని భావాలు సరిగ్గా డార్విన్ సిద్ధాంతాన్ని పోలి ఉన్నాయి. డార్విన్ మిత్రులు మీకు రావలసిన ఘనత మరొకరికి పోవచ్చు వెంటనే మీ గ్రంథం ప్రచురించండి అని ఒత్తిడి చేశారు. ”

ప్రాజెక్టు. హిందూత్వకూ ప్రపంచ పెట్టుబడికీ మధ్య నున్న సంబంధాన్ని నిర్వచించే ఒక విస్తారమైన అర్థం గలదే నయా-ఫాసిజం.

అందువల్ల ఇది ఉద్యమమా, లేక ఒక ధోరణి మాత్రమేనా?

మొత్తం పరిస్థితిని బేరీజు వేసుకుంటే ఈ ప్రశ్నే తనుకు తాను సమాధానం చెప్పుకుంటుంది. ఇది ఒక ఉద్యమం మాత్రం కాదు, కనీసం ఇప్పటి కాదు. ఇది కచ్చితంగా ఒక ధోరణి మాత్రమే. అయితే దానర్థం ధోరణులను సీరియస్‌గా తీసుకోవద్దనీ కాదు, లేకుంటే వాటిని కొట్టి పారేయాలనీ కాదు. ఇది ఒక ఆన్‌లైన్ ధోరణి. మన సమాజంలోని నిర్దిష్ట వాస్తవికత నుండి ముఖ్యంగా మన సమాజంలోని యువజనులనుండి ఉద్భవించిన ధోరణి ఇది.

ఈ వాస్తవికతకూ 1991లో భారత దేశంలో తలెత్తిన నయా-ఉదారవాదానికీ సంబంధం ఉంది. అప్పటి నుండి భారత దేశం అత్యధిక జిడిపి పెరుగుదలను నమోదు చేసింది. కానీ దానికి తగ్గట్లు స్థిరమైన ఉపాధి మాత్రం పెరగలేదు. 2002-03 నుండి 2007-08 వరకు సాగిన ఈ పరిస్థితిని అనేకమంది ఆర్థిక వేత్తలు “ఉపాధిరహిత అభివృద్ధి” అన్నారు. కానీ మనం ఇప్పుడు ఆ స్థితినుండి మరింత దిగజారి “ఉపాధికోత అభివృద్ధి” దశకు వచ్చాం. ఈ దశలో కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2017-18లో నిరుద్యోగ రేటు 6.0 శతానికి పెరిగింది. కొన్ని దశాబ్దాల్లో ఇంత పెద్ద ఎత్తున పెరగడం ఇదే ప్రథమం. మరోవైపు సిఎంఐఇ వంటి స్వతంత్ర సంస్థలు నిరుద్యోగ రేటు 7 నుండి 10 శాతం మధ్య ఉంటుందని చెబుతున్నాయి. యువజనుల్లో నిరుద్యోగం 20 శాతం దాటిపోయింది. మామూలు విద్య, డిగ్రీలు ఉన్న యువతలో ఈ నిరుద్యోగ సంక్షోభం మరింత తీవ్రంగా ఉంది. 2023లో 20 నుండి 29 సంవత్సరాల మధ్య ఉన్న 6.3 కోట్ల మంది యువకుల్లో 1.1 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ నివేదిక ఒకటి తెలిపింది. అదే సమయంలో 25 ఏళ్ల లోపు డిగ్రీ చదివిన యువకుల్లో 40 శాతం నిరుద్యోగం ఉందని అది వెల్లడించింది.

భారత దేశంలో ప్రభుత్వ రంగ ఉద్యోగాలు కావాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. కానీ ఈ రంగంలో కూడా ఉద్యోగ అభద్రత పెరిగిపోతోంది. 2014, 2022 మధ్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం 22 కోట్ల మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో కేవలం 7.22 లక్షల మంది మాత్రమే ఉద్యోగాల్లో నియమితులయ్యారని రాయిటర్ సంస్థ తెలిపింది. ఉద్యోగాలకు ఉన్న డిమాండుకూ వాస్తవంగా వచ్చే ఉద్యోగాలకూ మధ్య ఎంత పెద్ద అంతరముందో ఇది తెలియజేస్తోంది. ఎస్ఎస్‌సి, రైల్వే బోర్డులు, ఇతర వివిధ రాష్ట్ర కమిషన్లు నిర్వహించే పరీక్షలు, ప్రశ్నాపత్రాల లీకు, సాంకేతిక వైఫల్యం, రద్దులు, నిర్వహణలోపాలు వంటి ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. పరీక్షల వాయిదా, రద్దుల వల్ల విద్యార్థులు ఏళ్ల తరబడి చేసిన కృషి అంతా వ్యర్థమైపోతోంది. 2019 తరువాత డజన్ల కొద్దీ పేపర్ లీకులు జరిగాయని దర్యాప్తులు, మీడియా నివేదికలు తెలిపాయి. దాంతో కోటి మంది ఇబ్బందులు పడ్డారు. మన నియామక వ్యవస్థ మీదనే దీని వల్ల నమ్మకం పోయింది.

భారతీయ యువతలో నెలకొని ఉన్న ఈ విషాదకరమైన పరిస్థితి వల్లనే నేడు దేశంలోని యువతలో ఈ ధోరణి బయలు దేరింది. అందువల్ల సిజెపి ఒక ఉద్యమమా కాదా అన్నది ప్రశ్న కాదు. ప్రశ్న ఏమంటే, మన దేశంలో నిస్పృహకు గురయిన యువత ఎలా ఉద్యమాన్ని నిర్మించాలి అన్నదే. ఇప్పటి వరకు వారు తమ నిస్పృహను వ్యంగ్య చిత్రాలు, రీల్లు, బ్లాగులు, ఆకాశరామన్న వ్యాఖ్యానాలు, రెడ్డిట్ చర్చలు, గేమింగ్‌లు, పేరడీలు రూపొందించడం, హాస్య పూరిత రచనలు, అనుకరణలు ఇంకా అనేకానేక రూపాల్లో వ్యక్తం చేస్తూ వచ్చారు. వారిలో కొంతమంది సమీకరించబడి అప్పుడప్పుడు వీధుల్లోకి వచ్చి మంచి విద్య, ఉద్యోగాలు, నాణ్యమైన జీవనం, న్యాయం, పౌరహక్కులు వంటి వాటికోసం పోరాటాలు చేస్తున్నారు. ఇప్పుడు కావల్సింది ఈ పోరాటాలే. ఇవి కాకుండా ఇతర అన్నీ కూడా యువకుల సమీకరణకు సహకరించే సాధనాలు మాత్రమే. వాటిని ఉపయోగించుకోవాల్సిందే, కానీ చివరి కొచ్చేసరికి, వారు నయా-ఫాసిజంపై పోరాటం చేయాల్సిందే. వాళ్లు వీధుల్లోకి వచ్చినప్పుడు మాత్రమే, ప్రజాస్వామ్య క్రమంలో పాల్గొన్నప్పుడు మాత్రమే, వాళ్లవాళ్ల వీధుల్లో నుండి మొత్తం గ్రామాలు, నగరాల వ్యాపితంగా సమీకరించబడినప్పుడు మాత్రమే వాళ్లు నయా-ఫాసిజం మీద సమర్థవంతంగా పోరాడగలరు. అలా చేసినప్పుడు మాత్రమే యువజనులు, జెన్-జెడ్, కాక్రోచ్‌లు రాజకీయంగా కొత్తదనాన్ని చూపగలరు. తమకు మంచి జీవితాన్ని, ప్రతి ఒక్కరికీ మంచి సమాజాన్ని సాధించగలుగుతారు.

‘యువజనులు: ఎన్నికలను దాటి రాజకీయాల నిర్మాణం’ అన్న అంశంపై ఇటీవల ఢిల్లీలో యువజన సంఘాలు ఒక స్టడీసర్కిల్‌ను నిర్వహించాయి. ఆ స్టడీ సర్కిల్‌లో 2019లో చిలీలో తలెత్తిన సామాజిక వెల్లువను ఒక ఉదాహరణగా చెప్పడం జరిగింది. చిలీలో 14-18 సంవత్సరాల మధ్య వయసు గల పాఠశాల విద్యార్థులు 30 పెసోల వరకు పెంచిన మెట్రో ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం ద్వారా యువకులు తమ సమస్య 30 పెసోలు తగ్గించడంతో పరిష్కారం కాదనీ, మొత్తం ప్రభుత్వ వ్యవస్థ మారాలనీ గుర్తించారు. గత 30 ఏళ్లుగా చిలీ ప్రజలపై మోపిన నయా-ఉదారవాద భారాలే నిజమైన సమస్య అనీ, వాటిని తగ్గించుకోవడమే నిజమైన పరిష్కారమని గుర్తించారు. దాంతో వెనువెంటనే యుకులూ, వృద్ధులూ, విభిన్న సామాజిక గ్రూపులు ఏకమయ్యారు. సెబాస్టియన్ పినెరా నేతృత్వంలోని మితవాద ప్రభుత్వాన్ని గద్దె దింపారు.

భారతీయ యువత ముందు నేడు ఇదే లక్ష్యం ఉంది. చిలీ యువజనులు గుర్తించినట్లే భారత యువకులు కూడా ‘30 పెసోలు కాదు, 30 సంవత్సరాలు’ అనే నినాదాన్ని ఇవ్వాలి. భారత దేశంలోని యువతీయువకులు వారంతట వారుగా తమ తక్షణ డిమాండ్లపై సమీ కరించబడాలి, అందరూ కలిసి సమస్య మూలాల్లోకి, అంటే కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, మహిళలు, అభివృద్ధికి దూరం చేయబడిన సామాజిక గ్రూపులు సంవత్సరాలుగా గురవుతున్న ఈతిబాధలకు సంబంధించిన సమస్యలోకి వెళ్లాలి. ఫాసిస్టు శక్తులతో మిలాఖత్ అయిఉన్న నయా-ఉదారవాద ప్రభుత్వం సృష్టించిన నిరుద్యోగం, అరకొర ఉద్యోగాల సంక్షోభం నేటి మూల సమస్య.

(అనువాదం: ఎస్. వెంకట్రావు)

రాజకీయ పరిణామాలు

# మోడీ ప్రభుత్వ విధానాలతో దిగజారుతున్న ఆర్థిక వృద్ధి



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

ఆర్థికాభివృద్ధి దిగువ చూపులు చూస్తున్నదని ప్రభుత్వం వెల్లడించిన లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. పారిశ్రామికోత్పత్తిలో 40 శాతంగా ఉన్న ఎనిమిది కీలకరంగాలలో పెరుగుదల ఏప్రిల్‌లో 1.7, మే నెలలో 0.5 శాతానికే పరిమితమైంది. ఇదే మాసాలలో మొత్తం పారిశ్రామికోత్పత్తి వరుసగా 4.9, 0.5 శాతం మాత్రమే పెరిగింది. కీలకమైన పారిశ్రామిక రంగంలోని ఈ పరిస్థితి ఆర్థికాభివృద్ధి లక్ష్యాలకు గండి కొడుతున్నది. దానితో పాటు ఉపాధి క్షీణతను కూడా వెల్లడిస్తున్నది. ఏప్రిల్ నెలలో నిరుద్యోగం 5.2 నుండి మే నెలలో 5.5 శాతంకు పెరిగింది. క్షీణిస్తున్న ఉత్పత్తి, పెరుగుతున్న నిరుద్యోగం యువతలో తీవ్రమైన నిరాశా నిస్పృహలకు దారితీస్తున్నాయి. విస్తరిస్తున్న నిరుద్యోగం ప్రజల జీవన ప్రమాణాలు దిగజారటానికి, మరింత ఎక్కువ మంది ప్రజలు దరిద్రంలో కూరుకుపోవటానికి దారి తీస్తున్నది. ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయటం ప్రారంభించటంతో పని గంటలు పెరుగుతున్నాయి. ఫలితంగా కొత్తగా కార్మికులను తీసుకోవాల్సిన అవసరం తగ్గటంతో పాటు ఇప్పటికే పని చేస్తున్నవారి వేతనాలు తగ్గటానికి కూడా దారితీస్తుంది. ఉపాధికి అవకాశాలు తగ్గటంతో పని దొరికితే చాలు తక్కువ వేతనాలకైనా చేయటానికి నిరుద్యోగులు సిద్ధపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి వికసిత్ భారత్-అభివృద్ధి చెందిన భారతదేశం- అంటూ డబ్బా కొట్టుకొంటున్నప్పటికీ ఆచరణలో ఆర్థిక వ్యవస్థ సజావుగా నడుస్తున్న పరిస్థితి లేదు. దేశంలోని పారిశ్రామిక, వ్యవసాయరంగాలలో ఆశించిన పెరుగుదల లేదు. ఏఐ అభివృద్ధితో సర్వీసు రంగంలో ఊహించని పరిణామాలు వస్తాయని, ఉద్యోగితపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాతో పాటు వివిధ దేశాలతో ప్రభుత్వం చేసుకొంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు వృద్ధిరేటును దెబ్బతీసే అవకాశం ఉంది.

2026-27 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం జిడిపి వృద్ధిని సాధిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ రేటింగ్ ఏజన్సీలు, దేశంలోని సంస్థలు ఆర్థికవృద్ధి లక్ష్యాలకు కోతలు పెడుతున్నాయి. వివిధ ప్రభుత్వ సంస్థలు చేస్తున్న అధ్యయనాలలో కూడా వృద్ధి లక్ష్యాన్ని చేరుకుంటామన్న భరోసా కనబడటం లేదు. పశ్చిమాసియా సంక్షోభం, ఇతర కారణాలను చూపుతూ ప్రపంచ బ్యాంక్ వృద్ధిరేటును 6.6 శాతానికి తగ్గించింది. వృద్ధిరేటు 6.9 శాతం ఉంటుందని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అంచనా వేయగా, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.6 శాతానికే పరిమితం చేసింది.

### వ్యవసాయరంగం


ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగం పరిస్థితి ఆశాజనకంగా లేదు. ప్రభుత్వం అనురిస్తున్న విధానాల ఫలితంగా ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయోపకరణాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యమైన సీజన్లలో అవసరానికి అనుగుణంగా ఎరువులు సరఫరా చేయటం లేదు. ఎరువుల ధరలను భారీగా పెంచుతున్న ప్రభుత్వం పంటల మద్దతు ధరలను మాత్రం అతి తక్కువగా పెంచుతున్నది. పంటలు మార్కెట్‌లోకి వచ్చిన సమయాలలో వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కూడా కొనటం లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు రైతుల పరిస్థితి ప్రభుత్వాల ఆదేశాలు-అమలుకు నడుమ ఉన్న అంతరాన్ని వెల్లడిస్తున్నది. పొగాకు వ్యాపారస్తులు ధరలు దిగ్గోయటంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తున్నది. కిలో 200 రూపాయల చొప్పున కొనుగోలు చేయిస్తామని ముఖ్యమంత్రి రైతులకు వాగ్దానం చేసినప్పటికీ వ్యాపారులు 160 రూపాయలకే కొంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఫలితంగా రైతు కుటుంబాలు వ్యవసాయంపై పెడుతున్న ఖర్చు పెరగటం, పంట దిగుబడులపై వస్తున్న ఆదాయం తగ్గటంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతాంగంలో 68 శాతంకు పైగా రైతులు 2.5 ఎకరాల కన్నా తక్కువ భూమిని కలిగివున్నారు. వీరు వ్యవసాయం, పశు పోషణతో పాటు కూలి పనులకు కూడా వెళుతుంటారు. ఈ పనులన్నింటిపై కలిపి వారికి నెలకు 7,350 నుండి 9,250 రూపాయల వరకు ఆదాయం వస్తున్నది. పిల్లల చదువు, వైద్య ఖర్చులు, ఇతర అవసరాలు తీరక అప్పులు చేయకపోతే బతకలేని పరిస్థితిలో ఉన్నారు. మొత్తం రైతులలో సగం మంది వరకు కౌలు రైతులు ఉంటారు. వీరి పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి.

### వ్యవసాయ కార్మికులు– ఉపాధి హామి చట్టం

గ్రామీణ ప్రజలలో సగానికి పైగా ఉన్న వ్యవసాయ కార్మికులకు పని దొరికితేనే తిండి దొరుకుతుంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోతుండటం, కలుపు మందులు, ఇతర ఆధునిక విధానాల వలన వ్యవసాయ కార్మికులకు పనిరోజులు తగ్గిపోతున్నాయి. యుపిఎ ప్రభుత్వ పాలన కాలంలో ఆమోదించిన ఉపాధి హామి చట్టం పనిదినాల లోటును కొంత మేరకు భర్తీ చేసింది. దానిపై కత్తికట్టిన మోడి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దుచేసి, విబిజిఆర్ఎఎంజి పథకాన్ని తీసుకొచ్చింది. ఇది వ్యవసాయ కార్మికులకు కల్పించే పనిదినాలు, ఏ ప్రాంతాలలో పనులు కల్పించాలనే అంశంపై అనేక పరిమితులు విధించింది. ఫలితంగా వ్యవసాయ కార్మికులకు లభించే పనిదినాలు, ఆదాయం తగ్గుతాయి. పనులతో పాటు సాగుకు ఉపయోగపడే చెరువులు, కుంటలు, సాగునీటి కాలువల మరమ్మతులు, పొలాలకు రోడ్లు వేయటం లాంటి

> **" ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడతా యని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. వర్షాలు సమృద్ధిగా పడిన సంవత్సరాలతో పోల్చుకుంటే తక్కువ వర్షాలు పడిన సంవత్స రాలలో జిడిపి పెరుగుదల సగానికి పైగా తగ్గుతున్నది. ఈ సంవత్సరం వర్షాలు తక్కువ పడితే జిడిపి పెరుగుదల 2023-24 స్థాయికి కన్నా దిగువకు పడిపోవచ్చు. "**




కార్యకలాపాలు కూడా కుంటుపడటంతో వ్యవసాయోత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుంది. వీటివలన రైతులకు ఆదాయం తగ్గటంతో పాటు వ్యవసాయ కార్మికులకు పనిదినాలు కూడా తగ్గుతాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం మరింతగా పెరుగుతుంది.

వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయి, నిరుద్యోగులుగా మారటానికి దారితీస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటు, గనుల తవ్వకం, రహదారుల నిర్మాణం, తదితర పేర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది ఎకరాల భూములు తీసుకొంటున్నాయి. అటవీప్రాంతంలో గనుల తవ్వకం, విద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాయి. పరిశ్రమలలో ఉద్యోగాలిస్తామంటు భూములు తీసుకున్న ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు భూములు తమ చేతికి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోవటం లేదు. ఈ విధంగా భూములు కోల్పోయిన రైతులు, ఆ భూములపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజానీకం లక్షల సంఖ్యలో నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు.

### ఎల్‌నినో ప్రభావం

ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. దాని ప్రభావం ఇప్పటికే కనిపిస్తున్నది. వర్షాలు తక్కువ పడటం వలన ఉత్పత్తి తగ్గటంతో పాటు అనేక సమస్యలు సృష్టిస్తుంది. 2013-14 నుండి 2023-24 వరకు దశాబ్ద కాలంలో సగటు వార్షిక వ్యవసాయోత్పత్తి పెరుగుదల 3.7 నుండి 4.4 శాతం మధ్య ఉన్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తక్కువ వర్షాలు పడటంతో తగినంత నీరు అందుబాటులో లేక వ్యవసాయాభివృద్ధి 1.4 శాతానికే పరిమితమైంది. ఆహార పంటల దిగుబడి తగ్గటం జిడిపి పెరుగుదల తగ్గటానికి ప్రధాన కారణంగా ఉన్నది. వర్షాలు సమృద్ధిగా పడిన సంవత్సరాలతో పోల్చుకుంటే తక్కువ వర్షాలు పడిన సంవత్సరాలలో జిడిపి పెరుగుదల సగానికి పైగా తగ్గుతున్నది. ఈ సంవత్సరం వర్షాలు తక్కువ పడితే జిడిపి పెరుగుదల 2023-24 స్థాయికి మించి పడిపోవచ్చు. పంటలు సకాలంలో వేస్తేనే అధిక దిగుబడులతో రైతుల ఆదాయం పెరగటంతో పాటు వ్యవసాయ కార్మికులకు కూడా ఎక్కువగా పనులు దొరుకుతాయి.

గ్రామీణ ప్రజల జీవితం ప్రధానంగా వ్యవసాయ ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. సక్రమంగా పనులు దొరకకపోతే, తగినంత ఆదాయం రాకపోతే గ్రామీణ ప్రజలు ఇబ్బందుల పాలవుతారు. వర్షాలు తక్కువ పడితే కొన్ని ప్రాంతాలలోని పేదలు నీటికోసం కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారు. కాబట్టి ఎల్‌నినో ప్రజల ఆదాయాలు, ఉపాధి, జీవన ప్రమాణాలు, ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. ఎల్‌నినో ఎక్కువ ప్రభావం చూపే ప్రాంతాలలో ప్రజలకు మంచినీరు అందించటానికి, అవసరమైన వారికి అదనంగా ఉపాధి కల్పించటానికి, వర్షాభావ పరిస్థితులకు అనుగుణమైన పంటలు వేయటానికి అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందించాలి.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగాలు చేస్తున్న మధ్య తరగతి ప్రజల ఆదాయాలలో పెరుగుదల లేదు. ఎవరికైనా కొద్ది మేరకు ఆదాయాలు పెరిగితే రూపాయి విలువ తగ్గటం, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ తదితరాల ధరలు పెరగటం వలన వారికి అదనంగా ఒరిగేది ఉండటం లేదు. వేతనాలు పెరగని వారి పరిస్థితి దిగజారుతున్నది.

ఈ విధంగా దేశంలో 90 శాతం ప్రజల ఆదాయాలు దిగజారుతుండగా ఆర్థికవృద్ధి ఏడుశాతంకు పైగా ఉంటుందని చెబుతున్న మాటలపై ఎవరికీ విశ్వాసం ఉండటం లేదు. ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు చెబుతున్న లెక్కలు, వేస్తున్న అంచనాలను అనేకమంది ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. మెజారిటీ ప్రజల ఆదాయాలు తగ్గిపోవటం, నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరుగుతుండటం, ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువగా పెరిగి వాణిజ్యలోటు పెరగటం తదితర పరిణామాల పూర్వరంగంలో ప్రపంచంలోకెల్లా వేగంగా అభివృద్ధి చెందుతున్నామని చెబుతున్న మాటలకు, వాస్తవాలకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వం 2 నుండి 3 శాతం వరకు జిడిపి వృద్ధిని పెంచి చూపుతున్నదని, వాస్తవ జిడిపి పెరుగుదల 2.5-3.0 శాతంకు మించి ఉండదన్న అభిప్రాయాన్ని అనేకమంది ఆర్థికవేత్తలు వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల ఆదాయాలను పెంచాలి

అభివృద్ధి వేగం పుంజుకోవాలన్నా, ప్రపంచ దేశాలలో కెల్లా అత్యధిక వృద్ధిరేటు సాధిస్తున్న దేశంగా మారాలన్నా దేశంలోని ప్రజల ఆదాయాలు పెంచటానికి అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. ప్రభుత్వం జిడిపి పెరుగుదలను చూయించి, తమ విధానాల

> **“ అందువలన ప్రభుత్వం దృక్పథం, ప్రాధాన్యతలు మారితేనే అభివృద్ధికి ఊపు వస్తుంది. అందుకోసం ఉత్పత్తి అవుతున్న సంపదను కార్పొరేట్లు, ధనికులకు కాకుండా 90 శాతంగా ఉన్న సామాన్య ప్రజలకు అందించటానికి అవసరమైన విధానాలను అనుసరించాలి. మొదటగా నూతనంగా తీసుకొచ్చిన విబిజిఆర్ఎంజి పథకాన్ని రద్దుచేసి, కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధికి గ్యారంటి ఇస్తున్న ఉపాధి హామి చట్టాన్ని పునరుద్ధరించాలి. ”**

వైఫల్యాలను కప్పిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నది. కానీ దేశంలో పెరిగిన సంపదలో ఎక్కువ భాగం ఒకశాతం కన్నా తక్కువ మంది చేతుల్లోకి వెళుతున్నది. దేశంలో నూతనంగా ఉత్పత్తి అవుతున్న సంపదలో పైస్థాయిలోని 1 శాతం మంది 40 శాతం, పై 10 శాతం 58 శాతాన్ని స్వంతం చేసుకొంటుండగా, దిగువ స్థాయిలోని 50 శాతంకు 15 శాతం, 90 శాతం ప్రజలకు 32 శాతం మాత్రమే దక్కుతున్నది. దేశంలో ఉత్పత్తి అవుతున్న సంపద పంపిణీలో ఇంత ఎక్కువగా అసమానతలు ఉంటే దేశం ఏ విధంగా అభివృద్ధి సాధిస్తుంది?

అందువలన ప్రభుత్వం దృక్పథం, ప్రాధాన్యతలు మారితేనే అభివృద్ధికి ఊపు వస్తుంది. అందుకోసం ఉత్పత్తి అవుతున్న సంపదను కార్పొరేట్లు, ధనికులకు కాకుండా 90 శాతంగా ఉన్న సామాన్య ప్రజలకు అందించటానికి అవసరమైన విధానాలను అనుసరించాలి. మొదటగా నూతనంగా తీసుకొచ్చిన విబిజిఆర్ఎంజి పథకాన్ని రద్దుచేసి, కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధికి గ్యారంటి ఇస్తున్న ఉపాధి హామి చట్టాన్ని పునరుద్ధరించాలి. సంవత్సరానికి 200 పనిరోజులను కల్పించి కనీస వేతనాన్ని 500 రూపాయలకు పెంచాలి. రైతాంగం పెట్టిన ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలి. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలలో రిక్రూట్‌మెంట్‌పై ఉన్న ఆంక్షలను తొలగించి, ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలి. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు, ఉద్యోగులందరినీ శాశ్వత ఉద్యోగులుగా మార్చాలి. ఉద్యోగం ఇవ్వలేని నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. విద్య, వైద్యం పూర్తి ఉచితంగా ప్రజలందరికీ అందించాలి. వృద్ధులందరికీ పెన్షన్లు, ఇతర సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేయాలి.

ఈ విధానాలను అమలు చేయటం వలన 90 శాతం ప్రజల ఆదాయం పెరుగుతుంది. పెరిగిన ఆదాయాన్ని తమకు అవసరమైన సరుకులు, సేవలను కొనుగోలు చేయటానికి ప్రజలు వినియోగిస్తారు. అపుడు మార్కెట్‌లో పారిశ్రామిక సరుకులు, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. మార్కెట్‌లో అదనంగా లక్షల కోట్ల రూపాయలతో అమ్మకాలు, కొనుగోళ్ళు జరుగుతుండటంతో ఆర్థికవ్యవస్థ స్వరూపమే మారిపోతుంది. ఈ పరిణామాలతో సామాన్య ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పు వస్తుంది.

బూర్జువా ఆర్థికవేత్తలు ఇటువంటి మార్పులకు అంగీకరించరు. కేంద్రం, రాష్ట్రాలు వనరుల కొరతతో కొట్టుమిట్టాడు తున్నాయని, ఉద్యోగుల జీతాలు చెల్లించటానికి కూడా అప్పులు చేయవలసి వస్తున్నదని, అదనంగా ఉద్యోగాలలోకి తీసుకోవటం, ఇతర పథకాలను అమలు చేయటం సాధ్యం కాదనే వాదన చేస్తారు.

కానీ అసలు సమస్య ఆదాయం లేకపోవటం కాదు. వస్తున్న ఆదాయం దోపిడిదారుల చేతులలోకి పోవటమే ప్రధాన సమస్య. దేశంలోని సహజ వనరులు, ఉత్పత్తి అవుతున్న సంపదను బడా పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, భూస్వాములు, సామ్రాజ్యవాదులకు అప్పగించే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఫలితంగా దేశప్రజలు ఉత్పత్తి చేస్తున్న సంపదలో మూడింట రెండు వంతులు దేశ, విదేశీ దోపిడిదారుల చేతులలోకి పోతున్నది. ఆ సంపద ప్రభుత్వ ఖజానాకు జమ కావటానికి అవసరమైన విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవాలి. ప్రభుత్వం వద్దకు చేరిన ధనాన్ని వేతనాలు పెంచటం, ఉచిత విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ పథకాల రూపంలో తిరిగి ప్రజలకు అందించటం ద్వారా సంపద పెంపుదలలో అసమానతలను చాలా వరకు సరిదిద్దవచ్చు.

దేశంలోని సంపన్న వర్గాల ప్రయోజనాలకు నష్టం కలిగించే ఇటువంటి చర్యలు తీసుకోవటానికి మోడి ప్రభుత్వం విముఖంగా ఉన్నది. మోడి ప్రభుత్వం బడా పెట్టుబడిదారీ వర్గానికి ప్రతినిధిగా ఉండటంతో పాటు పార్లమెంటుకు ఎన్నికౌతున్న సభ్యులలో అత్యధికులు కోటీశ్వరులు, కాంట్రాక్టర్లు, బడా భూస్వాములు, బడా పెట్టుబడిదారులే ఉంటున్నారు. బడా పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధిగా ఉన్న మోడి అదాని, అంబానిలకు దేశ సంపదను కట్టబెట్టటంలో వెనుకాడడు. ట్రంప్‌ను పల్లెత్తి మాట అనడు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల తీరు కూడా అలాగే ఉన్నది. అమెరికా ప్రజలతో పాటు ప్రపంచ ప్రజలు ఛీ కొడుతున్న ట్రంప్ పేరును తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఒకరోడ్డుకు పెట్టింది. అదాని, అంబానిల సేవకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్రులు చాస్తున్నది. వనరులు, ఆదాయంతో పాటు ప్రజల ఆస్తులను కూడా బడా పెట్టుబడిదారులకు అప్పగించటమే కర్తవ్యంగా వీరు పనిచేస్తున్నారు.

ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించటంలో ప్రజా పోరాటాలలే ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. వివిధ వర్గాలు, తరగతుల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని సక్రమైన మార్గంలోకి మళ్ళించటం, పోరాటాలను తీవ్రం చేయటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. విధానాల మార్పు కోసం జరిగే పోరాటాలలో వారిని భాగస్వాములను చేయాలి.

*

**చదవండి! చదివించండి!!**

# Marxist

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

# స్వతంత్ర మహిళ సాహసోపేత ప్రయాణం

(2వ పేజీ తరువాయి)

అసలైన గమ్మత్తు ఇక్కడే ఉంది: ఈ చిన్న చిన్న విప్లవాత్మక చర్యలు ఆ పంజాబీ-ఖత్రీ కుటుంబంలో గుంభనంగా సాగుతూ ఉండడం వల్ల ఆ తల్లి కూతురు అయిన రొమిలా తన జీవితంలో వాటిని అనుసరించగలిగింది. ప్రతిదీ కట్టుదిట్టంగా భద్రపరచబడిన, సరిహద్దుల లోపలే జీవితం సాగే ఒక కంటోన్మెంట్‌లో నివసిస్తున్నప్పటికీ, ఐదేళ్ల థాపర్ అప్పుడు ఎంత జిజ్ఞాసతో ఉండేదో, ఇప్పుడూ – 94 ఏళ్ల వయసులోనూ– అంతే జిజ్ఞాసతో ఉంది. ప్రశ్నించాలనే, సమాధానాలు అన్వేషించాలనే, ఆరోగ్యకరమైన చర్చలు చేయాలనే తపన ఆమెలో ఇప్పటికీ అలానే ఉంది. తనపై అధికారం చలాయించడానికి ప్రయత్నించిన ఆంగ్లో–ఇండియన్ స్నేహితురాలిని ఆమె నిలదీసిన విధానమే, థాపర్ చిన్న వయస్సు నుంచే అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతోందని, లేదా కనీసం గళం విప్పుతోందని నిరూపిస్తుంది.

లాహోర్, రావల్పిండి, పెషావర్‌లలో గడిపిన ఆమె జీవితంలో ఆసక్తికరమైన కథలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు, ఒకవేళ తన పేరు 'రొమిలా కౌర్' అని ఉండి ఉంటే తాను ఎలాంటి వ్యక్తిగా మారి ఉండేదా అని ఆమె తరచూ ఆశ్చర్యపోతుంటుంది! చిన్న వయసులోనే పరిణతి చెందిన బుద్ధి ఆమెది. ప్రొఫెసర్ థాపర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. మాస్టర్జీతో ఆమె సంగీత పాఠాలు, 'దిల్‌రుబా' అనే సంగీత వాయిద్యాన్ని వాయించడం నేర్చుకోవడం, భజనలు పాడటం (వైష్ణవ విశ్వాసాల పట్ల నమ్మకం వల్ల), ప్రైవేట్ పాఠశాలల్లో విద్య, తన కౌమార వయసులో రక్షిత వాతావరణంలో జీవించడం..ఇవన్నీ చిన్ననాటి థాపర్‌ను ఒక పొరబాటు ఊహకు గురిచేశాయి. యుద్ధం చేస్తున్నది ఎప్పుడూ బ్రిటీషర్లేనని, ఆ గొడవలు భారతీయులుగా తమ జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపవని ఆమె అనుకునేది. కానీ ఒకరోజు, ఈ ఆలోచన తలకిందులైంది.

తన తండ్రి చికిత్స చేసిన పఠాన్‌లు పండుగల సమయంలో మిఠాయిలు పంపే వారనీ, కానీ బ్రిటీష్ ప్రాంతం కావడంతో వారిని కంటోన్మెంట్‌లోకి రావడానికి అనుమతించేవారు కాదనీ థాపర్ ఆర్ద్రంగా గుర్తుచేసుకుంటుంది; ఆ ముళ్ల తీగ అవతలి వైపు నుండి కూడా ప్రజలు ఎలా ప్రేమించారో, ఎలా జీవించారో..దాని వెనుక ఉన్న మానవత్వ పరిమళాన్ని ఆమె అర్థం చేసుకుంది. థాపర్ తండ్రి పట్ల ఉన్న కృతజ్ఞతతో, ఆ పఠాన్‌లు కంటోన్మెంట్ గేటు వద్ద ఉన్న గార్డుకు మిఠాయిలు ఇచ్చి వెళ్లేవారు. వారు ఆ వేడుకల్లో పాల్గొనలేక పోతున్నందుకు చిన్ననాటి థాపర్ విచారించేది.

1942లో ఆ కుటుంబం పూనాకు మారినప్పుడు, కంటోన్మెంట్‌లోని ఆ ఇంట్లో గోల్డ్ ఫిష్ ఉన్న ఒక చిన్న కొలను, ఒక ఫౌంటైన్ కలిగిన తోట ఉండేది. ఆ ఊరి స్పెషల్ అయిన చాట్, మిఠాయిలను ఆస్వాదించడానికి ఆమె దొంగతనంగా బయటకు వెళ్లేది; ఎందరో స్నేహితులు పరిచయమయ్యారు, కొందరు నిలిచారు, మరికొందరు దూరమయ్యారు. కాలక్రమేణా, దాదాపు 80 సంవత్సరాల తర్వాత జూమ్ (Zoom) కాల్ ద్వారా తన చిన్ననాటి స్నేహితురాలితో మళ్లీ కనెక్ట్ అయిన విషయాన్ని ఆమె ఎంతో ఆనందంగా గుర్తుచేసుకుంటుంది.

ఒక రకంగా చెప్పాలంటే, ఈ జ్ఞాపకాలు ఆమె చిన్ననాటి స్నేహితులకు అంకితం చేసిన ఒక గీతంలా అనిపిస్తాయి. వారితో కలిసి ఆమె తన బాల్యాన్ని మళ్లీ జీవించాలని, తనను "కూకూ అపా" వంటి ప్రత్యేక పేర్లతో పిలవాలని, మిలిటరీ బేకరీ నుండి వచ్చే బ్రెడ్– బటర్, గేదె పాలతో చేసిన ఇంట్లోనే తయారుచేసిన వెన్నను ఆస్వాదించాలని కోరుకుంటుంది.

**ఆక్స్‌ఫర్డ్ రోజులు**

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఆమె ప్రవేశ పరీక్ష "నాసిరకం"గా ఉందని భావించింది. అదే విశ్వవిద్యాలయం 50 సంవత్సరాల తర్వాత థాపర్‌ను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. లండన్ అంటే ఆమెకు స్వేచ్ఛకు పర్యాయపదంగా ఉంటే, ఢిల్లీ అంటే బందీగా అనిపించేది. ఆమెకు ఢిల్లీకి తిరిగి రావడం ఇష్టం లేనందున, నిరాశతో ఒక రీసెర్చ్ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకుంది. అది సాధించింది కూడా. అకడమిక్ రంగం (ఆమెకు ఇష్టం లేనిది) మరియు గృహిణి (ఆమె ఊహించుకోలేని పాత్ర) అనే ఈ రెండింటి మధ్య, ఆమె అకడమియానే ''తక్కువ ప్రమాదకరమైనది" గా ఎంచుకుంది. ఆమె 1958లో తన డాక్టరేట్ పూర్తి చేసింది. ప్రాచీన చరిత్రపై కోర్సు బోధించడానికి SOAS లో తాత్కాలిక ఉద్యోగం లభించింది. థాపర్ తండ్రి కొంత డబ్బు దాచిపెట్టారు. దానిని వివాహానికి లేదా చదువుకు ఉపయోగించవచ్చు. ఆమె రెండోదానికే మొగ్గు చూపింది. యూరోపియన్ రాజకీయ ఆలోచనలపై ఎరిక్ హాబ్స్‌బామ్ ఉపన్యాసాలకు హాజరు కావడం, ఇస్మత్ చుగ్తాయ్, సిమోన్ డి బోవార్ పుస్తకాలు చదవడం, చైనీస్ కళలపై సాయంత్రం కోర్సులలో చేరడం (ఆమె చైనీస్ ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్స్ చేసింది), ఆర్కియాలజీ నేర్చుకోవడం, ఇటాలిక్ కాలిగ్రఫీ అభ్యసించడం, బౌద్ధ సన్యాసులతో టేబుల్ టెన్నిస్ ఆడటం, లైబ్రరీలలో స్నేహితులు పై అరల్లో ఉన్న పుస్తకాలను అందుకోవడానికి నిచ్చెనను పట్టుకోవడం, ఆఫ్రికాను అన్వేషించడం నుండి ట్రాఫాల్గర్ స్క్వేర్, హైడ్ పార్క్‌లలో పోస్టర్లు చేతబట్టి ప్రదర్శనలలో పాల్గొనడం వరకు ఇలా ఎన్నో కార్యకలాపాలలో మునిగి తేలింది. థాపర్ ఒక టూత్‌పేస్ట్ ప్రకటన కోసం (ఆసియా ఎక్స్‌ట్రా ఆర్టిస్ట్‌గా) ఎంపికయ్యారు! ఒక సినిమా కోసం ఎక్స్‌ట్రా ఆర్టిస్ట్‌గా, ఆమె చీర కట్టుకుని, ఢిల్లీ రెస్టారెంట్ సెట్‌లో టేబుల్ వద్ద కూర్చోవలసి వచ్చింది.

**ఒక స్వతంత్ర మహిళ**

థాపర్ జ్ఞాపకాలు చదవడం ఒక ప్రయాణం లాంటిది. చాలా కావ్యాత్మకమైనది; స్వయంప్రతిపత్తి, విముక్తి, స్వేచ్ఛల కోసం నిరంతరం సాగే అన్వేషణ. ఈ ప్రయాణాన్ని మరొకరు పునరావృతం చేయడం దాదాపు అసాధ్యం, కానీ అది చదువరిని మనలోనే బుద్ధుడు ఉన్నాడని గుర్తించేలా చేస్తుంది. ప్రతి ఉదయం మనం మళ్లీ జన్మిస్తాము.

ఈ దేశం, ఈ దేశ ప్రజల నాడిని తెలుసుకోవడంపై ఆమెకు తగని ఆసక్తి ఉంది. అది మతం అయితే, మతంలో సంస్కృతులను ప్రత్యేకంగా మార్చేది ఏమిటి? లేదా ప్రజల నమ్మకాలు, విశ్వాసాల గురించిన ప్రత్యేకత ఏమిటి? ఆమె ప్రశ్నలు జీవితకాల పరిశీలనల నుండి ఉద్భవించాయి. జాతీయవాద మెజారిటీ దృక్పథాన్ని ప్రశ్నించాలని థాపర్ వాదిస్తుంది. లౌకికవాదం అంటే అన్ని మతాల సహజీవనం మాత్రమే కాదు, "సామాజిక సంస్థలను మతం నియంత్రించని" స్థితిని సూచించే భావజాలం అని ఆమె రాస్తుంది.


స్వయంప్రతిపత్తి విషయానికి వస్తే, థాపర్ తన తల్లితో ఉన్న బంధం కాలక్రమేణా మరింత అర్థవంతంగా, సాంప్రదాయ తల్లి–కూతుళ్ల బంధానికి అతీతంగా ఎదిగింది. ఆమె తన తల్లి నుండి స్వయంప్రతిపత్తిని పొందింది. జీవిత తరువాతి అంకంలో ఆమె బెట్టీ ఫ్రైడన్ ('ది ఫెమినిన్ మిస్టిక్' రచయిత్రి) ను కలిసి ఒక స్వతంత్ర మహిళగా జీవించడం అంటే ఏమిటో చర్చించింది.

ఇది ఒక చరిత్రకారిణి జ్ఞాపకాల సమాహారం, ఒక మహిళా చరిత్రకారిణి జ్ఞాపకాల సుమమాల, ఒక భారతీయ మహిళా చరిత్రకారిణి స్మరణ, ఒక రాజకీయ, అవివాహిత భారతీయ మహిళా చరిత్రకారిణి జ్ఞాపకాలు. గత వందేళ్ల భారతదేశాన్ని సింహావలోకనం చేసుకునే ఈ లోతైన వ్యక్తిగత రచన నుండి రాబోయే తరాల భారతీయులు ఎంతో జ్ఞానాన్ని పొందవచ్చు. థాపర్ జ్ఞాపకాల భాండాగారం మనం తెరవడానికి సంకోచించే ఒక తలుపును తెరుస్తుంది, ఎందుకంటే అది మనం ఒకప్పుడు ఎలా ఉన్నామో, ఇప్పుడు ఎలా ఉన్నామో రేపటి రోజున ఎలా మారే అవకాశం ఉందో మనకు వివరిస్తుంది.

(అనువాదం: కె. సత్యరంజన్)

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 22, issue: 2 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# అత్యంత అప్రతిష్టాకర దేశాల జాబితాలో అగ్రస్థానంలో ఇజ్రాయిల్, అమెరికా




ప్రపంచ ప్రజలు వివిధ దేశాలను ఏ దృష్టితో చూస్తున్నారు, ఆయా దేశాలను ఎంతవరకు ఇష్టపడుతున్నారు, ఎంతవరకు ఇష్టపడ్డంలేదు అని 2026లో జరిపిన ఒక సర్వేలో అత్యంత ఏహ్యాభావంతో చూస్తున్న దేశాల్లో ఇజ్రాయిల్ ప్రథమ స్థానంలో నిలవగా అగ్రరాజ్యం అమెరికా నాల్గవ స్థానంలో ఉన్నది. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే దేశాల్లో స్విట్జర్లాండ్, కెనడా మొదటి స్థానంలో, జపాన్ రెండవ స్థానంలో నిలిచాయి. డెమోక్రసీ పెర్సెప్షన్ ఇండెక్స్ 2026 మొత్తం 85 దేశాల్లో సర్వే చేయగా చాలా ఆసక్తికరమైన అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

మొత్తం 85 దేశాలకుగాను సర్వే ఆధారంగా +100 నుండి −100 వరకు ర్యాంకులు ఇవ్వగా భారత దేశం −2 పాయింట్లతో ఇతరులు ప్రతికూలంగా చూస్తున్న దేశాల జాబితాలో 11వ స్థానంలో ఉన్నది. −24 పాయింట్లతో ఇజ్రాయిల్ ప్రజల దృష్టిలో అత్యంత ఎక్కువ ప్రతికూల దేశంగా నిలిచింది. తరువాతి నాలుగు స్థానాల్లో వరుసగా ఆఫ్ఘనిస్థాన్, ఉత్తర కొరియా (−19), ఇరాన్ (−17), అమెరికా (−16), ఇరాక్ (−13)లు నిలిచాయి. ప్రజలు ప్రతికూల దృష్టితో చూస్తున్న దేశాల్లో దక్షిణాసియాలో భారత్ (−2)తో సహా పాకిస్తాన్ (−6), బంగ్లాదేశ్ (−3)లు ఉన్నాయి.

ప్రజలు సానుకూలంగా చూస్తున్న దేశాల్లో అత్యధిక యూరోపియన్ దేశాలు ఉన్నాయి. స్విట్జర్లాండ్, కెనాడాలు +36 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, ఆసియా ఖండానికి సంబంధించి జపాన్ (+34) రెండవ స్థానాన్ని ఆక్రమించింది. ప్రజలు సానుకూలంగా చూస్తున్న దేశాల జాబితాలో +9 పాయింట్లతో వియత్నాం 20 స్థానాన్ని ఆక్రమించగా, +7 పాయింట్లతో చైనా 22వ స్థానంలో నిలిచింది.

ఆయా దేశాలను ఇతర దేశాలు ఏ విధంగా చూస్తున్నాయి అన్నదానిపై ఆయా దేశాల పర్యాటక రంగం అభివృద్ధి, వాటి దౌత్యపరమైన ప్రభావం ఆధారపడి ఉంటాయి. ప్రజలు ప్రతికూలంగా చూసే దేశాల్లో ఒకే ఒక అభివృద్ధి చెందిన దేశం − అమెరికా ఉండడం దాని దిగజారిపోతున్న అంతర్జాతీయ ప్రతిష్టకు నిదర్శనం.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 15**, సంవత్సర చందా:**రూ. 150**, పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు........................................................

వీధి.......................................................................

గ్రామం.....................................................................

మండలం లేదా పట్టణం...........................................

జిల్లా.........................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.